


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ



fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam and ongole | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 215 | విజయవాడ, శనివారం 5 ఆగస్టు 2017 | 12 + 8 పేజీలు వెల : 4.00



రాహుల్ కారుపై
రాళ్ల దాడి

- దాడులకు భయపడను : రాహుల్ ట్వీట్
- గుజరాత్ వరద బాధిత ప్రాంతాల్లో పర్యటన
- బాధితులకు ఓదార్పు
- తక్షణ సహాయక చర్యలకు డిమాండ్

ధనేరా (గుజరాత్) : గుజరాత్‌లో వరద బాధిత ప్రజలను పరామర్శించేందుకు వెళ్లిన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాహుల్ గాంధీ కారుపై శుక్రవారం గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. బనస్కాంత జిల్లాలో జరిగిన ఈ దాడిలో ఆయన కాన్వాయ్‌లోని ప్రయివేటు ఎస్‌యువి కారు ధ్వంసమైంది. దుండగులు పెద్దపెద్ద రాళ్లు విసరడంతో కారు వెనుక భాగం అద్దాలు, ప్యానెల్స్ పగిలిపోయాయి. ఈ ఘటనలో రాహుల్ గాంధీ ప్రత్యేక భద్రతాధికారి ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. ముందు సీట్లో కూర్చోవడంతో రాహుల్ గాయపడలేదు. దాడి అనంతరం కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వాలపై రాహుల్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రాళ్ల దాడులకు, నల్ల జెండాలకు తాను భయపడి వెనుదిరిగిపోన'నీ ఆయన ట్వీట్ చేశారు. ఇది ఎంతో అవమానకరమైన సంఘటన అని, బిజెపి కార్యకర్తలే పథకం ప్రకారం దాడి జరిపారని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా పేర్కొన్నారు. దీనిపై స్పందిస్తూ ఇది దురదృష్టకర సంఘటన అని, ఈ దాడితో తమ పార్టీకి ఏ విధమైన ప్రమేయం లేదని బిజెపి ఎంపీ జగదాంబికా పాల్ తెలిపారు. రాహుల్ కారుపై దాడి జరిగినట్లు బనస్కాంత పోలీసు సూపరింటెండెంట్ నీరజ్ బడ్గుజార్ ధృవీకరించారు. బనస్కాంత జిల్లా ధనేరాలోని వరద బాధితులను పరామర్శించిన తరువాత తిరిగి తన హెలిపాడ్ వద్దకు రాహుల్ వెళ్తుండగా దాడి జరిగిందని చెప్పారు.

అప్పులు 10 వేల కోట్లు..!



నెల	రుణం (రూ.కోట్లలో)	చెల్లింపు గడువు (సంవత్సరాల్లో)
ఏప్రిల్	2000	10
మే	1200	13
జూన్	1200	10
జూన్	1200	12
జులై	2000	12
జులై	1000	11
ఆగస్టు	2000	12
మొత్తం	10,600	

- నాలుగు నెలల్లో సర్కారు ఘనత
- తాజాగా 2 వేల కోట్లకు అర్జీ
- నిర్వహణ ఖర్చే తడిసి మోపెడు


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అప్పుల కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆరాటం తార స్థాయికి చేరింది. ఆర్థిక సంవత్సరం ప్రారంభమై కేవలం నాలుగు నెలలే పూర్తయ్యాయి. ఈ స్వల్ప వ్యవధిలోనే సెక్యూరిటీలను తనఖా పెట్టి తీసుకున్న రుణం రూ. 10 వేల కోట్లు దాటిపోయింది. అతి తక్కువ కాలంలో ఎక్కువ రుణాన్ని తీసుకోవడం చాలా సంవత్సరాల తరువాత ఇదే ప్రథమమని అధికారులు చెబుతున్నారు. తాజాగా ఈ శుక్రవారం దరఖాస్తు చేసుకున్న రెండు వేల కోట్ల రూపాయలతో ఇంతవరకు చేసిన అప్పు రూ.10,600 కోట్లకు చేరుకుంది.ఈ ఏడాది ఏప్రిల్ చివరి వారంలో తొలిసారిగా పది సంవత్సరాల చెల్లింపు కాల పరిమితితో రెండు వేల కోట్ల రూపాయలను రుణంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం, మే నెల్లో 13 ఏళ్ల చెల్లింపు గడువుతో 1200 కోట్లు, జూన్‌లో పదేళ్ల గడువుతో 1200 కోట్లు, 12 ఏళ్ల గడువుతో 1200 కోట్లు రెండు సార్లు రుణం తీసుకుంది. జులైలో కూడా రెండు సార్లు రుణం తీసుకుంది. 12 సంవత్సరాల గడువుపై రెండు వేల కోట్లు ఒకసారి, 11 సంవత్సరాల గడువుతో వెయ్యి కోట్లు ఇంకోసారి రుణం తీసుకోగా, ఆగస్టులో 12 ఏళ్ల గడువుతో మరో రెండు వేల కోట్లకు దరఖాస్తు చేసుకుంది.

ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 26,800 కోట్లు రుణాలుగా తీసుకోవాలని బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించింది. కానీ ఈ మొత్తానికి ఇంకా కేంద్రం నుంచి అనుమతి రాలేదు. జిఎస్‌డిపి మేర రాష్ట్రానికి అంత భారీ మొత్తానికి అనుమతి ఉండదని కేంద్రం చెబుతోంది. అయినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మొత్తం రుణం తీసుకునేందుకు అనుమతి వస్తుందన్న ఆశతోనే బడ్జెట్‌లో భారీ మొత్తాన్ని ప్రతిపాదించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఇంత పెద్ద మొత్తంలో చేస్తున్న అప్పు నిధులు దేనికి ఖర్చు చేస్తున్నారన్నది స్పష్టం కావడం లేదు. అయితే ఎక్కువ నిధులను పాలన పరమైన అంశాలకే ఖర్చు చేయాల్సి వస్తోందని, జీతాలు తదితర అంశాలకు నిధుల కొరతను రుణ నిధులతో భర్తీ చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అందుకే పునరుత్పత్తి రంగాలకు ఈ నిధులు ఖర్చు చేయలేకపోతున్నామని కూడా వారు అంగీకరిస్తున్నారు. వివిధ రంగాలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను వేరే రంగాలకు తరలించే విధానం పెరుగుతోంది. గతంలో కూడా ఇటువంటి ఆరోపణలు వచ్చాయి. తాజాగా దీనిపై దృష్టి సారిస్తున్న ఆర్థిక శాఖ, వాస్తవంగా బదలాయింపు జరుగుతున్న నిధులపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

ఏమేరకు నిధులు పక్కదారి పట్టాయి, అందుకు కారణాలు ఏమిటన్న కోణంలో అధ్యయనం చేస్తున్నట్లు ఆర్థికశాఖ అధికారి ఒకరు వెల్లడించారు.



నేడు ఉప రాష్ట్రపతి పోలింగ్

- రాత్రి 7లోపు ఫలితాల వెల్లడికి అవకాశం
- విప్ జారీ లేదు
- గోపాలకృష్ణ గాంధీకి 21 పార్టీల మద్దతు

8



అయేషా మీరా కేసు

- పునర్ విచారణకు సిట్
- సిట్‌లో డిఐజి స్థాయి అధికారితోపాటు మహిళా అధికారులు

2

చతికిల పడ్డ చదువులు

- మూడో తరగతిలో చదవగలిగేది 22 మందే!
- కూడికలు వచ్చింది 48 మందికే

2

బిజెపిది ద్వంద్వ వైఖరి

- సిపిఎం పొలిట్‌బ్యూరో విమర్శ
- శాంతి కోసం కేరళ సిఎం కృషి
- చర్చలపైనా పరివార్ ప్రశ్నలు
- కాషాయ గూండాల చేతిలో 13 మంది సిపిఎం సభ్యుల హత్య

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ - న్యూఢిల్లీ

కేరళలోని తిరువనంతపురం జిల్లాలో బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్‌కు సిపిఎంకు మధ్య జరిగినట్లు చెబుతున్న ఇటీవలి దాడులకు సంబంధించి బిజెపి నాయకత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఘర్షణలు పునరావృతం కాకుండా శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు సిపిఎం, బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర నాయకులతో గత జులై 31న కేరళ ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించి నిర్ధిష్ట నిర్ణయాలు చేశారు. దీనికి కొనసాగింపుగా మరో మూడు జిల్లాల్లోనూ ఇలాంటి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆ సమావేశాలు కూడా ముగిశాయి. ఘర్షణల నివారణకు ఇరువైపులా కట్టుబడుతూ హింసకు ఎవ్వరు పాల్పడినా సరే పోలీసులు చర్యలు తీసుకోవాలని ఒక కార్యాచరణ కూడా రూపొందించారు. ఈ క్రమంలోనే ఈ నెల 6న అఖిల పక్ష సమావేశం కూడా నిర్వహించనున్నారు. సౌహార్ధత నెలకొంటున్న ఇలాంటి సమయంలో బిజెపి కేంద్ర నాయకత్వం, కేంద్ర మంత్రులు కేరళలోని సిపిఎంకు వ్యతిరేకంగా నిరాధారమైన, పక్షపాతంతో కూడిన ఆరోపణలు చేయడాన్ని పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఆక్షేపించింది.బిజెపి ప్రధానకార్యదర్శి భూపేంద్ర యాదవ్, కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ మరింత

మిగతా 8లో

రాజేంద్రసింగ్‌పై దౌర్జన్యం



యాత్ర వాహనం ఫ్లెక్సీల చించివేత

- యాత్రకు అడుగడుగునా టిడిపి అడ్డంకులు
- రాజధానిలో వాహనాల ఫ్లెక్సీల చించివేత
- పోలీస్ పహారాతో బృందం పర్యటన

ప్రజాశక్తి - తాడేపల్లి, మంగళగిరి రూరల్, తుళ్లూరు

కృష్ణానది పరివాహక పరిరక్షణ బృందం యాత్ర శుక్రవారం కృష్ణా జిల్లా నుండి గుంటూరు జిల్లాలోకి ప్రవేశించింది. ఈ బృందాన్ని టిడిపి నాయకులు అడుగడుగునా అడ్డుకున్నారు. ఆ బృందం వాహనాలపై ఉన్న ఫ్లెక్సీలను చింపే శారు. తొలుత తాడేపల్లి, తుళ్లూరు మండలాల్లోని పలుగ్రామాల్లో బృంద నాయకులు రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్, నేచురల్ సిటీస్ రూపకర్త ప్రొఫెసర్ విక్రమ్‌సోనీ, ఏక్తా పరిషత్ చైర్మన్ రాజగోపాల్, ఆర్థిక సామాజిక పట్టణ పరిశోధన నిపుణులు ప్రొఫెసర్ రామచంద్రయ్య, జలసాధన సమితి అధ్యక్షులు దూచెర్ల సత్యనారాయణ, పర్యావరణ పరిరక్షకుడు గోవిందాచార్యులు పర్యటించారు. ఉండవల్లి ఎత్తిపోతల పథకం నిర్మాణం జరుగుతున్న కృష్ణానది వద్ద పరిరక్షణ యాత్ర బృందం సభ్యులు విలేకరులతో మాట్లాడారు. కృష్ణానది పక్కనే ఈ లిఫ్టు పనులను ప్రభుత్వం అనవసరంగా ప్రారంభించిందన్నారు. ప్రభుత్వం ఖర్చు పెడుతున్న రూ.230 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని విమర్శించారు. ఈ క్రమంలో రాజధానికి భూములిచ్చిన వారు బృందంతో గొడవకు దిగారు. ఈ సమయంలోనే భూములు ఇవ్వని వారు రావడంతో కొంత ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మంగళగిరి సిఐ మధుసూధన రావు, తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్ కుమార్ అక్కడకు చేరుకుని గొడవ పడుతున్న ఇరు గ్రూపులకు సర్దిచెప్పి పంపించారు. అనంతరం బృందం కురగల్లు మీదుగా సచివాల యం పరిశీలించేందుకు

మిగతా 9లో



2018 టార్గెట్

- అవసరమైతే బిజెపిని ప్రశ్నిస్తాం
- 'వారు' రాజీనామా చేయనవసరం లేదు
- నంద్యాలలో మేమే గెలుస్తాం!
- ప్రజాశక్తితో గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి లోకేష్

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాలను 2018 సెప్టెంబర్ కల్లా పూర్తిచేస్తామని, దీనిలో గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, నిరుద్యోగ భృతికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి లోకేష్ తెలిపారు. అభివృద్ధి విషయంలో సహకరించకపోతే బిజెపినైనా ప్రశ్నిస్తామని, సహకరించనప్పుడు ఎవరైతే ఏంటన్నారు. అమరావతికి నిధుల కొరత ఉండదని, దీనికోసం రాజధాని ప్రాంతంలో నాలుగువేల ఎకరాలను వేలం పద్ధతిలో విక్రయిస్తామని చెప్పారు.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని నేరుగా చూస్తున్న పవన్‌కళ్యాణ్ 2019 నాటికి తమతో కలిసి వస్తాడని అనుకుంటున్నామని చెప్పారు. వైసిపి ఎమ్మెల్యేలు 21 మంది అభివృద్ధిని చూసి టిడిపిలోకి వచ్చారని, వారు రాజీనామా చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. వారి ఆలోచనను దృష్టిలో పెట్టుకునే వారికి మంత్రి పదవులు కల్పించామని వివరించారు. ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి ఏం లాభం చూసుకుని రాజీనామా చేశాడో ఆయనకే తెలియాలని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్వ్యూ వివరాలు క్లుప్తంగా:

ప్ర: గ్రామీణాభివృద్ధి కోసం ఏం చేయనున్నారు?

జ: గ్రామీణ ప్రాంతాల్లో సదుపాయాల కల్పనపై ఎక్కువ దృష్టి సారించాం. పన్నుల విషయంలో ప్రత్యేక వ్యవస్థను రూపొందిస్తున్నాం. అది పన్నులు నిర్ణయిస్తుంది. అవన్నీ స్థానిక సంస్థలకే చెందుతాయి. వాటి హక్కులు కాలరాస్తున్నామని చెబుతున్న మాటల్లో వాస్తవం లేదు. ఉపాధి హామీ పథకం ద్వారా వేలకోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. 2018 నాటికి

మిగతా 9లో

20 మంది వద్దే సంపద

జిడిపిలో 10% వీరిదే

- 7 నెలల్లో రూ.3.32 లక్షల కోట్లు
- ఒక్క శాతం బాబుల వద్ద 58%
- బ్లూ బర్గ్ తాజా నివేదిక

ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

దేశంలో అంతరాలు భారీగా పెరిగిపోతున్నాయి. నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా కొద్దిమంది వద్దే సంపద పోగుపడటం గతంలో కన్నా పెరుగుతోంది. బ్లూబర్గ్ తాజాగా విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం 20 మంది అపర కుబేరుల వద్ద దేశ సంపద భారీగా కేంద్రీకృతమైంది. ప్రస్తుత ఏడాది తొలి ఏడు నెలల కాలంలో వీరు దాదాపు రూ.3,32,637 కోట్ల మేర సంపదను పోగేసుకున్నారు. వీరి మొత్తం సంపద



విలువ దాదాపు 200 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.13,30,550 కోట్లకు) చేరింది. ఇది దేశ జిడిపి లో 10 శాతానికి సమానం. అదే సమయంలో ఒక్క శాతంగా ఉన్న మహాసంపన్నుల సంపద కూడా భారీగా పెరిగింది. మొత్తం దేశ సంపదలో 58శాతం వాటా వీరి వద్దే ఉందని బ్లూబర్గ్ తేల్చింది.

రూ.86వేల కోట్లు పెరిగిన అంబానీ..


బ్లూమ్‌బర్గ్ సంస్థ దేశంలోని బిలియనీర్ల సూచీ విశ్లేషణ ప్రకారం 2017 మొదటి ఏడు నెలల కాలంలో దేశంలోని 18 మంది ప్రముఖ వ్యాపారవేత్తల సంపద సగటున ఒక్కొక్కరి వద్ద రూ.6,400 కోట్లు (బిలియన్ డాలర్లు) లేదా అంతకంటే ఎక్కువగానే పెరిగినట్టుగా వెల్లడించింది. భారత బిలియనీర్లలో సన్ ఫార్మా దిలీప్ సంఘ్వీ తప్ప మిగతా అందరు కుబేరులు భారీగానే సొమ్మును వెనకేసుకున్నట్టుగా ఈ విశ్లేషణలో తెలిపింది. రిలయన్స్ సంస్థల అధినేత ముఖేష్ అంబానీ మొదటి ఏడు నెలల కాలంలో దాదాపు రూ.86,485 కోట్ల మేర సంపదను పెంచుకున్నారు. ముఖేష్‌కు తోడుగా ఇతర బిలియనీర్లయిన అదానీ గ్రూపునకు చెందిన గౌతమ్ అదానీ, విప్రో అజీమ్ ప్రేమ్‌జీ, డి-మార్ట్ సూపర్ మార్కెట్స్ అధినేత ఆర్.కె.దామనీల సంపద దాదాపు రూ.19,958-26,611 కోట్ల (3-4 బిలియన్ డాలర్ల) మేర పెరిగినట్లుగా బ్లూమ్‌బర్గ్ విశ్లేషించింది.

దామనీ ధనా..ధన్

ప్రముఖ బిలియనీర్, విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీకి సొంత సంస్థతో పాటు

మిగతా 9లో

సుష్మాపై హక్కుల తీర్మానాలు



- సభను తప్పుదోవ పట్టించారంటూ ప్రతిపక్షాల ఆరోపణ
- రెండు అంశాలపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు

8

చతికిల పడ్డ చదువులు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చదువులు చతికిల పడ్డాయి. విద్యార్థులు ఆయా తరగతులకు తగ్గ ప్రతిభను చాటలేకపోతున్నారు. మూడో తరగతికి వచ్చినా చదవడం రాని విద్యార్థులు, ఐదో తరగతిలో కూడా భాగహారాలు రాని విద్యార్థులు ఇంకా ఉన్నారంటే చదువుల పరిస్థితి ఏలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జాతీయ సగటు కంటే చదువుల విషయంలో ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడి ఉన్నట్లు పలు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. దేశ అక్షరాస్యత 74.04 ఉంటే రాష్ట్ర అక్షరాస్యత 67.01 శాతంతో తక్కువగా ఉంది. మూడో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో కేవలం 22.7శాతం మందే రాష్ట్రంలో చదవ గలుగుతున్నారని, మిగతా 77.3శాతం విద్యార్థులు చదవ లేకపోతున్నారని విద్య నివేదిక వార్షిక సర్వే-2016లో వెల్లడైంది. జాతీయ సగటు 25.1శాతం ఉండగా, రాష్ట్ర సగటు కేవలం 22.7 శాతమే ఉంది. కేరళ, హిమాచల్ రాష్ట్రాలు జాతీయ సగటు ఎపి కంటే ఎక్కువగా ఉన్నాయి. కేరళ 45.5శాతం ఉండగా, 47 శాతంతో హిమాచల్ ప్రదేశ్ ఉత్తమ రాష్ట్రంగా నిలిచింది. భాష వచ్చిన వారిలో కూడా జాతీయ సరాసరి కంటే రాష్ట్రం వెనకబడి ఉంది. జాతీయ సరాసరి 257 ఉండగా, రాష్ట్ర సరాసరి 253 ఉంది. 274 సరాసరితో తమిళనాడు ఉత్తమ రాష్ట్రంగా ఉంది. ఐదో తర గతి చదివే విద్యార్థుల్లో భాష రాని విద్యార్థులు ఉన్నారు. కూడికలు, తీసివేతలు విషయంలో కేరళ, తమిళనాడు రాష్ట్రాల కంటేనూ ఎపి విద్యార్థులే బెటర్‌గా ఉన్నారు. తమిళ నాడు 24.8శాతం, కేరళ 45.6శాతం కూడికలు, తీసివేతలు వచ్చిన వాళ్లు ఉంటే, ఎపి 48.1 శాతంతో వాటి కంటే బెటర్‌గా ఉంది. హిమాచల్ ప్రదేశ్ 57.4 శాతంతో ఉత్తమ రాష్ట్రంగా ఉంది. భాగహారాలు చేయగలిగిన విద్యార్థులు కేవలం 37.2 శాతం మంది మాత్రమే ఉన్నారు.


ఇందులో కూడా హిమాచల్ రాష్ట్రమే 53.7 శాతంతో ఉత్తమ రాష్ట్రంగా నిలిచింది. మరోపక్క రాష్ట్రంలో మధ్యలో చదువు మానేస్తున్న వారి శాతం కూడా ఆందోళనకరంగా ఉంది. ప్రాథమిక విద్య లో డ్రాపువుట్ల నిష్పత్తి 2016-17లో 2.38 శాతం ఉండగా, ప్రాథమికోన్నత విద్యలో 1.9 శాతంగా ఉంది. సెకండరీ విద్యలో 1.3 శాతం ఉంది. పాఠశాల విద్యలో నాణ్యత విద్య అందించే రాష్ట్రంగా కేరళ మొదటి స్థానంలో, తమిళనాడు నాలుగో స్థానంలో ఉంటే ఎపి 21వ స్థానంలో ఉంది.

పావు గంటలోనే పాస్ పుస్తకం

- కొత్త విధానాన్ని ప్రారంభించిన సిఎం
- విజయవాడలో ఎన్ఐసికి స్థలం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసి) రాష్ట్ర స్థాయి కార్యాలయానికి విజయవాడలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్ అండ్ బి భవన సముదాయంలో స్థలం కేటాయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రియల్‌టైమ్ గవర్నెన్స్‌తో ప్రజలకు నాణ్యమైన సేవలదించాలన్న తమ లక్ష్యానికి తోడ్పాటునందించాలని ఆయన ఎన్ఐసిని కోరారు. రెవిన్యూ శాఖ ప్రవేశపెడుతున్న ఐటి ఆధారిత సేవలను శుక్రవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ఐసి డైరెక్టర్ జనరల్ నీతావర్మతో కలిసి సిఎం ఎలక్ట్రానిక్ పట్టాదారు పాస్‌పుస్తకం పొందేందుకు రూపొందించిన విధానాన్ని ప్రారంభించారు. 'మీభూమి' వెబ్ పోర్టల్‌పై అధికారులు ఇచ్చిన ప్రెజెంటేషన్ ను తిలకించి సూచనలు చేశారు. చేతిలో ఉండే సెల్‌ఫోన్ ఆధారంగా ఫైల్ క్లియర్ చేసే సంస్కరణలు తీసుకువచ్చామ న్నారు. ఇ-ఆఫీస్ 2.0 వెర్షన్‌లో కొత్త ఆలోచనలు, ఆవిష్క రణలు తీసుకురావాలని సూచించారు. ఎపికి ఎటువంటి సహాయం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎన్ఐసి డైరెక్టర్ నీతావర్మ సిఎంకు తెలిపారు. 30కిపైగా అంశాలల్లో ఎపి ముందున్నట్లు చెప్పారు. మీ సేవా కేంద్రా లు, మీ భూమి పోర్టల్‌లో భూమి హక్కు పత్రం-పట్టాదార్ పాస్ పుస్తకం ముద్రణను 15 నిముషాల్లోనే పొందే వినూత్న సదుపాయం గురించి సిసిఎల్ఎ అనిల్ చంద్రపునీటా



సిఎంకు వివరించారు. పాత విధానం లో పుస్తకం కోసం నెల రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు రూ.25 ఖర్చుతో పావు గంటలోనే దీన్ని పొందే వీలు కల్పిం చామన్నారు. ఈ విధానం దేశంలోనే తొలిసారి అని అధికారులు తెలి పారు. భూశోధక్ మొబైల్ ఆండ్రాయిడ్ అప్లికేషన్‌తో పట్టా దారు పాస్ పుస్తకాలు సరైనవేనా అనేది పరిశీలించవచ్చని తెలిపారు. 48 లక్షల ఎఫ్ఎంబిలకు 39 లక్షల డిజిటలైజేషన్ పూర్తయ్యిందన్నారు. విజయనగరం, విశాఖ, గుంటూరు, కృష్ణా జిల్లాలో 34 ఎస్టేట్, ఇనామ్ గ్రామాల్లో సర్వే చురుగ్గా సాగుతుందన్నారు. ఈ సందర్భంగా యువ రైతుకు పాస్ పుస్తకాన్ని అందించిన సిఎం నూతన విధానంపై రైతులందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఐసి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి.సి మిశ్రా, యుఐడిఎఐ ఛైర్మెన్ జె.సత్యనారాయణ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సతీష్‌చంద్ర, మన్మోహన్‌సింగ్, అధనపు కార్యదర్శి రాజమౌళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం

పర్యాటక శాఖ కార్యదర్శి మీనా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టియు-142 నావల్ మారిటైమ్ ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియాన్ని వచ్చే నెలలో సందర్శకులకు అందుబాటు లోకి తీసుకురానున్నట్లు పర్యాటక శాఖ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా తెలిపారు. పర్యాటక ప్రాజెక్టులపై వెలగ పూడి సచివాలయంలో శుక్రవారం ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మ్యూజియం ఏర్పాటు పనుల పురో గతిపై చర్చించారు. రూ. ఐదు కోట్ల వ్యయంతో విశాఖలో ఈ మ్యూజియాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నౌకా దళ విజయాల్లో తనదైన భూమిక పోషించిన టియు-142 ఆర్కే బీచ్‌లో ప్రదర్శనశాలగా కొలువు దీరటం విశేషమ న్నారు. విమాన విడి భాగాలను తిరిగి బిగించే పనులు సాగుతున్నాయన్నారు. వందల కోట్ల రుపాయల విలువైన పర్యాటక ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, అవి పూర్తి కావడానికి కొంత సమయం పడుతుందని అన్నారు. విలేజ్ టూరిజం ప్రాజెక్టులు ఈ నెల 20 నాటికి ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక పెట్టుబడి దారుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో పూర్తి సమాచారం సిద్ధంగా ఉండాలన్నారు.

మరో రెండ్రోజులు ఎండలే..

- 24 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం
- కోస్తా, సీమల్లో ఉరుములతో కూడిన జల్లులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వేడిగాలులతో ప్రజలు సతమతమవుతున్నారు. చిరుజల్లులు పడాల్సిన సమయంలో ఎండలు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. విశాఖ, బాపట్ల, మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో సాధా రణం కంటే 4 నుంచి 5 డిగ్రీలు అదనంగా నమోదవు తున్నాయి. బాపట్లలో 38, మచిలీపట్నం 37, నెల్లూరులో 37, ఒంగోలు 38, విశాఖ 36.6 డిగ్రీల చొప్పున పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాత్రి పూట 28 నుంచి 29 డిగ్రీలకు చేరుకున్నాయి. దీంతో రాత్రిళ్లు అర్ధరాత్రి వరకు ఉక్కపోత, వేడి తగ్గడం లేదు. నైరుతి దిశ నుంచి కాకుండా పశ్చిమ, ఉత్తర దిశ నుంచి వేడి గాలులు వీస్తున్నాయి. దీంతో కోస్తాలో ఒక్కసారిగా వేడి పెరిగింది. రుతుపవనాలు విరామం వల్లనే ఇలా జరుగుతోందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వివరించారు. ప్రస్తుతం 'మాన్‌సూన్ బ్రేక్' (హిమాలయాల్లో చిక్కుకున్న నైరుతి రుతుపవనాలు) కొనసాగుతోంది. మరో రెండు రోజులు ఇలాగే ఉంటుం దన్నారు. ఒకటి రెండు చోట్ల రాష్ట్రంలో క్యుములోనింబస్ వర్షాలు కురుస్తాయని తెలిపారు.

అల్పపీడనంతో కిందకు నైరుతి

బంగ్లాదేశ్‌కు ఆనుకుని ఈశాన్య బంగాళాఖాతంలో 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం నెలకొని ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది.

దీని చివరి భాగం నైరుతి వైపు వంగి ఉన్నట్లు తెలిపింది. ఇది రాగల 24 గంటల్లో అల్పపీడనంగా బలపడే అవకాశముందని అంచనా వేస్తోంది. దీనివల్ల హిమా లయాల్లో చిక్కుకున్న నైరుతి రుతుపవనాలు మళ్లీ వెనక్కి వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఆంధ్రప్రదేశ్‌లో పెద్దగా వర్షాలు కురిసే అవకాశం లేనప్పటికీ వాతావరణం చల్లబడుతుందని పేర్కొన్నారు. కోస్తా, సీమల్లో కొన్ని చోట్ల ఉరుములతో కూడిన ఓ మోస్తరు నుంచి చెదురుముదురు జల్లులు కురుస్తాయని తెలిపారు.

జగన్ వ్యాఖ్యలపై జనమే యోచించాలి

మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనంద్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగన్ చేసిన వాఖ్యలు ఆయన్ని జైల్లో పెట్టే విధంగా ఉన్నా ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోదని, ప్రజలే ఆలోచించుకోవాలని మంత్రులు కె అచ్చెన్నాయుడు, నక్కా ఆనంద్‌బాబు పేర్కొన్నారు. వెలగపూడి సచివాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. శ్రీలక్ష్మి లాంటి అధికారులు కూడా వైఎస్ అవినీతికి బలయ్యారన్నారు. ఉన్మాదిలాగా మాట్లాడుతున్న వ్యక్తుల్ని సమాజంలో తిరగకుండా చేస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. జగన్ లాంటి వారు సమాజానికి చీడపురుగులని, పిల్లల భవిష్యత్తుని నాశనం చేస్తారని తెలిపారు. తాత రాజారెడ్డి దగ్గర నుంచి ఉన్న నేరస్వభావం రాష్ట్రమంతా తెలుసన్నారు. నంద్యాల ఎన్నికల్లో టిడిపి తప్పకుండా విజయం సాధిస్తుందన్నారు. ఎన్నికల్లో లబ్ధిపొందాలని జగన్ ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. రాజకీయాలకు అర్హత లేని వ్యక్తిగా జగన్ తయారవుతారన్నారు. రాష్ట్రంలో జగన్ తిరిగితే తరిమికొట్టే రోజులు దగ్గర్లో ఉన్నాయన్నారు. జైలుకెళ్తాడని తెలిసి ఉన్మాదిగా ప్రవరిస్తున్నాడని, ఆయన విధానాలను మార్చుకోవాలని అన్నారు. రాష్ట్ర బాగు పడకూదని ఆలోచించే వ్యక్తి జగన్ అన్నారు. జగన్ ప్రవర్తనను వర్ణించే పదం డిక్షనరీలో కూడా లేదన్నారు.

జగన్ అరాచక శక్తి : కారెం శివాజీ

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఒక అరాచక శక్తి అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ వ్యాఖ్యానించారు. విజయవాడ స్టేట్ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నడిరోడ్డుపై సిఎం చంద్రబాబును కాల్చి చంపాలని జగన్ మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రజలు జగన్‌కు ఓట్లేయకుంటే అలా ఓట్లేయని వారందరిని కాల్చి చంపేస్తారా అని ధ్వజమెత్తారు. అధికార దాహం కోసం తండ్రి శవాన్ని అడ్డం పెట్టుకొని ఎమ్మెల్యేలతో సంతకాలు పెట్టించుకున్న దౌర్భాగ్యుడు జగన్ అని వ్యాఖ్యానించారు. జగన్‌కు రాష్ట్రాన్ని అప్పగిస్తే రాష్ట్ర భవిష్యత్తు ఏమవుతుందో ప్రజలు ఆలోచించాలన్నారు.

జగన్‌కు ఫ్యాక్షన్ బుద్ధి పోలేదు

డిప్యూటీ సిఎం కె.ఇ.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-నంద్యాల


వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి ఫ్యాక్షన్ బుద్ధి పోలేదని ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాలలోని టిడిపి కార్యా లయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి నోటి వెంట ఎన్నడూ అభివృద్ధి మాట రాదని, ఆయన ఎప్పుడూ అభివృద్ధికి అడ్డుపడ్డమే తప్ప మరొకటి లేదని అన్నారు. అభివృద్ధి పనులు జరుగుతుంటే వాటిలో అవినీతి జరుగుతుందని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. సాంప్ర దాయానికి విరుద్ధంగా అభ్యర్థిని పోటీలో నిలిపి బహిరంగ సభలో సంస్కారం మరచి నీచంగా మాట్లాడారన్నారు. ఆయన వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. జగన్‌కు ముఖ్యమంత్రి పిచ్చి పట్టిందని అన్నారు.

సంక్షేమ పథకాల్లో సామాజిక తనిఖీలు

సిఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు, అవినీతి అక్రమాలకు చెక్ పెట్టేందుకు సామా జిక తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు అవి ఏ మేరకు మేలు చేకూర్చాయనేదానికి సరైన పరిశీలన లేదన్నారు. అందువల్ల ఉపాధి హామీ పథకంలో మాదిరిగా ఎస్సీ ఎస్టీ సంక్షేమ పథ కాలపై సామాజిక తనిఖీ చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. సంక్షేమ గురుకుల పాఠశాలలన్నింటినీ మిగిలిన పాఠశాలలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలని చెప్పారు. జపాన్, చైనా వంటి దేశాల్లో అమలు చేసినట్లుగా వారానికి లేదా నెలకోసారి విద్యార్థులతో ఆయా ప్రాంగణాలను శుభ్రం



చేయించాలని సిఎస్ సూచించారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో డ్రాపవుట్స్ తగ్గించేందుకు విద్యార్థుల ఆధార్ సంఖ్య ఆధారంగా ఆన్‌లైన్ ట్రాకింగ్ విధానం అమలు చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు క్రమం తప్పకుండా జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జ్ఞాన భూమి కార్యక్రమం కింద 7,950 కళాశాలలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేశామని సాంఘిక సంక్షేమ ముఖ్యకార్యదర్శి ఎస్ఎస్. రావత్ సిఎస్‌కు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో 16 వేల మంది విద్యార్థులున్న 453 సాంఘిక సంక్షేమ వసతిగృహాలను రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చామని, 79 వేల మంది విద్యార్థులున్న మరో 730 వసతి గృహాలను రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చేందుకు ప్రతిపాదనలు రూపొందించా మన్నారు. గతేడాది అందజేసిన రుణాలు, ఎస్సీ యువతకు నైపుణ్య శిక్షణ గురించి వివరాలను ఎస్సీ కార్పొరేషన్ ఎండి విజయకుమార్ సిఎస్‌కు తెలిపారు.

ప్రజ్ఞ

1. ఏ మిషన్ కోసం నాసా-ఇస్రోలు కలిసి పనిచేస్తున్నాయి?
2. ఇరాన్ నూతన అధ్యక్షునిగా తిరిగి ఎన్నికైంది ఎవరు?
3. పంజాబ్‌లో డిఎస్పిగా నియామకం పొందిన భారత మహిళా క్రికెటర్ ఎవరు?
4. సూర్యుని ఉపరితలం కన్నా దాని కోర్ ఎన్ని రెట్లు వేగంగా పరిభ్రమిస్తుంది?
5. ఆంధ్రప్రదేశ్‌లోని ఏఏ విమానాశ్రయాలను ప్రభుత్వం గ్రీన్ ఎయిర్‌పోర్టులుగా గుర్తించింది?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రా యాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



ఆయేషామీరా కేసు పునర్ విచారణకు సిట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉమ్మడి రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫార్మశీ విద్యార్థిని ఆయేషామీరా హత్య, అత్యా చారం కేసు పునర్విచారణకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేస్తూ శుక్రవారం ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిఐజి స్థాయి అధికారితో పాటు మహిళా పోలీస్ అధికారులతో కూడిన సిట్‌కు పర్యవేక్షకునిగా విజయవాడ పోలీస్ కమిషనర్‌ను నియమిస్తూ జిఒ ఎమ్‌నం -132ను ప్రభుత్వం విడుదల చేసింది. 2007 డిసెంబరు 27న కృష్ణాజిల్లా ఇబ్రహీపట్నం వద్ద ప్రైవేటు హాస్టల్లో ఉంటున్న ఆయేషాపై గుర్తు తెలియని దుండగుడు అత్యాచారం చేసి పాశవి కంగా హత్య చేశాడు. మాజీ ఉప ముఖ్యమంత్రి కోనేరు రంగారావు బంధువులపై ఆరోపణలు రావడంతో ఈ కేసు రాజకీయంగా కీలకంగా మారింది. అప్పుడు విజయవాడ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సివి ఆనంద్ ఈ కేసును 24 గంటల్లో ఛేదిస్తామని ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. నిందితుల్లో కీలక రాజకీయ నేతల బంధువులు ఉండటంతో అప్పటి అధికార కాంగ్రెస్ ప్రభుత్వం కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తోందని టిడిపి ఆరోపించింది. అసెంబ్లీలోనూ ఈ కేసుపై చర్చ సాగింది.

ఆర్యవైశ్యులంతా టిడిపితోనే మంత్రి సిద్ధా రాఘవరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా అర్యవైశ్యులంతా టిడిపితోనే ఉంటా రని మంత్రి సిద్ధా రాఘవరావు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధికి అడ్డుపడుతున్న జగన్ చర్యలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చినా ఫర్వాలేదనిపిస్తోందన్న వ్యాఖ్యలు జగన్ క్రిమినల్ మనస్తత్వానికి అద్దం పడుతున్నాయని విమర్శించారు. ఇలాంటి వారు నంద్యాల ప్రజల్ని ప్రశాంతంగా ఉండనిస్తారా అని ప్రశ్నించారు.

వైసిపిలో నైతిక విలువలు : ఎమ్మెల్యే రోజా



ప్రజాశక్తి-నంద్యాల

వైఎస్ఆర్‌సిపి నైతిక విలువలున్న పార్టీ అని, ఆ పార్టీ ఎమ్మెల్యే రోజా పేర్కొ న్నారు. శుక్రవారం నంద్యాలలోని శిల్పా మోహన్‌రెడ్డి ఇంటిలో నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దాదాపు లక్ష మంది సమక్షంలో శిల్పా చక్ర పాణిరెడ్డి నైతిక విలువలతో తన పదవికి రాజీనామా చేశారన్నారు. 21 మంది వైసిపి ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి సంతలో పశు వుల్లా కొన్నారన్నారు. ఆయనకు దమ్మూ ధైర్యముంటే వారితో రాజీనామా చేయించి ఎన్నికల్లో సత్తా చూపాలని సవా ల్ విసిరారు. బోండా ఉమా, ఎస్సీ, ఎస్టీ, బిసి అని లేకుండా అందరి ఎమ్మెల్యేలను అసెంబ్లీలోనే పాతరేస్తానన్న మాటలు ఏమయ్యాయన్నారు. రాజారెడ్డి హత్యకేసుకు కారణమైన వారికి టిడిపి ప్రభుత్వం పదవులు ఎలా ఇచ్చిందో గుర్తించుకోవాల న్నారు. నారాయణరెడ్డిని ఉప ముఖ్యమంత్రి కెఇ. కృష్ణమూర్తి దారుణంగా హత్య చేయించిన విషయం ఈ జిల్లా వాసులు మర్చిపోలేదన్నారు. నంద్యాల ప్రజలు వైసిపికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి టిడిపికి బుద్ధ చెప్పాలన్నారు.



స్థానికుల సహకారం లేకుండా ఎలా నడుపుతారు?

- ఫ్యాక్టరీలోకి రొయ్యల లారీలు ఎలా వస్తాయి
- ఆక్వా ఫుడ్ పార్కు బాధిత గ్రామాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు పర్యటన

ప్రజాశక్తి-నరసాపురం రూరల్

పోలీసుల నిర్బంధం నడుమ కాలుష్యం వెదజల్లే మెగా ఆక్వా ఫుడ్ పార్కును జనావాసాల్లో పెడుతున్నారని, ప్రజల సహకారం లేకుండా ఎలా నడుపుతారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ప్రశ్నించారు. ఆక్వా ఫుడ్ పార్కు బాధిత గ్రామా లైన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం బేతపూడి, జొన్నలగరువు, భీమ వరం మండలం తుందుర్రులో ఆయన శుక్రవారం రాత్రి పర్యటించారు. ఇటీవల ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీలను ఆపిన రోజున ఏం జరిగిందని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ పరిశ్రమలకు తాము వ్యతి రేకం కాదని, కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను జనావాసాల మధ్య పెట్టవద్దనే తా ము డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పుతోనే ఈ ఫ్యాక్టరీ నిర్మాణం చేపడుతున్నారని చెప్పారు. చంద్రబాబు, కేంద్రం కలిసి ఆక్వా మెగా ఫుడ్‌పార్కుకు హామీ ఇచ్చారని, అందువల్లే ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఎంతకాలం నిర్బంధం పెట్టి గ్రామాల్లో పనులు చేపడతా రని, ఒకవేళ పనులైపోయినా ఫ్యాక్టరీలోకి రొయ్యల లారీలు ఎలా వస్తాయని ఆయన ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగ న్మోహన్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి తది తర రాష్ట్ర నాయకులంతా దీనిపై స్పందించి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలపా లని కోరారు. అన్ని పార్టీలనూ, అందరినీ కలుపుకుని ఈ నెలాఖరులోగా బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారామ్, నాయకులు జెఎన్‌వి గోపాలన్, కవురు పెద్దిరాజు, డి.కళ్యాణి, పి.పూర్ణ, ఆరేటి వాసు, ముచ్చర్ల త్రిమూర్తులు, ఆరేటి సత్యవతి, సముద్రాల వెంకటేశ్వరరావు ఉన్నారు.



ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్‌కు నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న శిల్పామోహన్‌రెడ్డి

వైసిపి అభ్యర్థి శిల్పా నామినేషన్

మూడో రోజు ఆరు దాఖలు

ప్రజాశక్తి-నంద్యాల క్రైం

కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికలకు వైఎస్ఆర్‌సిపి అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల పర్వం ప్రారంభమైన మూడో రోజు శుక్రవారం మొత్తం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నిర్ణ యించుకున్న ముహూర్తానికి మొదటి సెట్టు నామినేషన్‌ను దాఖలు చేసిన శిల్పా మోహన్‌రెడ్డి.. రెండోసెట్టు నామినేషన్‌ను స్వయంగా వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్‌కు అందజేశారు. నామినేషన్ సందర్భంగా ఎలాంటి హంగూ, ఆర్భాటం లేకుండా తన అనుచరులతో ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకుని పత్రాలు దాఖలు చేశారు. నంద్యాల ఉప ఎన్నికలకు ఇప్పటివరకూ ఆరుగురు అభ్యర్థుల నుంచి 13 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. వైసిపి అభ్యర్థిగా ఎస్.చంద్రమోహన్‌రెడ్డి మూడు సెట్లు, రవిచంద్ర కిషోర్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అబ్దుల్ ఖాదర్ ఒక సెట్టు, సుదర్శన్‌రెడ్డి ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. బిసి యునైటెడ్ ఫ్రంట్ నుంచి అబ్దుల్ సత్తార్ రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. రాయలసీమ పరిరక్షణ సమితి అభ్యర్థులుగా భవనాశి పుల్లయ్య ఒక సెట్టు, సమాజ్‌వాదీ పార్టీ నుంచి కె.రాఘవేంద్ర ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు.

నంద్యాలకు ఇంటిలిజెన్స్, సిఐడి బృందాలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

నంద్యాల ఉప ఎన్నిక మినీ కురుక్షేత్రంగా సాగనున్నదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఎన్నికలను అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. దీంతో ఆ నియోజకవర్గంలో ఓటర్ల నాడి, ఏయే వర్గాలు ఎవరికి అనుకూలంగా ఉన్నాయనే అంశాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సేకరించ దలిచింది. ఇందుకోసం ఇంటెలిజెన్స్, సిఐడి విభాగాల అధికారులను నంద్యాలకు పంపాలని ప్రభుత్వం నుంచి సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు మౌఖిక ఆదేశాలు పంపినట్లు సమాచారం. ఉప ఎన్నికల వేడి రాష్ట్రం మొత్తం మీద ప్రభావం చూపుతుందని భావిస్తుండటంతో టిడిపి ప్రభుత్వం.. మంత్రులను పెద్దస్థాయిలో నంద్యాల్లో దించింది. ఇందుకు ధీటుగా వైసిపి కూడా తమ రాష్ట్ర నేతలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను నంద్యాల్లో మకాం పెట్టించి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. గురువారం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాల సభలో చంద్రబాబుపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈనెల 9 నుండి 21 వరకు నంద్యాల నియోజకవర్గంలోనే మకాం ఉంటానని ప్రతిపక్ష నేత జగన్మోహనరెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఆ పార్టీ కదలికలను నిశితంగా గమనించేందుకు ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

16 లక్షల ఎకరాలు బీడు

కరువు అనంతపురం జిల్లాలో తిష్ట వేసింది. వరుసగా ఆరో ఏటా కరువు ఛాయలే కనిపిస్తున్నాయి. కారు మబ్బులు కమ్మడం మినహా చినుకు నేల రాలటం లేదు. ఖరీఫ్‌పై ఆశలు ఇప్పటికే ఆవిరయ్యాయి. వేరుశనగ విత్తుకునే అదును దాటిపోయింది. ప్రత్యామ్నాయమే దిక్కని శాస్త్రవేత్తలు తేల్చేశారు. 21 లక్షల ఎకరాల సాధారణ సాగుకు 16 లక్షల ఎకరాల్లో విత్తనం పడలేదు. అదంతా ఇప్పుడూ బీడుగానే ఉంది. ఖరీఫ్‌లో సాగు కోసమని సిద్ధం చేసుకున్న వేరుశనగ విత్తనాలను రైతులు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.



అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలంలో ఎండుతున్న వేరుశనగ పైరు

- 'అనంత'లో వరుసగా ఆరో ఏటా కరువు
- కారు మబ్బులే.. చినుకు లేదు..
- అదును దాటడంతో విత్తులు అమ్ముకుంటున్న రైతులు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 21 లక్షల ఎకరాలు. ఇందులో వేరుశనగ పంట ఒక్కటే 16 లక్షల ఎకరాల్లో సాగవుతుంది. తక్కిన ఐదు లక్షల ఎకరాలు పత్తి, ఆముదం, కంది తదితర పంటలు సాగవుతాయి. ఈ ఏడాది ఇప్పటివరకు వేరుశనగ పంట నాలుగు లక్షల ఎకరాల్లోనే సాగైంది. పత్తి 22,600 ఎకరాలు, కంది 39 వేలు, మొక్కజొన్న 7,130 ఎకరాల్లో సాగయ్యాయి. వరి, జొన్న, సజ్జ పంటలన్నీ కలిపి 4.80 లక్షల ఎకరాల్లోనే విత్తనం పడింది. వేసిన చోట వేరుశనగ పైరు వర్షాభావంతో ఎండిపోతున్నాయి. వాటిని కాపాడుకోవడానికి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

తీవ్ర వర్షాభావం

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్‌లో సాధారణంగా 63.9 మిల్లీమీటర్లు వర్షపాతం అవసరం. 59.2 మిల్లీమీటర్లే నమోదయింది. ఖరీఫ్‌కు కీలకమైన జులైలో 67.4 మిల్లీమీటర్లు వర్షం కావాల్సి ఉండగా.. 31 మిల్లీమీటర్లే పడింది. మండలాల వారీగా చూస్తే ఈ వ్యత్యాసం మరింత అధికంగా ఉంది. జిల్లాలో 63 మండలాలుంటే 14 మండలాల్లో తీవ్రంగానూ, 31 మండలాల్లో వ్యవసాయానికి ఉపకరించని వర్షాభావం నెలకొంది. జిల్లాలో భూగర్భ జలాలు గతంలో ఎన్నడూలేని విధంగా 26.28 మీటర్లలోతుకు పడిపోయాయి. భూగర్భ జలాలపై ఆధారపడి సాగు చేస్తున్న పైర్లు ఎండిపోతున్నాయి.

తుంగ'భద్రత' కరువు

అనంతపురం జిల్లాకు ఏకైక జలనరువగానున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు రావడం గగనమవుతోంది. తుంగభద్ర డ్యాంలో నీటి నిలువలు ఆశాజనకంగా లేవు. 41 టిఎంసిలే ప్రస్తుతమున్నాయి. తాగునీటికి మినహా సాగునీటికి నీరు విడుదల చేయలేమని అధికారులు చెబుతున్నారు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కింద కణేకల్, బొమ్మనహాళ్ మండలాల్లోని 30 వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. నిరుడు కూడా తుంగభద్ర నుంచి 23 టిఎంసిలు రావాల్సి ఉంటే 11 టిఎంసిలే వచ్చాయి. అప్పుడూ ఆయకట్టుకు పూర్తిగా నీరందలేదు. ఈసారి అదే పునరావృతమవుతుందన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.

ఉపయోగపడని రెయిన్‌గన్లు

మందుగుండు సామాగ్రి లేకుండా ఏ గన్ అయినా పని చేయదని చెప్పడానికి ఇది సజీవ సాక్ష్యం. ఒకవైపు వర్షాలు లేక నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం రెయిన్‌గన్‌ల ద్వారా పైర్లను రక్షిస్తామని గతేడాది నుంచి పెద్దఎత్తున ప్రచారం నిర్వహిసోంది. సాక్షాత్తు ముఖ్యమంత్రే వచ్చి రెయిన్‌గన్‌ల ద్వారా నీరిచ్చినా పెద్దగా ప్రయోజనం లేదని తేలిపోయింది. మళ్లీ ఈసారి అదే పంథాను జిల్లా మంత్రులు చేపట్టారు. ఈ ఏడాది గడిచిన వారం రోజుల్లో ఇచ్చింది రేయిన్‌గన్‌ల ద్వారా 69 ఎకరాలకు, స్ప్రింక్లర్ల ద్వారా 256 ఎకరాలకు మాత్రమే రక్షక తడులి వ్వగలిగారు.

దిగుబడి కష్టమని శాస్త్రవేత్తల సూచన

వేరుశనగ సాగుకు జూన్ ఆఖరు నుంచి ఆగస్టు మొదటి తేదీ వరకు అనువైన సమయం. దాటితే విత్తనం వేసినా దిగుబడి పెద్దగా ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జూన్ ఆఖరు నుంచి జులై నెలంతా ఒక్కసారి పొలాలు పదును కాలేదు. ఫలితంగా ఖరీఫ్‌లో వర్షాధారం కింద సాగు చేద్దామని సిద్ధం చేసుకున్న వేరుశనగ విత్తనాలన్నింటినీ అమ్ముకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో సాధారణంగా ఎకరానికి 50 కిలోల విత్తనం వేస్తారు. 16 లక్షల ఎకరాలకు సుమారు ఎనిమిది లక్షల క్వింటాళ్ల విత్తనాలు రైతులు సిద్ధం చేసుకున్నారు. ఇప్పుడు నాలుగు లక్షల ఎకరాల్లో సాగు చేసినదిపోనూ 12 లక్షల ఎకరాల్లో విత్తనం వేయకపోవడం వల్ల మిగిలిన ఆరు లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని తక్కువ ధరకు అమ్మేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



విత్తనాలు అమ్మేందుకు ఆటోలో తీసుకెళ్తున్న మహిళా రైతులు

పైరు ఎండిపోతోంది...



జూన్‌లో కురిసిన ఓ మో స్తరు వర్షానికి నాకున్న ఐదు ఎకరాల్లో వేరుశనగ వేశాను. జులై నెలంతా వర్షం రాకపో వడంతో పైరు ఎండిపోతోంది. రెయిన్‌గన్ల ద్వారానైనా పెట్టు కుందామంటే నీరులేదు. నిరుడు ఇదే రకంగా పైరు పెట్టి నష్టపోయారు. మళ్లీ ఈ సంవత్సరం ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఐదేళ్లుగా ఇదే రకంగా ఉంది. పంట పెట్టడం నష్టపోవడమే అవుతోంది. పెట్టుబడులూ చేతికందకుండా ఉంది. ఏమి చేయా లో దిక్కుతోచడం లేదు. వ్యవసాయమే మానుకోవడం మంచిదన్న ఆలోచన ఉంది.

- ఇటుక నల్లప్ప, సోదనపల్లి గ్రామం, శింగనమల మండలం

రూ.15 తక్కువకు విత్తుల అమ్మకం



నాకు నాలుగు ఎకరాల పొలముంది. వేరుశనగ విత్తనం సబ్సిడీతో 30 కిలోల బస్తా రూ.1350 చొప్పున మూడు బస్తాలిచ్చింది. ఇది ఎకరానికి కూడా సరిపోక బయట కొంత కొన్నాను. కొనే సమయం రవాణా, కూలి ఖర్చులన్నీ కలిపి ఒక్క కిలోకే రూ.100 వరకు ఖర్చయింది. వర్షం లేక, విత్తుకునే సమయం దాటిపోవడంతో విత్తనాన్ని కిలోకి 15 తగ్గించి 85కే ఇవ్వాలని వ్యాపారులు అడుగుతున్నారు. తక్కువ నష్టపోవడం మంచిదన్న ఆలోచనతో విత్తులు అమ్మేసుకుంటున్నాం. మరో మార్గం లేదు.

- వస్త్రానాయక్, మీటేనాయక్ తండా కదిరి మండలం

ప్రత్యామ్నాయ ప్రణాళికలు నివేదించాం



వేరుశనగ విత్తుకోవడానికి సమయమైపోయింది. ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేశాం. ఆగస్టులో వర్షాలొస్తే 13.22 లక్షల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే జిల్లాకు ప్రత్యామ్నాయ పంట విత్తనాలు ఏవేవి అంత అవసరమో నివేదికలను పంపించాం. 6,876 క్వింటాళ్ల జొన్నలు, 17,453 క్వింటాళ్ల ఉలవలు, 7,754 క్వింటాళ్ల అలసంద, 2,975 క్వింటాళ్ల కొర్రలు, 1,311క్వింటాళ్ల సజ్జలు వెయ్యి క్వింటాళ్ల కందులు, 769 క్వింటాళ్ల పొద్దు తిరుగుడు, 10,400 క్వింటాళ్ల పెసలు విత్తనాలను రైతులకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాక వాటిని రైతులకు అందుబాటులో ఉంచుతాం. ఆగస్టులో వర్షమెచ్చిన వెంటనే విత్తుకునేలా చర్యలు చేపడుతున్నాం.

- శ్రీరామమూర్తి జెడిఎ అనంతపురం



కోరుకొండ మండలం మునగాల గ్రామంలో పుష్కర జలాలు అందక నాట్లు పడని భూమి

'పుష్కర'పై పురుషోత్తపట్నం నీడ!

- హడావుడిగా పురుషోత్తపట్నం పనులు
- 1.85 లక్షల ఎకరాలకు అందని పుష్కర జలాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని ఈనెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్న నేపథ్యంలో పనులను వేగవంతం చేశారు. పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా మెట్టకు నీరు విడుదల చేస్తే పురుషోత్తపట్నం పనులకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో రెండు నెలలుగా సాగునీటి విడుదలను నిలిపేశారు. ఈ పథకం కింద ఆయకట్టులో పంటలు వేయాలా వద్దా అనే ఆలోచనలో రైతులున్నారు.

తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం వద్ద నిర్మించిన తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 18 మెట్ట ప్రాంత మండలాల్లోని 1.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. గోదావరి డెల్టా కాలువలకు జూన్ 1 నుంచి సాగునీటిని విడుదల చేసినా, పుష్కర ఎత్తిపోతల ద్వారా చుక్కనీరు విడుదల చేయలేదు. పుష్కర పంప్ హౌస్‌లో 8 పంపులు ఉన్నాయి. ఒక్కో పంపు ద్వారా 175 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉంది. ఈ నీటిని విడుదల చేస్తే పురుషోత్తపట్నం ఎత్తిపోతల పనులకు తీవ్ర అంతరాయం కలుగనుంది. పుష్కర నీటివిడుదల వల్ల పనులకు ఎలాంటి ఆటంకాలూ కలుగకూడదనే కారణంతో సాగునీటిని విడుదల చేయకుండా ఆపేశారు. ఫలితంగా మెట్టలో ఇంకా నాట్లు పడలేదు. నీటిని విడుదల చేయాలని మెట్ట రైతులు కోరుతున్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పనుల వల్ల ఇప్పటికే తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకానికి సాంకేతిక సమస్య ఏర్పడింది. ఈ పథకం కింద ఆయకట్టులో పంటలు వేయాలా వద్దా అనే ఆలోచనలో రైతులున్నారు.

నీరుగారుతున్న పుష్కర లక్ష్యం

ప్రస్తుత ఖరీఫ్‌లో పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా సీతానగరం మండలం నుంచి తుని వరకూ సాగునీరు అందించాలనేది నీటిపారుదల శాఖ లక్ష్యం. పుష్కర ప్రధాన కాలువ ద్వారా 88,158 ఎకరాలకు, 11 సబ్ లిఫ్టుల ద్వారా 97,750 ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉంది. లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. పుష్కర ఎత్తిపోతల నుంచి నీరు విడుదల కాకపోవడంతో ఇక్కడ ఆయకట్టులో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది.

'పుష్కర' నీటి కోసం ఎదురుచూస్తున్నాం

పుష్కర ఎత్తిపోతల పథకం ఆయకట్టు కింద కోరుకొండ మండలంలోని గాదరాడ, కాపవరం, మునగాల, రాఘవాపురం, నర్సాపురం, కోటి, కణుపూరు గ్రామాలున్నాయి. వర్షాలు కురవడంతో నారుమడులు వేశాం. పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందిస్తే దుక్కులు దున్ని నాట్లు వేస్తాం. డెల్టాలో నాట్లు పూర్తి కావొస్తున్నాయి. మెట్టలో సాగునీటి సమస్యతో సతమతమవుతున్నాం. ఇప్పటికైనా పుష్కర ఎత్తిపోతల ద్వారా నీరు విడుదల చేయాలి.

- తోరాటి శ్రీను, రైతు, మునగాల

బిల్డర్ల సమస్యల పరిష్కారానికి కృషి

క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభంలో మంత్రి పత్తిపాటి

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

రాష్ట్రంలో నిర్మాణ రంగానికి ప్రభుత్వం చేయూతనందిస్తోందని, బిల్డర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం స్థానిక సిద్ధార్థ గార్డెన్స్‌లో క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ - 2017 ప్రాపర్టీ షోని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన రాష్ట్రంలో నిర్మాణరంగానికి ప్రాధాన్యత పెరిగిందని, ముడిసరుకులైన సిమెంట్, ఇసుక, ఇనుము ధరలను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నోట్ల రద్దు వల్ల ఈ రంగం కొంత నష్టపోయినా భవిష్యత్‌లో నిర్మాణ రంగం కోలుకోగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రాపర్టీ షోలో అన్ని వర్గాలకూ ఉపయోగపడే విధంగా స్టాల్స్ ఉన్నందున గుంటూరు ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశ్చిమ శాసనసభ్యులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, కమిషనర్ చల్లా అనురాధ పాల్గొన్నారు.



ఇంద్రకీలాద్రిపై వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు

కిక్కిరిసిన ఇంద్రకీలాద్రి

వరలక్ష్మిదేవిగా కనకదుర్గమ్మ

ప్రజాశక్తి-గవర్నర్‌పేట (విజయవాడ)

విజయవాడ ఇంద్రకీలాద్రిపై సందడి నెలకొంది. శ్రావణమాసం రెండో శుక్రవారం కావడంతో పెద్దసంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. అమ్మవారిని వరలక్ష్మీదేవి రూపంలో అలంకరించారు. వరలక్ష్మీవ్రతం సందర్భంగా తొలిసారిగా అమ్మవారిని వరలక్ష్మిదేవి రూపంలో అలంకరించి యాత్రికులకు దర్శన ఏర్పాట్లు చేశారు. మరోవైపు మల్లిఖార్జున మహామండపం ఆరో అంతస్తులో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా సాధారణ యాత్రికులకు మెట్ల మార్గం ద్వారా ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సాగిన కార్యక్రమంలో ఈవో సూర్యకుమారి పాల్గొన్నారు. ఈనెలలోని మిగిలిన శుక్రవారాల్లోనూ వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

వికలాంగులకు విద్య మిథ్యేనా!

- వెస్ట్రన్ టాయిలెట్స్ నిల్
- కేర్‌టేకర్ల నియామకం ఏదీ!
- మొక్కుబడిగా ట్రైసైకిళ్లు, ఊత కర్రలు, చెవిటి మిషన్ల పంపిణీ
- విద్య ప్రాధాన్యతను తెల్పడంలో ప్రభుత్వం విఫలం



నెల్లూరులోని వికలాంగుల వసతిగృహం

ప్రజాశక్తి- నెల్లూరు సిటీ ప్రతినిధి

వికలాంగులకు భరోసా ఇవ్వాల్సిన సర్కారు సామాజిక బాధ్యతను విస్మరించింది. గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులకు విద్య ప్రాధాన్యతను విద్యార్థులకు తెలిపి స్ఫూర్తి నింపడంలో విఫలమైంది. వారి ప్రయాణ అవసరాలు తీర్చే ట్రైసైకిళ్లు, ఊతకర్రల పంపిణీ మొక్కుబడిగా సాగుతోంది. కాలం చెల్లిన చెవిటి మిషన్లు పంపిణీ చేసి చేతులెత్తేస్తోంది. వికలాంగులకు ప్రత్యేక పాఠశాల, మరుగుదొడ్ల (వెస్టర్న్ టాయిలెట్స్) నిర్మాణాల ఊసే ఎత్తడం లేదు. పభుత్వ చిత్తశుద్ధి లేమి, వికలాంగులైన పిల్లల తల్లిదండ్రుల్లో చైతన్య లేమి వెరసి నెల్లూరు జిల్లాలో 90 శాతం మంది వికలాంగ విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని తెలిసింది. 5 శాతం మందికి ఉచిత విద్య అమలు చేయాలని చట్టాలున్నా కాగితాలకే పరిమితం చేసింది.

జిల్లాలో 45 వేల మంది వికలాంగులున్నారు. వీరిలో 18 శాతం మంది 25 ఏళ్లలోపు వారున్నారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న వారు కేవలం 785 మంది మాత్రమే. కళ్లు లేని వారు 15 మంది, వినికిడి సమస్య ఉన్న వారు 105, మాటలు రాని వారు 52, దృష్టి లోపం ఉన్నవారు 15, శారీరక సమస్యలున్న వారు 27, మానసిక వికలాంగులు 418 మంది ఉన్నారు. వారితో పాటు బహుళ వైకల్యం ఉన్నవారు 45 , సెరెబ్రల్ పాలసీ ఉన్నవారు 54, అభ్యాసన లోపాలున్నవారు 42, ఆటిజం సమస్య ఉన్నవారు 12 మంది ఉన్నారు.

వికలాంగ విద్యార్థుల కోసం జిల్లాలోని 46 మండలాల్లో ప్రభుత్వం 16 భవిత, 30 నాన్ భవిత కేంద్రాలు ఏర్పాటు చేసింది. వికలాంగుల సంక్షేమ శాఖ నిర్వహణలో జిల్లా కేంద్రంలో బాలికల హాస్టల్ నిర్వహిస్తోంది. వాటితో పాటు, ఆయా విద్యార్థులు చదివే ఏ ఒక్క పాఠశాలలోనూ ఆధునిక మరుగుదొడ్లు (వెస్టర్న్ టాయిలెట్స్) లేవు. దీంతో తోటి విద్యార్థుల్లా కాలకృత్యాలు తీర్చుకోలేని దుస్థితి ఉంది. ఆ అవసరాల కోసం మరొకరి సాయం అవసరమవుతోంది. ఎవరూ సాయం రాకపోవడంతో ముఖ్యంగా బాలికలు విద్యకు స్వస్తి చెప్పి ఇంటికే పరిమితమవుతున్నారు. గడచిన రెండేళ్లలో వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 150 ట్రై సైకిళ్లు, 50 ఊత (చేతి) కర్రలు పంపిణీ చేశారు. వినికిడి లోపం ఉన్న విద్యార్థులు 105 మంది ఉంటే కేవలం 30 చెవిటి మిషన్లు అందజేశారు. వీటిలో ట్రై సైకిళ్లు, ఊత కర్రల్లో 10 శాతం కూడా విద్యార్థులకు అందిన దాఖలాలు లేవు. పంపిణీ చేసిన మూడు మిషన్లు కాలం చెల్లినవే (తాడుతో వేలాడే పాత మోడల్) కావడం విశేషం. వేల రూపాయలు ఖర్చు చేసి బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయలేక సామాజికంగా ఆయా విద్యార్థులు బలహీనపడుతున్నారు. విద్యతో దేన్నైనా జయించొచ్చనే ధైర్యాన్ని వికలాంగులకు ప్రభుత్వం కల్పించడం లేదు. పాఠశాలల్లో కేర్‌టేకర్లను ఏర్పాటు చేసి వారి బాధ్యతను తీసుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో వికలాంగుల హాస్టల్

నెల్లూరు జిల్లా కేంద్రంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల హాస్టల్ శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఊడిపోయిన తలుపులతో మరుగుదొడ్లు దయనీయంగా ఉన్నాయి. ఆ హాస్టల్‌లో పది మంది మాత్రమే విద్యార్థులున్నారు. ఆరో తరగతి విద్యార్థులు ముగ్గురు, ఏడో తరగతి విద్యార్థులు ఇద్దరు, ఎనిమిదో తరగతి విద్యార్థులు ఇద్దరు, తొమ్మిదో తరగతి విద్యార్థులు ఇద్దరు, మరొకరు అదనంగా (కారణం చెప్పలేదు) ఉన్నారు. ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు నెలకు రూ.750 ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులకు నెలకు రూ.850 చొప్పున చెల్లించడంతో పాటు అదనంగా కాస్మొటిక్ ఛార్జీలు రూ.75 ప్రభుత్వం చెల్లిస్తోంది. హాస్టల్‌ను గతేడాదే వృద్ధాశ్రమంగా మార్చే ప్రతిపాదనలు పెట్టినట్లు తెలిసింది.

కాపులు ఏం పాపం చేశారు

- నా పాదయాత్రకు ఇబ్బందులు ఎందుకు?
- పోలీసులపై ఆగ్రహించిన ముద్రగడ
- నిరసనగా మౌనదీక్ష

ప్రజాశక్తి-కిర్లంపూడి (తూర్పుగోదావరి)

కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పాదయాత్రను పోలీసులు శుక్రవారం నాలుగోసారీ అడ్డుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన నివాసం నుంచి ముద్రగడ తన అనుచరులతో పాదయాత్రకు సిద్ధమవుతుండగా ప్రధాన గేటువద్దే పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ముద్రగడ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కాపులు ఏం పాపం చేశారు. చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉండగా చేసిన పాదయాత్రకు ఇబ్బందులు లేనప్పుడు కాపులు చేసే పాదయాత్రకు ఇబ్బందులు ఎందుకు?' అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సర్కారుకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. నీచమైన పనులకు పాల్పడుతున్నారని, ఎల్లప్పుడూ ఇదే ప్రభుత్వం ఉంటుందని అనుకుంటున్నారమో, రాబోయే కాలంలో తగిన బుద్ధిచెప్పేందుకు కాపులు ఎదురుచూస్తున్నారని ఒఎస్‌డి రవిశంకర్‌తో ముద్రగడ అన్నారు. అనంతరం తన అనుచరులతో కలిసి పోలీసు వైఖరిని నిరసిస్తూ వెనుదిరిగి వెళ్లిపోయారు. ఆయన వెంట జెఎసి నేతలు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, ఆర్‌ఎస్ ప్రకాష్, గౌతుస్వామి, గుండా వెంకట్రావు, తుమ్మలపల్లి రమేష్ ఉన్నారు. కిర్లంపూడిలోనూ, కోనసీమలోని పలు ప్రాంతాల్లోనూ పోలీసు బలగాల మోహరింపు కొనసాగుతోంది.



ముద్రగడను అడ్డుకున్న పోలీసులు

కొనసాగుతున్న ఆందోళనలు

ముద్రగడ పాదయాత్ర అడ్డగింతను నిరసిస్తూ ఏలేశ్వరంలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ముమ్మిడివరం, ఆత్రేయపురం, రావులపాలెంలో ర్యాలీలు నిర్వహించారు. ముద్రగడ పాదయాత్రకు అనుమతించాలని కోరుతూ అమలాపురంలో ఆర్‌డిఒ గణేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

7న చుక్కపల్లి పిచ్చయ్య స్మారకోపన్యాసం

పర్యావరణ వేత్త డాక్టర్ సునీత నారెన్‌కు చుక్కపల్లి పిచ్చయ్య ఫౌండేషన్ పురస్కారం

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

ప్రముఖ వ్యాపారవేత్త చుక్కపల్లి పిచ్చయ్య 89వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 7న 'భారతదేశంలో సుస్థిరత, సమ్మిళత అభివృద్ధి దేనికి' అనే అంశంపై చుక్కపల్లి పిచ్చయ్య ఐదో స్మారకోపన్యాసం నిర్వహించనున్నట్లు పాపులర్ షూమార్టు మేనేజింగ్ పార్టనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. విజయవాడ గాంధీనగర్‌లోని షూమార్టు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులోని శేషసాయి కళ్యాణ మండపంలో సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. స్మారకోపన్యాసం చేసే ప్రముఖ పర్యావరణవేత్త, రచయిత డాక్టర్ సునీత నారెన్‌కు చుక్కపల్లి పిచ్చయ్య ఫౌండేషన్ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. చుక్కపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. సమావేశంలో చుక్కపల్లి ఫౌండేషన్ సభ్యులు చుక్కపల్లి విజయకుమార్, దేవభక్తుని సాంబశివరావు పాల్గొన్నారు.

జగన్‌ను సభ్యసమాజం నుంచి వెలివేయాలి

గుడా ఛైర్మన్ గన్ని కృష్ణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రజాస్వామ్య విధానానికి, వయసుకి, రాజకీయ అనుభవానికి విలువ ఇవ్వకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని సభ్యసమాజం నుంచి వెలివేయాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (గుడా) ఛైర్మన్ గన్ని కృష్ణ అన్నారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో 'చంద్రబాబుని నడిరోడ్డుపైన కాల్చినా ఫర్వాలేదని అనిపిస్తుంది' అని వ్యాఖ్యలు చేసిన జగన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గన్ని కృష్ణ శుక్రవారం ఫిర్యాదు చేశారు. తెలుగుదేశం పార్టీ లీగల్‌సెల్ ప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్‌కి వెళ్లిన కృష్ణ సిఐ పివి మారుతీరావుకు ఫిర్యాదు అందజేశారు.

సంపాదకీయం

ప్రగతిశీల వెబ్‌సైట్లపై గూగుల్ దాడి

ఇంటర్‌నెట్ దిగ్గజం గూగుల్ తాజాగా రూపొందించిన నిబంధనలు అంతర్జాల తటస్థతకు ఆశనిపాతంగా మారుతోంది. మూడు నెలలుగా సామ్యవాద, యుద్ధ వ్యతిరేక, ప్రగతిశీల వెబ్‌సైట్లు గూగుల్ సెర్చ్‌లో 45 శాతం మేర ట్రాఫిక్ కోల్పోవడమే దీనికి నిదర్శనం. గూగుల్ సెర్చ్ ప్రొటోకాల్స్‌లో ఉద్దేశపూర్వకంగా చేసిన మార్పు ఫలితంగానే ఇలా జరుగుతోందని ఇంటర్‌నెట్ వార్తా సంస్థల ప్రతినిధులు, సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఇఒ) నిపుణులు విశ్లేషిస్తున్నారు. 'ఇబ్బందికరమైన' వెబ్‌సైట్లను నిరోధించేందుకు, 'అధికారిక సమాచారాన్ని' మరింతగా అందుబాటులోకి తెచ్చే పేరిట కొన్ని నెలల క్రితం సెర్చ్ ఇంజిన్లలో చేసిన మార్పుల ఆచరణవాటి అసలు ఉద్దేశ్యాన్ని తెలియచేస్తోంది. ఈ మార్పుల ఫలితంగా గణనీయమైన సంఖ్యలో పాఠకులు గల 13 వెబ్‌సైట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. గూగుల్ నూతన ప్రోటోకాల్స్ వల్ల వరల్డ్‌సోషలిస్ట్‌వెబ్‌సైట్.ఆర్గ్ 67 శాతం ట్రాఫిక్‌ను కోల్పోయింది. ఆల్టర్‌నెట్.ఆర్గ్ 63 శాతం, గ్లోబల్‌రీసెర్చ్.సిఎ 62 శాతం, కన్సార్టియంన్యూస్.ఆర్గ్ 47 శాతం, సోషలిస్టువర్కర్.ఆర్గ్ 67 శాతం, మీడియామ్యాటర్స్.ఆర్గ్ 42 శాతం, కామన్‌డ్రీమ్స్.ఆర్గ్ 67 శాతం, ఇంటర్నేషనల్‌వ్యూవ్‌పాయింట్.ఆర్గ్ 36 శాతం, డెమొక్రసీనౌ 36 శాతం, వికిలీక్స్.ఆర్గ్ 30 శాతం, ట్రూత్–ఔట్.ఆర్గ్ 25 శాతం, కౌంటర్‌పంచ్.ఆర్గ్ 25 శాతం, ది ఇంటర్‌సెప్ట్.కామ్ 19 శాతం చొప్పున ట్రాఫిక్ పతనమైంది.

గూగుల్ వంటి గుత్త పెట్టుబడిదారీ ఐటీ కంపెనీలు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇటువంటి కుట్రలకు పాల్పడటానికి ప్రజానీకంలో అభ్యుదయ, సోషలిస్టు రాజకీయాలపట్ల ఇటీవల కాలంలో పెరిగిన ఆసక్తే ప్రధాన కారణం.

ముఖ్యంగా 2016లో గూగుల్ తన సెర్చి ఇంజిన్ ప్రొటోకాల్స్ మార్చటానికి 12 నెలల ముందు అనేక ప్రగతిశీల, సోషలిస్టు వెబ్‌సైట్లను దర్శించే పాఠకుల సంఖ్య ఊహించనంత భారీ స్థాయిల్లో పెరిగింది. ఈ పెరుగుదల గూగుల్ శోధనల్లో నమోదయింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం తరువాత ప్రజలలో సోషలిస్టు రాజకీయాలపట్ల విపరీతమైన ఆసక్తి పెరిగింది. ఈ ఆసక్తి 2017 ఏప్రిల్ నెలలో శిఖరాగ్రానికి చేరుకుంది. సరిగ్గా ఇదే సమయంలో గూగుల్ తన సెన్సార్‌షిప్ ప్రొటోకాల్స్ అమలు చేసింది. ఆ విధంగా ప్రగతిశీల వెబ్‌సైట్లను ప్రజలకు అందుబాటులో లేకుండా చేయటానికి గూగుల్ అమెరికా సామ్రాజ్యవాదం చేతుల్లో ఆయుధంగా మారి అనేక రకాల ప్రొటోకాల్స్ రూపొందించడం ఆందోళనకర పరిణామం. ఆంక్షలకు బలయ్యే ప్రగతిశీల వెబ్‌సైట్ల పట్టికను బహిరంగంగా రూపొందించడం గూగుల్ బరితెగింపునకు నిదర్శనం.

సామ్యవాద వెబ్‌సైట్లకు ప్రతికూల రేటింగ్ ఇవ్వటం ద్వారా వాటిలోని వ్యాసాలను అందుబాటులోకి రాకుండా గూగుల్ అడ్డుకట్ట వేస్తుంది. అంతేకాకుండా గూగుల్ ఎంపికలను, దాని రాగద్వేషాలను కంప్యూటర్లు అనుసరించే విధంగా ఒక నూతన ప్రోగ్రామింగ్ టెక్నాలజీని కూడా సృష్టించిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అంతిమంగా సోషలిస్టు, వామపక్ష, ప్రగతిశీల రాజకీయాలలో వాడే పారిభాషిక పదాలను, పద బంధాలను, వివిధ విషయాలను విస్మరించే టెక్నిక్‌లను ఈ ఆపరేషన్‌లో గూగుల్ వాడుతున్నది. యుద్ధం, భౌగోళిక రాజకీయాలు, సామాజిక అసమానతలు, కార్మికవర్గ పోరాటాలు వంటి విషయాలపై దృష్టిని సారించే వెబ్‌సైట్స్ గూగుల్ శోధనలలో కనిపించకుండా కనుమరుగైపోతాయి. దీంతో సాధారణ స్థితిలో 'సోషలిజం', 'మార్క్సిజం' వంటి విషయాలపై శోధించినప్పుడు అత్యంత ఎక్కువ సంఖ్యలో లిస్ట్ అయ్యే వెబ్‌సైట్ల సంఖ్య ప్రస్తుతం పడిపోయింది. మరింత పదునైన సాంకేతిక పరిజ్ఞానం ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తుందనటంలో సందేహం లేదు. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని బట్టి అర్థమవుతున్నదేమంటే ప్రజల ప్రజాస్వామిక హక్కులపై దాడి చేయటానికి కార్పొరేట్ రాజ్యం పన్నిన వ్యూహంలోనే గూగుల్ క్రియాశీలంగా పనిచేస్తోంది. సామాజిక అసమానతలను, యుద్ధాలను, నియంతృత్వాల పట్ల ప్రజల్లో పెరిగిన వ్యతిరేకతను ఉద్యమరూపంగా దాల్చకుండా చేయడానికి పెట్టుబడి వర్గానికి గూగుల్ సాధనంగా నిలుస్తోంది. గూగుల్ కుట్ర పూరితంగా నిబంధనల పేరిట చేస్తున్న ఈ దాడి కచ్చితంగా ప్రజల వాక్ స్వాతంత్ర్యంపై చేస్తున్న దాడిగానే పరిగణించాల్సివుంటుంది. ఇంటర్‌నెట్‌పై కార్పొరేట్ నియంత్రణ వాక్ స్వాతంత్ర్యానికి, స్వేచ్ఛాయుత ఆలోచనకు ప్రమాదకారిగా మారుతుండటం ఇంటర్నెట్ తటస్థత కాంక్షించే అభ్యుదయవాదులకు, ప్రజాస్వామ్యవాదులందరికీ పెను సవాలే. ప్రజల ప్రాథమిక హక్కులపై గూగుల్ చేస్తున్న ఈ దాడిని యావత్ ప్రపంచ ప్రజలంతా ప్రతిఘటించాలి. ఇంటర్‌నెట్ సెన్సార్‌షిప్ కార్యక్రమాన్ని వెంటనే నిలిపివేయాలనే డిమాండ్ అన్ని దేశాలలో ప్రతిధ్వనించాలి. ప్రపంచంలోని అన్ని భాషలలో గల ప్రగతిశీల వెబ్‌సైట్లపై సెన్సార్‌షిప్‌కు వ్యతిరేకంగా సాగించే ప్రతిఘటనా పోరాటం ప్రగతిశీల శక్తుల ఐక్యతకు ప్రతిబింబంగా నిలవాలి.

మహనీయుల మాట



ముఖస్తుతి చేసేవాడికి, వెన్నుపోటు పొడిచేవాడికి తేడా లేదు.

- టెన్నిసన్

'ఫసల్ బీమా' ఓ మేడిపండు పథకం

కిల్లి వెంకట రమణమూర్తి

చర్చ

రైతులు తమ పంటను బీమా చేసుకునేందుకు గాను 2016, ఏప్రిల్ (ఖరీఫ్ సీజన్)లో కేంద్రం, 'ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్‌బివై)' పథకాన్ని తీసుకొచ్చింది. అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు వంటి పలు కారణాలతో పంట నష్టపోయిన సమయంలో ప్రభుత్వం ఆ పంటకైన మొత్తాన్ని రైతులకు చెల్లిస్తుంది. అయితే ఈ పథకం నిర్వహణ, నిబంధనలు పరిశీలిస్తే 'ఇదొక మేడిపండు పథకం' అని తేటతెల్లమవుతోంది. జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎన్ఎఐఎస్), సవరించిన జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎంఎన్ఎఐఎస్) స్థానంలో పిఎంఎఫ్‌బిఐ పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది. స్వల్ప ప్రీమియం రేట్ల తేడాతో వాతావరణ ఆధారిత బీమా పథకం (డబ్ల్యుబిసిఐఎస్) కూడా అమల్లో ఉంది. ఈ రెండింటిలో ఏది కావాలంటే అది లేదా రెండింటినీ రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉంది. కాకపోతే పిఎంఎఫ్‌బిఐ నిర్వహణలోనే పెద్ద లోపముంది. రాష్ట్ర స్థాయిలో ఈ పథకాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. జిల్లా స్థాయిలో అసలు ఈ పథకం ఉందనే విషయాన్ని రైతులకు చేర్చే యంత్రాంగమే లేదు. దీంతో నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు.



దీనికితోడు పంట నష్టం నిర్ధారణ అతిపెద్ద సమస్యగా వుంది. పంట నష్టాన్ని నిర్ధారించే సాంకేతికత లేకపోవడం, శాంపిల్ సైజులు అతి పెద్దవి కాకపోవడం దీనికి ప్రధాన కారణం. జిల్లా, గ్రామాల స్థాయి వ్యవసాయాధికారులు శాంపిల్ సేకరణ, క్షేత్ర స్థాయి లెక్కింపు వంటివి చేయరు. దీని కోసం సుశిక్షితులైన నిపుణులు, సంస్థలను ప్రభుత్వం ఇంతవరకూ నియమించలేదు. కేవలం పేపర్‌పై మాత్రమే నిబంధనలన్నీ కనిపిస్తాయి తప్పితే నిర్వహణలో అధికారుల అలసత్వమే ఎక్కువగా ఉంది. అధికారుల అవినీతి కూడా బీమా కంపెనీలకు సానుకూలంగా మారుతోంది. నిర్ధారణలో ఆలస్యం బీమాను క్లెయిమ్ చేయడంపై ప్రభావం చూపుతోంది. దీంతో రైతు చేతికి పంట నష్టపరిహారం వచ్చేసరికి మరో పంట వేసే సమయం ముంచుకొస్తోంది. 2016 నాటి ఖరీఫ్ పంట పరిహారం 2017 ఏప్రిల్ వరకూ పూర్తి స్థాయిలో చెల్లించ లేదు. 14 రాష్ట్రాల్లో పాక్షికంగా చెల్లింపులు జరిగాయి. కొన్ని చోట్ల రాష్ట్ర ప్రభుత్వాలే పరిహారాన్ని చెల్లించగా, బీమా కంపెనీలు కేవలం 32 శాతం ప్రీమియమ్‌లకు మాత్రమే చెల్లించాయి.

ఈ పథకాన్ని పట్టి పీడిస్తున్న మరో సమస్య బీమా కంపెనీలు అధిక వసూళ్లకు పాల్పడడం. బీమా గణన ప్రీమియం పేరుతో ప్రభుత్వం నిర్దేశించిన దానికంటే ఎక్కువ మొత్తాన్ని బీమా కంపెనీలు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వం బీమా ప్రీమియంను పంట విలువ మొత్తంలో 12.6 శాతంగా నిర్ణయించింది. ఇదే అత్యధిక ప్రీమియం కావడం గమనార్హం. దీనికి తోడు గుజరాత్‌లో 20.5 శాతం, రాజస్థాన్‌లో 19.9 శాతం, మహారాష్ట్రలో 18.9 శాతం, బీహార్‌లో 17 శాతం చొప్పున వసూలు చేస్తున్నారు.

ఈ పథకం వల్ల రైతుల పరిస్థితి ఎలా ఉన్నా బీమా కంపెనీలు మాత్రం బాగా లాభపడుతున్నాయి. ఒక్క ఏడాదిలోనే రూ.10,000 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. బ్యాంకుల నుంచి రుణాలు పొందేవారు తప్పనిసరిగా పంటకు బీమా చేయించుకోవాలి. దీంతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోకుండా బీమా చేయించుకుంటున్నవారి సంఖ్య 5 శాతం కంటే తక్కువగానే ఉంటోంది. దీంతో వీరికి మాత్రమే బీమా కంపెనీలు బీమా చెల్లించాల్సి ఉంటుంది. రైతులు తీసుకున్న రుణాలను బీమా మొత్తంలోనే బ్యాంకులు, బీమా కంపెనీలు నేరుగా వసూలు చేసుకోవడం సర్వసాధారణమైపోయింది. ఇప్పటికీ బీమా కంపెనీలకు, రైతులకు మధ్య ప్రత్యక్ష సంబంధాలు లేవు. ప్రభుత్వం కూడా తగిన చర్యలు తీసుకోలేదు. అసలు తమ పంటకు బీమా చేయించుకున్నామన్న రశీదు కూడా కంపెనీలు రైతుకు ఇవ్వక పోవడం విచారకరం. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆలస్యంగా నోటిఫికేషన్లు ఇస్తున్నాయి. రైతులు బాగా నష్టపోయిన చోటే ఈ బీమా పథకం పనికిరాక పోవడం మరో ప్రతికూలాంశం. బుందేల్‌ఖండ్, మరాట్వాడ వంటి ఉత్పత్తి, నీటి లభ్యత తక్కువగా గల ప్రాంతాల్లో రైతులను ఈ పథకం ఆదుకోలేక పోతోంది. నిజానికి వీరికే ఎక్కువ బీమా చెల్లించాలి. కానీ బీమా కంపెనీలు ఇక్కడ భూములకు తక్కువ పరిహారాన్ని చెల్లిస్తున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో వ్యవసాయం చేసే రైతులను ఈ పథకం ఆదుకోలేక పోతోంది. దాంతో రైతాంగానికి ప్రయోజనం అంతంత మాత్రంగానే ఉంది. భారతదేశ వ్యాప్తంగా పరిగణిస్తే..2015 ఖరీఫ్ సీజన్ కంటే 2016లో బీమా రైతుల సంఖ్య పెరిగింది. 2015లో ఆ సంఖ్య 3.09 కోట్లుండగా, 2016 నాటికి ఆ సంఖ్య 4 కోట్లకు పెరిగింది. 2015లో హెక్టార్‌కి రూ.20,500 బీమా చెల్లించగా, 2016లో అది రూ.34,370లకు పెరిగింది. అయితే రాజస్థాన్ వంటి కరువు ప్రాంత రాష్ట్రాల్లో బీమా చేయించుకున్నవారి సంఖ్య తక్కువగా ఉంది.

ఈ పథకంపై ఇటీవల న్యూఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్ఇ) ఒక నివేదికను వెల్లడించింది. పిఎంఎఫ్‌బివై పథకంలోని లోపాలేంటి? రైతులు ఎలా మోసపోతున్నారు? రైతుకు పంట నష్టం వస్తే.. బీమా కంపెనీకి లాభమెలా వస్తుంది? వంటి అంశాల్ని కూలంకషంగా ఈ నివేదికలో వివరించింది. అలాగే పలు సూచనలు కూడా చేసింది.

ఈ పథకం కింద అన్ని రకాల పంటలను చేర్చాలి. అంతర పంటను ప్రోత్సహించాలి. గత కొన్నేళ్లుగా ఆ భూముల్లో నమోదైన ఉత్పత్తి ఆధారంగానే బీమాను నిర్ణయించాలి. అగ్ని ప్రమాదం, జంతువుల వల్ల జరిగిన పంట నష్టాన్ని కూడా బీమా కిందకు చేర్చాలి. రైతులందరికీ బీమాకు సంబంధించిన పూర్తి వివరాలున్న దరఖాస్తులు, పత్రాలను అందివ్వాలి. ఈ పథకం అమలుతో వివిధ దశల్లో రైతులు, పంచాయతీరాజ్ సంస్థలు సమిష్టిగా పాల్గొనాలి. కొందరు మహిళలు కలసి పండిస్తే గ్రూపు అంతటికీ బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలి. పంటకైన మొత్తం ఖర్చు కంటే తక్కువ కాకుండా బీమా చెల్లింపు మొత్తం ఉండాలి. రిమోట్ సెన్సింగ్, డ్రోన్లు వంటి అధునాతన సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించి అవినీతి జరగకుండా నిరోధించాలి. వాతావరణంలో విపరీతమైన మార్పులు వస్తున్న పరిస్థితుల్లో అందరికీ వర్తించేలా సబ్సిడీతో కూడిన వ్యవసాయ బీమాను విస్తరించాలి.

సెల్: 9966513257

డ్రగ్స్ సరే... మత మౌఢ్యం అంతకన్నా ప్రమాదం!



దేవరాజు మహారాజు

విశ్లేషణ

మన దేశంలో మత పెద్దల ప్రవచనాల వల్ల, రాజకీయ నాయకుల ఉపన్యాసాల వల్ల, వారి ప్రవర్తన వల్ల, చేష్టల వల్ల సామాన్యుల్లో 'థియోఫోబియా' పెరుగుతోంది. ఇది ఇప్పుడు మొదలయ్యింది కాదు. వేల వేల యేళ్ళ నుండి సమాజంలో వేళ్ళూనుకుని విస్తరిస్తూ వస్తోంది. చక్రవర్తులు, రాజులు, జమిందార్లు, దొరల నుండి పీఠాధిపతులు, మతాధిపతులు, రుషులు, సన్యాసులు, గురువుల నుండి జాగ్రత్తగా పెంచి పోషించబడుతూ ఇప్పటికీ వర్థిల్లుతూనే ఉంది. ఎన్నో ఫోబియాలు (భయాలు) ఉన్నాయి కదా, మరి ఈ 'థియోఫోబియా' అంటే ఏమిటీ అని కొందరికి అనుమానం రావొచ్చు. దేవుడు, మతం, ఆచారాలు, సంప్రదాయాలు, పవిత్ర పుణ్య కార్యాలు, సంస్కృతి అంటే గజ గజ వణికి పోయే వారికి థియోఫోబియా (విపరీతమైన దైవభీతి) ఉన్నట్టు. ఇది ఏ ఒక్క మతానికో సంబంధించింది కాదు. హిందూ, ముస్లిం, క్రైస్తవ వంటి అన్ని మతాల వారిలోనూ ఈ భయాలుంటాయి.

నిరంతరం పాపభీతితో భయపెట్టేదే 'థియో ఫోబియా'. ఇలా విపరీతమైన దైవభీతితో ఉన్నవారి లక్షణాలు ఎలా ఉంటాయంటే... వారు ప్రతిదీ నెగటివ్‌గా ఆలోచిస్తారు. మనకు తెలుసు, భయాలతో తీసుకునే నిర్ణయాలు ఎప్పుడూ నెగటివ్‌గానే ఉంటాయి. ఆత్మ విశ్వాసంతో తీసుకునే నిర్ణయాలు ఎప్పుడూ పాజిటివ్‌గా ఉంటాయి. ఈ ఫోబియా ఉన్నవారు చిన్న విషయానికే బెంబేలు పడతారు. నరకానికి వెళతామని అనుక్షణం భయపడుతుంటారు. తప్పులన్నీ తమకు తాము అన్వయించుకుని బాధపడుతుంటారు. ఏదో ఒక చిన్న గిల్టీ ఫీలింగ్ వారిలో క్రమంగా థియో ఫోబియాగా మారిపోతుంది. హేతుబద్ధత, రీజనింగ్ ఏమాత్రం ఉండదు. వీరివల్ల ఏ పొరపాటు జరగకపోయినా, ప్రశాంతంగా ఉండలేరు. ఇతరులెవ్వరో ఎక్కడో తప్పు చేసినా పాపం జరిగిపోయిందని వీరిక్కడ బాధపడుతుంటారు. మధుర సంబంధాల కోసం వశీకరణ ఉంగరం పనిచేస్తుందని నమ్ముతారు. ధనలక్ష్మీ లాకెట్, లక్ష్మీచరణ పాదుకలు, కుబేర తాళం చెవి లాంటివి దగ్గరుంచుకుంటే అధికారులు, వ్యాపారులు, భాగస్వాములు, శత్రువులు అంతా తమకు అనుకూలంగా మారి, తమ పనులు చేసిపెడతారని నమ్ముతారు.

ఇది ఏ ఒక్క మతం వారికో ఉండే ఫోబియా కాదు. అన్ని మతాల వారిలో ఉండేదే. చర్చిలు, మసీదులు, ఆలయాలు ఎంతో పవిత్రమైనవని వీరంతా భావిస్తారు. తాము అక్కడికి వెళితే అవి మైలపడిపోతాయని కూడా వణికిపోతారు. జనాన్ని మానసిక రోగులుగా తయారు చేస్తున్నవారి ఉపన్యాసాల్ని, పవిత్ర వాక్కుల్ని, ఉద్బోధలను బహిష్కరిస్తే కొంత మేలు జరుగుతుందేమో! కాని దేశంలోని దౌర్భాగ్యస్థితి ఏమిటంటే అధికారంలో ఉన్నవారే ఇంగిత జ్ఞానాన్ని పక్కన పెట్టి, వాటి కోసం అర్రులు చాస్తూ తిరుగుతున్నారయ్యే... ఇక సామాన్యుల సంగతి ఎవరు చూడాలి? ఇలాంటి వారిని కుటుంబ సభ్యులు పట్టించుకోవాలి. వారి భయాన్ని వదిలించే మార్గం వెతకాలి. ధైర్యం చెప్పాలి. సైకలాజికల్ కౌన్సిలింగ్‌కు తీసుకెళ్ళాలి. బిహేవియర్ థెరపీ ఇప్పించాలి. మనిషి మెదడు లోని వివిధ భాగాలు, వాటి పని తీరు అర్థం చేయిస్తే, వారిలో చాలా అనుమానాలు తొలగిపోతాయి. దేవుడి పేరు చెప్పుకుని పొట్ట పోసుకునే వాళ్ళంతా మోసగాళ్ళని స్పష్టం చేయాలి. కొంత మార్పు వచ్చాక, దేవుడూ, దయ్యం అన్నీ మనిషి భ్రమలేనన్న యదార్థం తెలియజేయాలి. అలాంటివేం లేవని, ఉండవని విశ్వాసం కలిగించాలి.

మత గ్రంథాల్లోంచి, దైవ భీతి లోంచి ముందు వారిని బయట పడేస్తే, ఆ తర్వాత 'మనిషిగా పుట్టిన వారికి, మనిషిగా బతికే హక్కు' ఉంటుందని చెప్పాలి. ఆ హక్కు పరిధి ఏమిటో, విలువ ఏమిటో తెలియజెప్పాలి. మనిషి సాధిస్తున్న విజయాల వైపు వారి మనసు మళ్ళించాలి. కళ్ళు మూసుకుపోయినవారి కళ్ళు తెరిపించాలి. అందుకు కావాల్సిన కౌన్సిలింగ్, మానసిక వైద్యం తప్పక అందించాలి. ఒక్కోసారి కుటుంబ సభ్యులు మాత్రమే కాక మొత్తంగా సమాజమే బాధ్యత తీసుకోవాలి. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ క్రైస్తవ కుటుంబంలోని ముగ్గురు సభ్యులు ఒక చిన్న గదిలో ఒకరి తర్వాత ఒకరు ఉరేసుకుని చనిపోయిన సంగతి తెలిసిందే. రాత్రంతా చర్చిలో ప్రార్థనలు చేసి, 'దేవుడు పిలుస్తున్నాడని' అరుచుకుంటూ తెల్లవారు జామున ఇంటికి పరిగెత్తుకుని వచ్చి ముగ్గురూ ఉరేసుకుని చనిపోయారు. పోలీసు దర్యాప్తులో తేలిందేమంటే ఇరుగుపొరుగు వారితో వీరికి సంబంధాలేవీ లేవని, రాత్రింబవళ్ళు దేవుణ్ణి తలుస్తూ, ప్రార్థనలు చేస్తూ ఉండేవారని! వీరిని ఈ స్థితిలోకి దిగజార్చిన వారికి మన వ్యవస్థలో శిక్షలే ఉండవు. ఇలా 'థియో ఫోబియా'తో ఉన్నవారికి తాము పాపులమని గట్టి నమ్మకముంటుంది. కొద్దిపాటి మానసిక బలహీనతలున్న మనుషుల్ని లొంగదీసుకుని వారిపై బలంగా ప్రభావం చూపే మత గురువుల్ని ఈ వ్యవస్థ పట్టించుకోదు. మానసిక ఒత్తిళ్లకు గురి చేసి, జనం ఆత్మహత్యలు చేసుకోవడానికి కారణమవుతున్న ఫాదర్లను, పీఠాధిపతుల్ని, దొంగ భగవాన్లను, బాబాలను నేరస్తులుగా చట్టం ఎందుకు గుర్తించదో ఆలోచించాలి. వీరిని ఆ పరిధిలోకి తేవడానికి ప్రయత్నించాలి.

డ్రగ్స్ తీసుకుంటున్న వారిని, సరఫరా చేస్తున్న వారిని దోషులుగా గుర్తించి దర్యాప్తు చేస్తున్నారు. సరే, మంచిదే. మరి లక్షల యేళ్ళ నుండి జనాన్ని లేవకుండా, మూఢత్వపు మత్తులో ముంచి ఉంచుతున్న మత మౌఢ్యాల సంగతేమిటి? స్కూలు పిల్లలు, కాలేజీ విద్యార్థులు, అన్ని రంగాల పెద్ద మనుషులు డ్రగ్స్ రాకెట్‌లో భాగస్వాములవుతున్నారని చెపుతున్నారు. నిజమే, అది బాధాకరమే!! సత్వరం ఛేదించాల్సిన విషయమే. దోషుల్ని శిక్షించాల్సిన విషయమే. ఈ రోజు కుల మతాలు, గోత్రాలు, భాష, ప్రాంతాల విభజనలతో జనాన్ని వేరు చేసి... మనుషులు సమానులుగా ఉండకుండా చేస్తూ, సమూహాలుగా విడగొడుతున్నారెందుకు? పాపయినా, బాబైనా పుట్టినప్పుడు వారికి కులం, మతం వగైరా ఏవీ ఉండవు. తల్లిదండ్రుల్ని బట్టి, పుట్టిన ప్రాంతాన్ని బట్టి, ఆ ప్రాంతంలో మాట్లాడే భాషను బట్టి.. ఆ పుట్టిన శిశువులకు అన్నీ అంటగడుతున్నారు. అతను లేదా ఆమె పెరిగి పెద్ద వాళ్ళయి విజ్ఞతతో తమ నిర్ణయాలు తాము తీసుకునే అవకాశమే లేదు. బలవంతంగా ఓ మతం లోకి ఓ దేవుడి విశ్వాసం లోకి తోయబడుతున్నారు. ప్రతి సారి, ప్రతి చోట 'నువ్వో పాపివి... పుణ్యం చేసుకో..' అని చెప్పడం జరుగుతోంది. పుట్టుకతోనే పాపాత్ములెట్లా అవుతారు? అంటే ఎవరికీ తెలియని గత జన్మల్ని ముందుకు తెస్తారు. ఇలా ఒక చట్రంలో బిగించి తరతరాల్ని మానసిక ఒత్తిడికి గురి చేస్తూ స్వేచ్ఛాలోచనకు తావు లేకుండా, స్వేచ్ఛా మానవులంటూ లేకుండా చేస్తూ వచ్చారు. మత మౌఢ్యం, మూఢాచారాలు, సంస్కృతి పేరుతో తిరోగమనం ఇంకా ఎంత కాలం? ఈ రోజు సాంకేతిక పరిజ్ఞానంతో తన లాంటి ఒక రోబోట్ (మరమనిషి)ని మనిషి ఎలా తయారు చేయగలుగుతున్నాడో... ఏ పరిజ్ఞానం లేని దశలో మనిషి ఒక ఊహ మాత్రపు దేవుడికి రూపకల్పన చేసుకున్నాడు. అన్నిట్లో అంతటా దేవుడున్నాడని భావించాడు. ఈ చిన్న విషయాన్ని జనం ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. దైవ భావన చుట్టూ అల్లుకుంటూ వచ్చిన మతాల్ని స్వీకరించి, ఒక రకమైన మూఢత్వంలో కూరుకుపోయి సమాజాన్ని నిర్వీర్యం చేస్తున్నారు.



మనిషి సృష్టించిన రోబోటే అంత కచ్చితంగా సమాధానాలిస్తున్నప్పుడు.. మనిషికేమయ్యింది? వాస్తవాలకు ఎందుకు విలువ నివ్వడు? భ్రమల్లో, ఊహల్లో, శూన్యంలో దేవుడి ఆకారం చూసుకుంటూ ఎందుకు బతుకుతున్నాడు? స్వశక్తి మీద నిటారుగా నిలబడి, ముందుకు సాగే సామర్థ్యం ఉండి కూడా బూజు పట్టిన ముత్తాతల భావజాలాన్ని 'దైవభీతి'ని ఎందుకు ఆశ్రయిస్తున్నాడు? ఇప్పటికైనా మనం ఆలోచించుకోవాలి కదా?

బ్రిటన్‌లో యువతి ఆకారంలో ఒక మర మనిషి సోఫియాను తయారు చేశాడో సాంకేతిక నిపుణుడు. ఆ రోబోట్‌ను కొంత మంది నిపుణుల దగ్గరికి తీసుకెళ్ళాడు. ఇంటర్వ్యూకి వచ్చిన అభ్యర్థిలాగా... రోబోట్‌ని కూర్చోబెట్టి నిపుణులంతా ప్రశ్నల వర్షం కురిపించారు.

పలు ప్రశ్నలకు తడుముకోకుండా సమాధానం చెప్పింది. ఆ తర్వాత 'నీ రోల్ మోడల్ ఎవరూ?" అని ఒకరు అడగడంతో క్షణం ఆలస్యం చేయకుండా చెప్పింది రోబోట్ సోఫియా.

'నా రోల్ మోడల్ నా సూపర్ వైజరే. నన్ను తయారు చేసిన ఆయనే నా సూపర్ రోల్ మోడల్' అని గర్వంగా అంది రొబోట్.. తడుముకోకుండా.

రోబోట్ సోఫియా చెప్పిన సమాధానాలు ఇక్కడ ఎందుకు గుర్తుచేశానంటే.. మనిషి సృష్టించిన రోబోటే అంత కచ్చితంగా సమాధానాలిస్తున్నప్పుడు.. మనిషికేమయ్యింది? వాస్తవాలకు ఎందుకు విలువ నివ్వడు? భ్రమల్లో, ఊహల్లో, శూన్యంలో దేవుడి ఆకారం చూసుకుంటూ ఎందుకు బతుకుతున్నాడు? స్వశక్తి మీద నిటారుగా నిలబడి, ముందుకు సాగే సామర్థ్యం ఉండి కూడా బూజు పట్టిన ముత్తాతల భావజాలాన్ని 'దైవభీతి'ని ఎందుకు ఆశ్రయిస్తున్నాడు? ఇప్పటికైనా మనం ఆలోచించుకోవాలి కదా?

జర్దా, కిళ్లీ, పొగ తాగడం, సారాయి తాగడం, చివరకు డ్రగ్స్ సేవించడం అన్నీ అందరూ ఒప్పుకున్న చెడు అలవాట్లు. వాటిని మొత్తానికి మొత్తంగా నిషేధించే ధైర్యం ప్రభుత్వాలకు ఉందా? వాటికి రాబడి కావాలి. పైగా ప్రజారోగ్యం కాపాడుతున్న మంచిపేరు కూడా రావాలి. మందుషాపులకు లైసెన్సులు ప్రభుత్వాలే ఇస్తాయి. తాగి బళ్లు నడిపారని మళ్లీ శిక్ష వేసేదీ ప్రభుత్వాలే! ఓ ప్రభుత్వాధికారి లంచాలు తిని బిల్డింగ్ నిర్మాణానికి పర్మిషనిస్తాడు. అతను ట్రాన్స్‌ఫరై పోగానే మరొకతను రూల్సు చూయించి బిల్డింగ్ కూలగొడతాడు. ఇవన్నీ మన కళ్ల ముందు జరుగుతున్నవే. ఈ ద్వంద్వ ప్రవృత్తి వ్యక్తులకైనా, సమాజాలకైనా ప్రభుత్వాలకైనా పనికిరాదు. సమాజం ఇలా భ్రష్టు పట్టిపోకుండా ఉండాలంటే, సామాన్యుల్లో వైజ్ఞానిక స్పృహ పెరగాలి. ప్రజలు హేతుబద్ధంగా ఆలోచించగలగాలి. అవినీతి, అక్రమ వ్యాపారాలు వాటంతట అవే ఆగిపోతాయి. ప్రతివాడు తనకు తాను మనిషన్నది గుర్తుంచుకుని, మనిషి సాధిస్తున్న విజయాలను తెలుసుకుంటూ, గర్వంగా ముందుకు వెళుతూ ఉంటే... చాలా సమస్యలు కాలక్రమంలో పరిష్కారం అవుతాయి!

(వ్యాసకర్త సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్, సెల్: 9908633949)

కేరళపై ఆర్‌యస్‌యస్ - బిజెపి కుట్ర

ఎ కోటిరెడ్డి

సమీక్ష

గతవారం కేరళలో హత్యకు గురైన రాజేష్ కుటుంబ సభ్యులను ఓదార్చటానికి కేంద్ర ఆర్థిక శాఖామంత్రి అరుణ్ జైట్లీ ఆదివారం నాడు కేరళను సందర్శించనున్నట్లు ప్రకటించారు. ఆర్‌యస్‌యస్, బిజెపి కార్యకర్తలలో ధైర్యం నింపటం, ఆర్‌యస్‌యస్, బిజెపి కార్యకర్తలను హత్యలు చేయటాన్ని కేరళ ప్రభుత్వం పనిగా పెట్టుకున్నదని దుష్ప్రచారం చేయటం ఆయన పర్యటన వాస్తవ లక్ష్యం. కేరళలో ఆర్‌యస్‌యస్ కార్యకర్తగా ఉండటం అంటే హత్యకు గురవుతారనే వాతావరణం సృష్టిస్తున్నారని మరో కేంద్రమంత్రి స్మృతి ఇరానీ అక్కసు వెళ్ళగక్కారు. బిజెపి, ఆర్‌యస్‌యస్ కేరళ పట్ల అనుసరిస్తున్న వైఖరి చూస్తుంటే ఆ రాష్ట్రంలో యధేచ్ఛగా హత్యాకాండకు పాల్పడుతున్న తమ పార్టీవారికి మద్దతు తెలిపి, మరింతగా రెచ్చగొట్టటం, శాంతి భద్రతలను విచ్ఛిన్నం చేయటం కోసం ప్రయత్నిస్తున్నారని స్పష్టమౌతున్నది. తమ పార్టీ వారిని సిపియం హత్య చేస్తున్నదని దేశవ్యాపితంగా ప్రచారం చేయటం, తద్వారా కమ్యూనిస్టులు హింసావాదులని ముద్ర వేయటం, ఆ ముసుగులో తమ హిందూత్వ ఎజెండా ముందుకు తీసుకుపోవటంలో ఎదురౌతున్న అడ్డంకులను తొలగించుకోవటం వారి లక్ష్యాలుగా ఉన్నాయని స్పష్టమౌతున్నది.

రాజేష్ హత్యకు దారితీసిన పరిస్థితులు

గతవారం కేరళలో హత్యకు గురైన రాజేష్ ఆర్‌యస్‌యస్ కార్యకలాపాలలో పాల్గొనేవాడు. అతను నివసించే కాలనీలో అతనికి, మరో కుటుంబానికి మధ్య వ్యక్తిగత వివాదాలున్నాయి. కొద్ది రోజుల క్రితం ఆ కాలనీలో జరిగిన గొడవల్లో అతను భాగస్వామిగా ఉన్నాడు. అతని హత్యలో పాల్గొన్న 11 మందిని పోలీసులు అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు. అరెస్టయిన వారిలో ఒకరు బియంయస్‌కు చెందిన వ్యక్తి కుమారుడు, మరొకరు ఐయన్‌టియుసికి చెందినవారు. పోలీసులు కాలనీ లోని రెండు కుటుంబాల వారిపైనా నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. వాస్తవం ఇది కాగా సిపియం కార్యకర్తలు తమ కార్యకర్తను హత్య చేశారని గగ్గోలు పెట్టటంతో పాటు ఆర్‌యస్‌యస్, బిజెపిలు కేరళ బంద్‌కు పిలుపునిచ్చాయి.



బరితెగిస్తున్న బిజెపి

2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కేంద్రంలో బిజెపి పూర్తి మెజారిటీ సాధించి అధికారం లోకి వచ్చింది. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కొన్ని రాష్ట్రాలలో అధికారం లోకి వచ్చింది. కొన్ని రాష్ట్రాలలో ఎన్నికల గెలుపు ద్వారానూ, మరికొన్ని రాష్ట్రాలలో ప్రజల తీర్పును వమ్ము చేసి, ఫిరాయింపులను ప్రోత్సహించటం ద్వారానూ అధికారాన్ని స్వాధీనం చేసుకుంది. కేరళలో ఈ రెండింటిలో ఏదీ సాధ్యం కాలేదు. బిజెపి ఎన్ని కుయుక్తులు పన్నినా, ఎంత దుష్ప్రచారం చేసినా కేరళ ప్రజలు బిజెపిని పట్టించుకోలేదు. చావుదప్పి కన్ను లొట్టపోయినట్లు అసెంబ్లీలో ఒక్క స్థానాన్ని మాత్రమే బిజెపి పొందగలిగింది. దేశమంతటా తమ ప్రభ వెలిగిపోతున్నా కేరళ ప్రజలు తమకు స్థానం ఇవ్వకపోవటం, తాము బద్ధ శతృవుగా పరిగణిస్తున్న సిపిఐ(యం)కు పట్టం కట్టటం బిజెపి సహించలేకపోతున్నది. దాంతో సహనం కోల్పోయిన బిజెపి, ఆర్‌యస్‌యస్‌లు ఈ విధంగా రాష్ట్రంలో శాంతి భద్రతలను విచ్ఛిన్నం చేయటానికి పూనుకుంటున్నాయి. సిపిఐ (యం) అధికారం లోకి వచ్చిన 17 మాసాలలో తమ కార్యకర్తలు 17 మంది హత్యలకు గురయ్యారని బిజెపి చెబుతున్నది. వ్యక్తిగత కారణాలతో ప్రత్యర్థుల చేతులలో హత్యలకు గురైన రాజేష్‌లాంటి వారిని లెక్కించుకుని జాబితా తయారు చేసుకుంటోంది. కాని ఈ హత్యలలో సిపిఐ(యం) ప్రమేయం లేదు. తమపైన ప్రత్యర్థులు దాడులు చేస్తున్న సందర్భాలలో ఆత్మ రక్షణ కోసం ప్రయత్నం చేయటం తప్ప సిపిఐ(యం) ఎప్పుడూ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు. ప్రత్యర్థులను రాజకీయంగా ఎదుర్కోవటం, ప్రజాక్షేత్రంలో విజయం కోసం కృషి చేయటమే పార్టీ విధానం. ఇందుకు భిన్నంగా పార్టీ కార్యకర్తలు వ్యవహరించటాన్ని సిపిఐయం సహించదు. ఈ మధ్య కాలంలో తిరువనంతపురంలో బిజెపి కార్యాలయంపై జరిగిన దాడిలో పాల్గొన్న సభ్యుడిని పార్టీ నుండి సస్పెండ్ చేయటమే సిపిఐ(యం) నిజాయితీకి గీటురాయి. రాజేష్ హత్య జరిగిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి విజయన్ బిజెపి, ఆర్‌యస్‌యస్ నాయకులతో సమావేశం జరిపి, శాంతి పునరుద్ధరణ కోసం కృషి చేద్దామని, అందుకోసం ఈనెల 6వ తేదీన అఖిలపక్షాలతో సమావేశం జరపాలని నిర్ణయించారు. శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పటానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం సమావేశం జరుపుతున్న రోజునే కేంద్రమంత్రి కేరళ పర్యటనలోని ఆంతర్యం ఏమిటి? శాంతి పునరుద్ధరణ కోసం జరుగుతున్న కృషిని బలపరచటానికా? విచ్ఛిన్నం చేయటానికా?

గోగూండాల హత్యాకాండపై స్పందన రాదా?

కేరళలో వ్యక్తిగత గొడవల సందర్భంగా జరిగిన హత్యపై బిజెపి నాయకత్వం, కేంద్ర ప్రభుత్వం నేరాన్ని సిపిఐ(యం)పై నెట్టివేయటానికి పూనుకుంటున్నాయి. ఈ హత్యలో సిపిఐ(యం)కు ఏ మాత్రం సంబంధం లేదని అరెస్ట్ అయిన వారిపై జరుగుతున్న విచారణ స్పష్టం చేస్తున్నది. గోగూండాల ముసుగులో సంఘ పరివార్ అమాయకులను కొట్టి చంపుతుంటే కనీసం ఖండించటానికి కూడా వీరికి నోరు రాదు. గోగూండాల చేతులలో తీవ్రమైన దాడులకు, అవమానాలకు, అత్యాచారాలకు, హత్యలకు గురౌతున్న అమాయకుల కుటుంబాలను పరామర్శించటానికి బిజెపి, సంఘ్ పరివార్, కేంద్ర మంత్రులలో ఒక్కరు కూడా వెళ్ళలేదు. గోగూండాల హత్యాకాండ పట్ల ఈ విధంగా వ్యవహరిస్తున్న వీరు వ్యక్తిగత కారణాలతో కేరళలో జరిగిన హత్యకు రాజకీయ రంగు పులిమి ప్రచారం చేయటం వెనుక రాజకీయ ప్రయోజనాలే ప్రధానం. జైట్లీ కేరళ పర్యటనతో రెండు విషయాలు స్పష్టం అవుతున్నాయి. కేరళలో జరిగిన హత్యకు రాజకీయాలు కారణం కాకపోయినా దానికి రాజకీయ ముద్ర వేసి, కేరళ ప్రభుత్వంపైనా, సిపిఐ(యం)పైనా దుష్ప్రచారం చేయటం, అక్కడి బిజెపి, ఆర్‌యస్‌యస్‌లను ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టటం మొదటి కారణం. రెండవది. దేశవ్యాపితంగా జరుగుతున్న గోగూండాల దాడులు, హత్యాకాండకు బిజెపి, సంఘ పరివార్, కేంద్ర ప్రభుత్వం మద్దతున్నదని వారి వ్యవహార సరళి స్పష్టం చేస్తున్నది.

ఇదంతా సంఘ పరివార్, కేంద్ర ప్రభుత్వం పథకం ప్రకారం అమలుచేస్తున్న రాజకీయ కుట్ర. సిపిఐ(యం) నాయకత్వం లోని కేరళ ప్రభుత్వం బిజెపికి కంట్లో నలుసులా ఉన్నది. తన హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకుపోవటానికి సంఘ పరివార్‌కు సిపిఐ(యం) తీవ్ర ప్రతిబంధకంగా ఉన్నది. వివిధ ప్రభుత్వ సంస్థలను, విద్యారంగాన్ని కేంద్ర ప్రభుత్వం కాషాయీకరించటాన్ని సిపిఐ(యం) తీవ్రంగా ప్రతిఘటిస్తున్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, రోహిత్ వేముల, జెయన్‌యు ఘటనలలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసింది. లౌకికతత్వాన్ని విచ్ఛిన్నం చేసే విధానాలకు వ్యతిరేకంగా విస్తృత ప్రతిఘటనను నిర్మించటానికి పూనుకున్నది. ఇటువంటి స్థితిలో సిపిఐ(యం)ను రాజకీయంగా దెబ్బతీయకపోతే తన ఎజెండాను ముందుకు తీసుకుపోవటానికి తీవ్ర ప్రతిఘటన ఎదురౌతుందని సంఘ పరివార్, కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నాయి. సిపిఐ(యం)కు పెట్టనికోటగా ఉన్న కేరళ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలుచేస్తే, దేశవ్యాపితంగా పార్టీ పలుకుబడిని దెబ్బతీయవచ్చునని అవి భావిస్తున్నాయి. కాబట్టి కేరళలో తమ కార్యకర్తలను సిపిఐ(యం) కార్యకర్తలు హత్య చేస్తున్నారని, ఆ రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని ప్రచారం చేస్తున్నాయి. ఆ పథకంలో భాగంగానే జైట్లీ కేరళ సందర్శనకు వెళుతున్నారు. బిజెపి దుష్ట పథకాలను బట్టబయలు చేయటానికి అభ్యుదయవాదులు పూనుకోవాలి. ★

జీవన the family



అరటిపువ్వు కూరగా తిన్నారా?

అందరికీ నచ్చే పండ్లలో అరటిపండు ఒకటి. దీన్ని తినడం వల్ల ఎన్నో ఆరోగ్యకర ప్రయోజనాలున్నాయి. శరీరానికి పోషకాలు అందడమే కాదు, అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. పైగా శరీరానికి పుష్కలమైన శక్తి లభిస్తుంది. అయితే, అరటి పండు కంటే అరటిపువ్వుతో మరిన్ని లాభాలాలు ఉన్నట్టు నిపుణులు చెబుతున్నారు.

- అరటిపువ్వును కూరగా వండుకుని తినడం వల్ల జీర్ణాశయంలో అల్సర్లు కరుగుతాయి.
- హైబీపీ అదుపులో ఉంటుంది. స్త్రీలలో గర్భాశయ సంబంధ సమస్యలు కొంత వరకూ తొలగుతాయి.
- మూత్రపిండాల వ్యాధులతో ఇబ్బందిపడే వారు, కిడ్నీల్లో రాళ్లు ఉండేవారు అరటిపువ్వు కూరను తినడం వల్ల సమస్య నుంచి గట్టెక్కవచ్చు.
- అరటిపువ్వు కూర తింటే జీర్ణ సంబంధ సమస్యలు పోతాయి. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటివి దూరమౌతాయి.
- పాలిచ్చే తల్లులకు అరటిపువ్వు కూర మంచి ఆహారం. చాలా పోషకాలు లభించడం వల్ల అటు తల్లికి, ఇటు శిశువుకూ మంచి చేస్తుంది.
- డయాబెటిస్ ఉన్నవారు అరటిపువ్వు కూరను తరచూ తింటుంటే వారి రక్తంలోని చక్కెర స్థాయిలు క్రమబద్ధమవుతాయి.
- అరటి పువ్వు కూరను తినడం వల్ల స్త్రీలకు ఋతుక్రమం సరిగ్గా ఉంటుంది.

జీవన సౌరభం

మన గురించి గొప్పగా చెప్పుకోవాలంటే.. మనమూ వందమంది గొప్పవాళ్ల గురించి తెలుసుకోవాలి.

బాల్యంలోనే బాధ్యత నేర్పాల్సింది తల్లిదండ్రులే. పెళ్లికి ముందు కొడుకు ఏం పట్టించుకోకుండా, బాధ్యత లేకుండా బలాదూరు తిరుగుతుంటే.. మాటవరసకన్నా మందలించలేని తల్లిదండ్రులు, పెళ్లయ్యాక మార్పు రావాలంటే ఎక్కడ నుంచి వస్తుంది? మొక్కగా వంగనివాడు.. మానులా పెరిగాక మారతాడా? భార్యకు అతనిపై ఉన్న అపారమైన ప్రేమ కూడా అలుసే. స్థిరమైన ఉద్యోగం చేయకపోగా, వ్యసనాలకు బానిసయ్యాడు. డబ్బు కోసం ఇప్పుడు తనని తాను అమ్ముకోవడానికీ సిద్ధపడ్డాడు. ఈ మధ్యే భార్య వద్దంటున్నా కిడ్నీ అమ్మేశాడు. ఈ పరిస్థితుల్లో ఆమె అతన్ని తీసుకుని 'ఐద్వా అదాలత్'కు వచ్చింది. చివరకు ఏమైందో తెలుసుకోవాలంటే ఈ వారం 'ఫ్యామిలీ కౌన్సెలింగ్'లోని 'కేస్‌స్టడీ' చదవండి.

కిడ్నీ అమ్మేసుకున్నాడు

ఫ్యామిలీ కౌన్సెలింగ్

ఐద్వా అదాలత్

ఆమె పేరు అనుపమ. అతని పేరు మురళీధర్.

అనుపమకు చిన్నప్పుడే తల్లిదండ్రులు లేకపోవడంతో బంధువుల సంరక్షణలోనే పెరిగింది. మురళీధర్‌తో పెళ్లయ్యాక తనకూ ఓ కుటుంబం ఉందని మురిసిపోయింది. అందుకే ఆమెకు మురళీధర్ అంటే వల్లమాలిన ఆరాధన, అనురాగం. పెళ్లయిన కొత్తల్లో పట్టుమని పదినెలలు కూడా సరైన ఉద్యోగం చేయకపోవడంతో.. ఆమె ఓ ఆసుపత్రిలో ఆయాగా చేరింది. ఇద్దరు మగపిల్లలు పుట్టాక కూడా మురళీధర్‌కు కుటుంబబాధ్యత తెలియడం లేదు. పైగా ఆమె ఉద్యోగానికి వెళ్తుందా లేదా? జీతం సరిగ్గా తెస్తుందా? లేదా? అనేదే అతని దృష్టంతా. ఆమెపై నిఘా, వేధింపులు అధికమయ్యాయి. ఈ పరిస్థితుల్లో అనుపమ అత్తగారికి.. అసలు విషయం చెప్పింది.

"వాడు పెళ్లికి ముందూ ఇంతే.. ఆ బాధలు పడలేకపోయేదాన్ని.. అవి నన్ను వదిలి నిన్ను పట్టుకున్నాయి అంతే. పెళ్లయ్యాక అయినా సరవుతాడనుకున్నా.. అవలేదన్న మాట.." అంది మురళీధర్ తల్లి. అత్తగారి మాటలకు అనుపమ ఆశ్చర్యపోయింది. మురళీధర్ రోజు రోజుకూ మరింత దిగజారిపోతున్నాడు. సిగిరెట్లు, తాగుడు, పేకాటతో

> **ఇల్లు కట్టుకోవడానికి కిడ్నీ అమ్ముకుంటారా? నీ భార్య నమ్మిందేమోగానీ, మేము నమ్మం. ఆ డబ్బులు ఎక్కడ ఉన్నాయి? ఆ ఉన్న ఒక్క కిడ్నీకి ఏమన్నా అయితే, నీ పరిస్థితి ఏమిటి? నిన్ను ఎంతగానో ప్రేమించే నీ భార్యాపిల్లలు ఏమి కావాలి?**

పాటు ఈ మధ్య గుర్రాల రేసులను టీవీలో చూస్తూ పందెం కడుతున్నాడు. దీంతో అప్పుల పాలయ్యాడు. అప్పులిచ్చినవాళ్లు ఒత్తిడి చేస్తుంటే తప్పించుకు తిరుగుతున్నాడు. అనుపమకు ఆరోగ్యం బాగోక, ఇంట్లో పిల్లలకి చేసి, తెల్లారుజామునే ఆసుపత్రికి వెళ్లడం సాధ్యం కావడం లేదు. దాంతో ఉద్యోగం మానుకుంది. ఈ విషయం తెలిసి, మురళీధర్ అగ్గిమీద గుగ్గిలం అయిపోయాడు. ఆమెను ఎన్నిరకాల వేధించాలో అన్నిరకాలుగా వేధించాడు. అతని పోరు పడలేక, అనుపమ మళ్లీ ఉద్యోగంలో చేరింది.

పిల్లలకు స్కూలు ఫీజు సరిగ్గా కట్టడం లేదని, ఇంటికి పంపేశారు. అప్పులుచేసి, చెవికి ఉన్న దిద్దులు, తాళిబొట్టు అమ్మి, పిల్లల్ని ఆ ఏడాదికి గట్టెక్కించింది. ఆ తర్వాత ఏడాది గవర్నమెంటు స్కూల్లో చేర్పించింది.

అలా స్కూలు మార్చినందుకు పిల్లలు చాలా బాధపడ్డారు. వాళ్లకు పరిస్థితి వివరించి, ఎలాగో నచ్చజెప్పింది.

"నీవు ఇంక మారవా? ఇలా ఎంతకాలం చేస్తావు? నిన్ను వదిలి వెళ్లిపోవాలన్నా నేను వెళ్లలేను. నువ్వంటే నాకు అంత ప్రేమ. నాకు ఒక కుటుంబం ఉందని ఆనందించినంత సేపు పట్టలేదు నీవు పెట్టే వేధింపులకు.



ఎందుకిలా చేస్తున్నావు? అందరూ భార్యాబిడ్డల్ని చూసుకుని, ఉన్నంతలో హాయిగా ఉండటంలేదా?" బోరుమంటూ ఏడుస్తూ మురళీధర్‌ని నిలదీసింది అనుపమ.

" అలాగే అంటూ ఉండు.. ఎప్పుడోకప్పుడు నేను ఏదో ఒకటి గెలవకపోనూ, ఇల్లు కట్టేసి, కారు కొనేసి, మీరంతా ఆశ్చర్యపోయేలా చేయకపోను. నీది పిచ్చి ప్రేమని నాకూ తెలుసు. నువ్వు నన్ను వదల్లేవనీ తెలుసు. ఇవన్నీ జరిగే వరకూ నువ్వు ఉద్యోగం చేయాల్సిందే.. ఆ తర్వాత నువ్వు ఉద్యోగం చేయాల్సిన అవసరం ఉండనే ఉండదు. అప్పుడు నేను నిన్నిక అడగను కూడా!" అంటూ పెద్దగా నవ్వేశాడు.

"నువ్వు ఇలాగే గాల్లో మేడలు కడుతూ ఉండు. నేను నా రెక్కలముక్కలు చేసుకుని, కష్టపడుతూ ఉంటా.. ఆ పిల్లలు ఆరేడేళ్ల నుంచి ఉన్న వాళ్ల స్నేహితుల్ని వదిలేసుకుని, వేరే స్కూల్లో చేరాల్సి వచ్చిందని ఎంత బాధపడుతున్నారో తెలుసా? నీకు ఇవన్నీ అర్థమయితే ఇలా ఎందుకు చేస్తావు?" అంటూ ఏడుస్తూనే తన పని చేసుకుంటోంది అనుపమ.

"అందుకే.. నీ ఏడుపు పడలేక నేను ఒక నిర్ణయానికి వచ్చాను. నా కిడ్నీ అమ్మేసి, ఇల్లు కడతాను. అప్పుడు ఇక ఏ బాధా ఉండదు" అన్నాడు.

ఒక్కసారిగా తను నుంచున్న నేల కుంగిపోతున్నట్లు అనిపించింది. "నీకేమైంది? ఇలాంటి మాటలు మాట్లాడుతున్నావు. మాకు ఇల్లూ వద్దు.. ఏమీ వద్దు.. చెట్టుకింద ఉండి, నీళ్లు తాగైనా బతుకుదాం. ఇవేం పాడు మాటలు?" అంటూ అల్లాడిపోయింది అనుపమ.

వారం తర్వాత తెలిసింది మురళీధర్ ఆసుపత్రిలో ఉన్నాడని.. ఒక కిడ్నీ అమ్మేసుకున్నాడని.. ఏడుస్తూనే ఆసుపత్రికి పరుగున వెళ్లింది అనుపమ. "ఇలా ఎందుకు చేశావు? నువ్వేమన్నా అయితే, మేమేం కావాలి?" అంటూ పెద్దగా ఏడ్చేసింది. అప్పుడే అక్కడికి వచ్చిన డాక్టర్‌ని "మా అనుమతి లేకుండా అలా ఎలా కిడ్నీ తీసేస్తారు?" అని అడిగింది. "వాళ్లమ్మగారు అనుమతిస్తూ సంతకం చేశారు కదా! అవేమీ లేకుండా మేంమాత్రం ఎందుకు చేస్తాం?" అంటూ విసురుగా వెళ్లిపోయారు డాక్టర్. తర్వాత తెలిసిందేమంటే, పెన్షన్ కోసం అని వాళ్లమ్మతో మాయమాటలు చెప్పి, కాగితంపై సంతకం చేయించుకున్నాడని.

చేసేదేమీ లేక మురళీధర్‌ను డిశ్చార్జి చేసేవరకూ సేవలు చేసి, ఇంటికి తీసుకొచ్చుకుంది. అతనికి ఇంతకుముందు ఉన్న అలవాట్లు అన్నీ మానేయాలని చెప్పారు డాక్టర్లు. లేకపోతే అతని ప్రాణానికే ముప్పు అన్నారు. ప్రస్తుతం సిగిరెట్లు, తాగుడు మానేశాడు. ఆరునెలలు కావొస్తుంది ఆపరేషన్ అయ్యి. కిడ్నీ అమ్ముకున్న డబ్బులు కూడా కొన్ని ఖర్చు చేసేశాడు. ఈ పరిస్థితుల్లో మళ్లీ అతను మొదట్లోలా చేస్తే ఎలా? అన్న ఆందోళనతో 'ఐద్వా అదాలత్'కు అతన్ని తీసుకొచ్చింది.

అనుపమ: అతను ఇప్పటికైనా బాధ్యతగా ఉండాలి. నాతో, పిల్లలతో ఉంటూ, చిన్న ఉద్యోగం ఏదైనా చేస్తే, నేనూ ఏదో ఒకటి చేస్తాను. ఉన్నంతలోనే హాయిగా ఉంటాం.

మురళీధర్: ఆమె భయమేగానీ, నాకెలాంటి అలవాట్లూ లేవు. ఈ రోజుల్లో ఇల్లు గడవాలంటే ఇద్దరూ పనిచేయకపోతే ఎలా? ఉద్యోగం చేయమంటే ఏడుస్తుంది.. అందుకే ఇల్లు కడదామనే కిడ్నీ అమ్మేశా.

బాధ్యులు ఏమన్నారంటే..

ఇల్లు కట్టుకోవడానికి కిడ్నీ అమ్ముకుంటారా? నీ భార్య నమ్మిందేమోగానీ, మేము నమ్మం. ఆ డబ్బులు ఎక్కడ ఉన్నాయి? ఆ ఉన్న ఒక్క కిడ్నీకి ఏమన్నా అయితే, నీ పరిస్థితి ఏమిటి? నిన్ను ఎంతగానో ప్రేమించే నీ భార్యాపిల్లలు ఏమి కావాలి? ఇవేమీ ఆలోచించకుండా నువ్వు నీ భార్య అనుమతి లేకుండా అమ్మకి మాయమాటలు చెప్పి సంతకం చేయించుకున్నావు. అది ఎంత తప్పో నీకు తెలుస్తుందా? ఈ రోజుల్లో ఇద్దరూ కష్టపడాలని తెలిసినవాడివి.. నీవు బాధ్యతగా ఎలా ఉండాలో తెలియడం లేదా? కిడ్నీ అమ్మిన డబ్బుల వివరాలు మాకు కావాలి. మా బాధ్యులను నీతో పాటే పంపిస్తాం. ఏ బ్యాంకులో ఉన్నాయో, ఎంతున్నాయో తెలుసుకుంటారు. నీకు డాక్టర్ కౌన్సెలింగ్ అవసరం.

సైకాలజిస్టుతో మురళీధర్‌కి కౌన్సెలింగ్ చేయించారు. డాక్టర్ సలహా మేరకు అతన్ని సైక్రియాటిస్టు దగ్గరకు పంపాల్సిన అవసరం ఉందని నిర్ణయించారు. అదే విషయం భార్యాభర్తలిద్దర్నీ కూర్చోబెట్టి బాధ్యులు కౌన్సెలింగ్ చేసి, ప్రభుత్వాసుపత్రిలోని సైక్రియాటిస్టు దగ్గరకు పంపారు.

ప్రస్తుతం మురళీధర్‌కు సైక్రియాటిస్ట్ నెలరోజులకు మందులు రాశారు. మందులు వాడుతూ భార్యాపిల్లలతో మురళీధర్ ఇప్పుడు బాగుంటున్నాడనీ, వారం తర్వాత అనుపమ వచ్చి, ఈ విషయం బాధ్యులకు చెప్పి, రిజిష్టర్‌లో సంతకం చేసింది.

నీకు ఎలాంటి సమస్య వచ్చినా, మాతో సంప్రదించు, నీకు మేమున్నాం అంటూ అనుపమకు భరోసా ఇచ్చారు ఐద్వా బాధ్యులు.

- శాంతిశ్రీ

అడ్రస్
కుటుంబ న్యాయ సలహా కేంద్రం
మోటూరు ఉదయం ట్రస్టు
ఎంబి భవన్ హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి,
గవర్నర్ పేట, విజయవాడ-2.
ఫోన్ 9494383220


న్యాయ నేస్తం

ఆస్తి కబ్జా చేస్తే..!

మా బాబాయి దౌర్జన్యంగా మా ఆస్తిని కబ్జాచేసి, మమ్మల్ని అడ్డుకుంటున్నాడు. పోలీసులకి ఫిర్యాదు చేసినా వాళ్లు పట్టించుకోవడం లేదు. రోజూ గొడవలు జరుగుతున్నాయి. ఏం చెయ్యాలో చెప్పగలరు.

- శ్రీనివాసు, కడప.

పోలీసులు పట్టించుకోవడం లేదంటే, మీ బాబాయి వాళ్లమీద పలుకుబడి ఉపయోగించి, తప్పంతా మీదే అనే అభిప్రాయం కల్గించి ఉండాలి. మీ దగ్గర మీ ఆస్తి గురించిన పూర్తి ఆధారాలు, దస్తావేజుల సాయంతో, మీ ఫిర్యాదును క్రిమినల్ కోర్టులో ప్రైవేటు కేసు కింద దాఖలు చేయవచ్చును. కోర్టు మీ ఫిర్యాదు సక్రమంగా




ఉంటే, విచారణకు స్వీకరిస్తుంది. పోలీసులకు తగు విచారణ జరపడానికి ఆదేశాలిస్తుంది. వాళ్ల రిపోర్టు ఇచ్చాక విచారణ మొదలవుతుంది. ప్రారంభ దశలో దస్తావేజుల నకళ్లు దాఖలు చేయవచ్చు. విచారణ సమయంలో అసలు దస్తావేజులు దాఖలు చేస్తామని ఫిర్యాదులో తెలుపవచ్చు. మీ అభియోగాలన్నింటినీ రుజువు చేసుకోవాల్సిన బాధ్యత మీదే. నేరపూరిత అతిక్రమణ, దౌర్జన్యం వంటి అభియోగాలతో మీరు ప్రైవేటు కేసు దాఖలు చేయవచ్చు. క్రిమినల్ లాయరు సాయం తీసుకోండి.

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది, విజయవాడ.
ఫోన్ నెం : 8330968901
ఇ మెయిల్
katururavindratrivikram@gmailcom



మొలకలు తింటే మంచిదే!

మొలకెత్తిన గింజలను తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినవారవుతారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. •రోజుకో ప్రక తి సిద్ధమైన ఆహారాన్ని తీసుకోవాలని.. తద్వార శరీరాన్ని అనారోగ్యాల బారి నుంచి దూరం చేసుకోవచ్చునని వారు సూచిస్తున్నారు. •మొలకెత్తిన మెంతులు, నువ్వులు, వేరుశెనగలు వంటి గింజలను తీసుకోవడం ద్వారా.. ప్రోటీన్లు, క్యాల్షియం, సోడియం, ఇనుము, పొటాషియం, ఫాస్పరస్ వంటివి లభిస్తాయి. అంతేకాకుండా ఏ, బి1, బి2 విటమిన్లు కూడా లభిస్తాయి. •మొలకెత్తిన ధాన్యాలను గుప్పెడు రోజువారీగా తీసుకోవడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించుకోవచ్చు. •మొలకెత్తిన గోధుమలను తీసుకుంటే క్యాన్సర్ కారకాలను దూరం చేసుకోవచ్చు. •మొలకెత్తిన నువ్వులను తీసుకుంటే.. బక్కపలచగా ఉన్నవారు బరువు పెరుగుతారు. కంటి దృష్టి లోపాలు దూరమవుతాయి. •మొలకెత్తిన మినపప్పు తీసుకోవడం ద్వారా బాలింతలకు మేలు. •మొలకెత్తిన ఉలవలు తీసుకుంటే బరువు తగ్గుతారు. మోకాళ్ల నొప్పులు మాయమవుతాయి. అనారోగ్యాలు దరిచేరవు.



సైకాలజి

విశ్లేషించుకోవడం మంచిది!

నేను ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. నా కొలీగ్స్ అందరూ నన్ను బాగానే చూసుకుంటారు. నా గురించి వాళ్లు చెడుగా అనుకుంటున్నారేమోనని చిన్న ఫీలింగ్. అంటే నా దగ్గర కూడా వేరేవాళ్ల గురించి మాట్లాడుతుంటారు. అలాగే నా గురించి కూడా లేనిపోని వాటి గురించి మాట్లాడతారేమోనని ఫీలింగ్. ఒక్కోసారి అనిపిస్తుంటుంది. నేను వాళ్ల గురించి తెలుసుకునేలా ఉంటున్నాను కాబట్టే ఈ సమస్య ఎదురవుతుందా అని..? కానీ ఏవిధంగా నా ఆలోచనల్ని మార్చుకోవాలో అర్థంకావడం లేదు.

- ఓ సోదరి.



డా. పద్మజ, సైకాలజిస్టు

వారు ఇతరుల గురించి మాట్లాడుతున్నప్పుడు వినడం వలన మీ గురించి కూడా అదేవిధంగా మాట్లాడే అవకాశం ఉంటుందన్న గట్టి అభిప్రాయం మీకు ఏర్పడింది. ఎప్పుడైతే మీకు ఆ భావన నుంచి దూరం తొలగాలంటే వారికి ఇంకొకరి గురించి ప్రతికూలంగా మాట్లాడుతున్నప్పుడు మీరు దానిని సమర్థింపుగా కాక నిరాసక్తత చూపే ప్రయత్నం చేయాలి. లేదా అలా చెప్పడాన్ని నిరుత్సాహపరిచే ప్రయత్నం చేస్తే అప్పుడు మీకు అపరాధ భావన కలగదు. అలాగే మీ ముందు ఇంకొకరి గురించి చెప్పడానికి వారు కూడా సంకోచిస్తారు. అలాగే ఒకరి గురించి మరొకరి దగ్గర చెప్పే స్వభావం కలవారు ఆధారం లేని కబుర్లే అయినా, ఆధారం ఉన్నవైనా మరొకరి దగ్గర చెప్పడానికి ఇష్టపడడం వారి వ్యక్తిత్వంలో బలహీనత అనే కోణం నుంచి కూడా ఆలోచించి చూడండి. మరొకరి గురించి వ్యక్తిగతమైన విమర్శలు, చాడీలు చెప్పడం ద్వారా స్నేహాన్ని, అభిమానాన్ని నమ్మకాన్ని పొందగలం అనుకోవడం వారిలోని అపరిపక్వతకు సూచన. అది వారు అర్థం చేసుకోకపోవచ్చు. వాస్తవాలు మాట్లాడడం ద్వారానూ, నిజాయితీగా ఉండడం ద్వారానూ నలుగురిని కలుపుకుంటూ స్నేహపూర్వకంగా ఉండడం ద్వారానూ, తమకి అప్పజెప్పిన పని నిబద్ధతతో చేయడం ద్వారానూ తెచ్చుకునే పేరు, కీర్తి కలకాలం ఉంటాయి. ఇలా వాస్తవిక దృక్పథంతో ఆలోచించకపోవచ్చు. ఇంకొకరిని దిగజార్చి మాట్లాడడం ద్వారా సంపాదించుకునే అఫెక్షన్ కేవలం తాత్కాలికమే అని అర్థమవ్వక తప్పదు. కాబట్టి మరొకరి వ్యక్తిత్వంలో ఉన్న బలహీనతని గురించి మీరు ఎక్కువగా మీ ఆలోచన వెచ్చించకూడని పని. మీకు అన్వయించుకోవడం మిమ్మల్ని ఆ స్థానంలో ఊహించుకోవడం సరికాదు. ఇలా మిమ్మల్ని తార్కిక ఆలోచనా ధోరణికి దూరంగా తీసుకెళతాయి. వారి బలహీనతల్ని అర్థంచేసుకుని ఒకవేళ వారు నిజంగానే చెడుగా మాట్లాడినా సమస్య వారిలోనే ఉండి ఉండొచ్చు.. మీరు దానికి బాధ్యులు కాకపోవచ్చు అన్న విశ్లేషణని కూడా జోడించుకుని ఆలోచించండి.



మీ కోసం



పెరుగులో పసుపు, నిమ్మరసం, బియ్యంపిండి ఈ మిశ్రమాన్ని చేతులకు రాసుకుని స్క్రబ్ చేసి పదినిముషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకుంటే చేతులపైనున్న చర్మం నలుపు తగ్గి, మృదువుగా మారుతుంది.

'జీవన'పై మీ స్పందన

'జీవన' పేజీలు మీకెలా అన్పిస్తున్నాయి? ఇంకా ఏం కావాలని కోరుకుంటున్నారు? మీ కుటుంబసభ్యుల, మిత్రుల, బంధువుల స్పందన ఎలా ఉంది? 'ప్రజాశక్తి' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు మాకు తెలియజేయండి.

మా చిరునామా: జీవన, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం : 7-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2, ఇ మెయిల్ jeevanapageps@gmail.com **ఫోన్ నెం. 9490099006 మీ ప్రశ్నలకు 12-6 గంటల వరకు ఫోనులో చెప్పవచ్చు. ఆదివారం సెలవు.**

సెన్సెక్స్ ▲ 88
32,325

నిఫ్టీ ▲ 53
10,066

రూపాయి ▲ 11 పైసలు
ఒక అమెరికా డాలరుకు రూ. 63.58

సేఫెక్స్‌ప్రెస్ రూ.300 కోట్ల పెట్టుబడులు


కొత్తగా ఆరు లాజిస్టిక్ పార్కులు



ప్రజాశక్తి – బిజినెస్ బ్యూరో

లాజిస్టిక్ సేవలు అందించే సేఫెక్స్‌ప్రెస్ రూ.300 కోట్లతో దేశంలో ఆరు లాజిస్టిక్ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రుబల్ జైన్ మాట్లాడుతూ ఇక్కడ 32వ అత్యాధునిక లాజిస్టిక్ పార్కును అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఐదేళ్ల క్రితం దేశ వ్యాప్తంగా తాము 32 పార్కులను తెరువాలని నిర్దేశించుకున్నామని, నేటికి ఈ లక్ష్యం నెరవేరిందన్నారు. క్రితం ఆర్థిక సంవత్సరంలో రూ.1,600 కోట్ల టర్నోవర్ సాధించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండకెంల వృద్ధి అంచనా వేస్తున్నామన్నారు. బెంగళూరు, ముంబయి, జైపూర్, లూధియాన, ఔరంగబాద్, సిలిగిరీలో కొత్త లాజిస్టిక్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకోసం 2019 నాటికి రూ.300 కోట్ల పెట్టుబడులతో వీటిని పూర్తి చేయాలని నిర్దేశించుకున్నామన్నారు. జిఎస్‌టి వల్ల ట్రాన్స్‌పోర్టు సేవల ధరలు పెరిగాయన్నారు.

రిలయన్స్ చేతికి టాటా టెలికం..!



ముంబయి : టెలికం రంగంలో నెలకొన్న తీవ్ర పోటీ వల్ల ఈ రంగంలో మరో విలీనం చోటు చేసుకునే సంకేతాలు కనబడుతోన్నాయి. దేశంలోనే అతిపెద్ద కార్పొరేట్ సంస్థ టాటా గ్రూప్‌నకు చెందిన టెలికాం వ్యాపారాలను, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సొంతం చేసుకోబోతుందని తెలుస్తోంది. టాటా గ్రూప్ నష్టాల్లో ఉన్న తన వ్యాపారాన్ని, ఆస్తులను రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు అమ్మనున్నట్లు సమాచారం. ఇటీవల టాటాల టెలికాం వ్యాపారాలు నష్టాల్లో కూరుకుపోయాయి. గత కొంతకాలంగా తమ గ్రూప్‌కు చెందిన టెలికాం, ఓవర్‌సీస్ కేబుల్, ఎంటర్‌ప్రైజ్ సర్వీసెస్, డిటిహెచ్ టివి వ్యాపారాలను విక్రయించే ఆలోచనలో టాటా గ్రూపు ఉంది. తొలుత అనిల్ అంబానీకి చెందిన ఆర్‌కామ్ కూడా టాటా టెలిని కొనడానికి మొగ్గుచూపిందని, కానీ ఇప్పటికే తమకున్న తీవ్ర నష్టాలు, ఎయిర్‌సెల్ విలీనంలో చోటుచేసుకున్న అనిశ్చిత పరిస్థితులతో వెనక్కి తగ్గిందని తెలుస్తోంది. ఆ తర్వాత ఈ వ్యాపారాలను భారతీ ఎంటర్‌ప్రైజెస్‌కు విక్రయించాలని భావించింది. కాని భారతీ ఈ ఒప్పందాన్ని కాదనుకుంది. దీంతో ఎయిర్‌టెల్‌కు గట్టి పోటీగా ఉన్న రిలయన్స్ జియోకి వీటిని విక్రయించాలని టాటాలు యోచిస్తోన్నట్లు తెలుస్తోంది. టాటా టెలిలో మెజార్టీ వాటా టాటా గ్రూప్ చేతుల్లో ఉంది. 49 శాతం లిస్టు అయిన టాటా కమ్యూనికేషన్ వద్ద ఉంది. ఈ ఊహాగానాలపై టాటా గ్రూప్ కానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ కానీ స్పందించలేదు.

డెబిట్ కార్డులపై ఫ్లిప్‌కార్ట్ ఇఎంఐ..!

బెంగళూరు : ఆన్‌లైన్ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఇక నుంచి డెబిట్ కార్డులతో కొనుగోలు చేసేవారికి కూడా ఇఎంఐ సౌకర్యం కల్పించేందుకు కసరత్తు చేస్తోంది. వార్షిక బిగ్‌బిలియన్ డేస్ సందర్భంగా దీన్ని అందుబాటులోకి తేనుంది. దీని వల్ల సంస్థ రెవెన్యూ, అమ్మకాలు పెరుగుతాయని ఆ కంపెనీ ఆశతో ఉంది. పైలెట్ ప్రాజెక్టు కింద ఎస్‌బిఐ, యాక్సిస్ బ్యాంక్‌లతో కలిసి ఫ్లిప్‌కార్ట్ పనిచేయనుంది. మొదట ప్రయోగాత్మకంగా భారీ విలువ కలిగిన గహోపకరణాలకు వర్తింపజేసి, అనంతరం మిగతా కేటగిరీలకు విస్తరించనున్నట్లు ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధి సందీప్ కర్వా తెలిపారు. వినియోగదారుల గత కొనుగోలు తీరును, ఇతర వివరాలను పరిశీలించిన అనంతరం కొంతమందికి వారి డెబిట్ కార్డులపై ఇఎంఐ సౌకర్యం కల్పిస్తామన్నారు.

రాణించిన ఆంధ్రా బ్యాంకు

- వీడని మొండి బాకీల ఒత్తిడి
- అయినా నికర లాభాల్లో 30% వృద్ధి
- మొత్తం ఆదాయం రూ.5,155 కోట్లు



క్యూ1 ఫలితాల ప్రధానాంశాలు..

- వ్యాపారం 5.89 శాతం పెరిగి రూ.3,34.073 కోట్లుగా నమోదు.
- మొత్తం డిపాజిట్లు 5.61 శాతం వృద్ధితో రూ.1,88.272 కోట్లు.
- కాసా డిపాజిట్లు 24 శాతం పెరిగి రూ.58,615 కోట్లకు చేరిక.
- అడ్వాన్సులు 6 శాతం వృద్ధితో రూ.1,45,801 కోట్లు.
- రిటైల్ రుణాలు 19 శాతం వృద్ధితో రూ.29,327 కోట్లు.
- వ్యవసాయ రుణాలు 11.82 శాతం పెరిగి రూ.27,919 కోట్లుగా నమోదు.
- ఎంఎస్ఎంఇ రుణాలు 23 శాతం పెరిగి రూ.28,637 కోట్లు.
- వడ్డీపై ఆదాయం 6 శాతం పెరిగి రూ.4,4402 కోట్లకు చేరిక.

ప్రజాశక్తి – బిజినెస్ బ్యూరో

ప్రభుత్వ రంగంలోని ఆంధ్రా బ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో మొండి బాకీలు పెరిగినా మెరుగైన ఫలితాలు ప్రకటించింది. క్రితం క్యూ1లో 30.07 శాతం వృద్ధితో రూ.40.42 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.31.09 కోట్ల లాభాలు నమోదు చేసుకుంది. గత క్యూ1లో బ్యాంకు మొత్తం ఆదాయం రూ.5,155.21 కోట్లకు చేరింది. 2016 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.4,855.50 కోట్ల ఆదాయం ఆర్జించింది. నిర్వాహణ లాభాలు 37 శాతం వృద్ధితో రూ.1,000 కోట్లుగా నమోదు. 2017 జూన్ ముగింపు నాటికి ఆంధ్రా బ్యాంకు మొత్తం శాఖలు 2908, ఎటిఎం కేంద్రాలు 3929కి విస్తరించింది.

క్రితం జూన్ ముగింపు నాటికి బ్యాంకు స్థూల మొండి బాకీలు ఏకంగా 13.22 శాతానికి ఎగిసి రూ.19,428 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికం నాటికి జిఎన్‌పిఎ 10.30 శాతంతో రూ.14,137 కోట్లుగా నమోదయ్యాయి. క్రితం క్యూలో బ్యాంకు నికర నిరర్ధక ఆస్తులు 8.09 శాతానికి పెరిగాయి. గతేడాది ఇదే కాలంలో రూ.6.21 శాతంగా నమోదయ్యాయి. క్రితం క్యూ1లో మొండి బాకీల కోసం ఏకంగా రూ.1,301.11 కోట్ల కేటాయింపులు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.943.77 కోట్ల కేటాయింపులు జరిగాయి. శుక్రవారం ఎన్ఎస్ఇలో ఆంధ్రా బ్యాంకు షేర్ 1.55 శాతం పెరిగి రూ.55.80 వద్ద ముగిసింది.

ఎంఆర్ఎఫ్ లాభాల్లో భారీ క్షీణత

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన ప్రథమ త్రైమాసికం (క్యూ1)లో ప్రముఖ టైర్ల తయారీ కంపెనీ ఎంఆర్ఎఫ్ లిమిటెడ్ లాభాలు 78.30 శాతం తగ్గి రూ.106.53 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.490.93 కోట్ల నికర లాభాలు సాధించింది. మొత్తం ఆదాయం 2.65 శాతం పెరిగి రూ.4,060.93 కోట్లకు చేరింది. లాభాల్లో భారీ తగ్గుదల చోటు చేసుకోవడంతో శుక్రవారం బిఎస్ఇలో ఎంఆర్ఎఫ్ షేర్ 4.02 శాతం లేదా రూ.2,781.15 క్షీణించి రూ.66,395.10 వద్ద ముగిసింది. ఇంట్రా ట్రేడింగ్‌లో ఏకంగా 5.48 శాతం విలువ కోల్పోయి రూ.65,378.90 వద్ద ట్రేడింగ్ అయ్యింది. నిఫ్టీలో 4 శాతం నష్టపోయి రూ.66,361.15 వద్ద ముగిసింది.

ఊగిసలాటలో లాభాలు

- సెన్సెక్స్ 88 పాయింట్ల వృద్ధి



ముంబయి : వివిధ పరిణామాల మధ్య వారాంతంలో మార్కెట్లు ఊగిసలాటకు గురై తుదకు లాభాల్లో ముగిశాయి. కన్స్యూమర్ డ్యూరెబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్, పిఎస్‌యు సూచీల మద్దతుతో శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 87.53 పాయింట్లు లేదా 0.27 శాతం పెరిగి 32,325.41 వద్ద ముగిసింది. ఉదయం 32,191 వద్ద ప్రారంభమైన సూచీ ఓ దశలో 32,108 కనిష్ట స్థాయి వద్ద ట్రేడింగ్ అయ్యింది. మరో దశలో 32,352 గరిష్ట స్థాయిని తాకింది. రోజంతా ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ తుదకు పలు రంగాల సూచీల మద్దతుతో లాభాల్లో ముగిశాయి. ఎన్ఎస్ఇ నిఫ్టీ 52.75 పాయింట్లు లేదా 0.53 శాతం రాణించి 10,066.40కు చేరింది. బిఎస్ఇలో రంగాల వారిగా కన్స్యూమర్ డ్యూరెబుల్స్ 4.21 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.63 శాతం, లోహ 2.5 శాతం, పిఎస్‌యు 2.45 శాతం చొప్పున పెరిగి మారెవ్కట్లకు మద్దతుగా నిలిచాయి. మరోవైపు వైద్య సూచీ 0.94 శాతం నష్టపోయింది. సెన్సెక్స్‌లో హీరో మోటో కార్ప్ 3.11 శాతం, కోల్ ఇండియా 3.04 శాతం, టాటా స్టీల్ 2.85 శాతం, ఎన్‌టిపిసి 2.78 శాతం, హెచ్‌యుఎల్ 1.91 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి. మరోవైపు డాక్టర్ రెడ్డీస్ 3.76 శాతం, సన్‌ఫార్మా 1.85 శాతం, రిలయన్స్ 1.76 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 0.78 శాతం, హెచ్‌డిఎఫ్‌సి 0.27 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. వాల్ స్ట్రీట్ సూచీలు విలువ కోల్పోగా, ఆసియన్ స్టాక్స్ స్వల్పంగా పెరిగాయి.

డాబర్ లాభాల్లో తగ్గుదల

న్యూఢిల్లీ : ప్రముఖ ఎఫ్ఎంసిజి కంపెనీ డాబర్ ఇండియా 2017 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో రూ.264.86 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.293.64 కోట్ల లాభాలు సాధించింది. దీంతో పోల్చితే క్రితం క్యూ1 లాభాల్లో 9.80 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. ఇదే సమయంలో డాబర్ మొత్తం ఆదాయం 7.04 శాతం తగ్గి 1,871.34 కోట్లుగా చోటు చేసుకుంది. మొత్తం వ్యయం 7.03 శాతం తగ్గి రూ.1,533.51 కోట్లుగా ఉంది.

ఎంఅండ్ఎంకు జిఎస్టీ దెబ్బ

న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వల్ల దేశీయ ఆటోమొబైల్ కంపెనీ మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) లాభాల్లో తగ్గుదల చోటు చేసుకుంది. 2017 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో రూ.765.96 కోట్ల లాభాలు నమోదు చేసుకుంది. గతేడాది ఇదే త్రైమాసికం లాభాలతో పోల్చితే 19.79 శాతం తగ్గుదల నమోదయ్యింది. కాగా జిఎస్టీ అమలు వల్ల అమ్మకాల్లో ఒత్తిడి చోటు చేసుకుందని ఆ కంపెనీ పేర్కొంది. శుక్రవారం బిఎస్ఇలో ఎంఅండ్ఎం షేర్ విలువ 0.10 శాతం పెరిగి రూ.1,418.30 వద్ద ముగిసింది.

నిరాశపర్చిన హెచ్‌పిసిఎల్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ చమురు కంపెనీ హెచ్‌పిసిఎల్ ఆర్థిక ఫలితాలు సగానికిపైగా పడిపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 56శాతం క్షీణించి రూ.2,098.38 కోట్ల నుంచి రూ.924.75 కోట్లకు దిగజారింది. ఇదే సమయంలో ఈ చమురు కంపెనీ రెవెన్యూ 13శాతానికి పెరిగి రూ.51,599.52 కోట్లతో రూ.59,891.27 కోట్లకు చేరింది. కంపెనీ రుణాలు జూన్ 30 నాటికి రూ.21,250 నుంచి రూ.12,200 కోట్లకు దిగివచ్చాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఆంధ్రప్రదేశ్ బ్యాంకింగ్ వ్యవస్థ



టి.ఎం.దాసు
ఎపి మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలు
మహానంది.
సెల్ : 9000250127



రాష్ట్రంలో ఉన్న ఎస్‌బిఐ దాని అనుబంధ బ్యాంకుల సంఖ్య – 1469

- రాష్ట్రంలో ఈ బ్యాంకులు అధికంగా ఉన్న జిల్లాలు
1. విశాఖపట్నం
2. కృష్ణాజిల్లా

- రాష్ట్రంలో ఈ బ్యాంకులు అల్పంగా ఉన్న జిల్లాలు
1. విజయనగరం
2. శ్రీకాకుళం

విదేశీ బ్యాంకులు

– ఒక బ్యాంకు ప్రధానశాఖ విదేశాలలో ఉంటే ఆయా బ్యాంకులను విదేశీబ్యాంకులు అంటారు.
– రాష్ట్రంలో ఉన్న మొత్తం విదేశీ బ్యాంకులు – 4

రాష్ట్రంలో విదేశీ బ్యాంకులు గల జిల్లాలు
1. విశాఖపట్నం
2. తూర్పుగోదావరి
3. వైఎస్ఆర్ కడప
4. కర్నూలు

– మిగతా జిల్లాల్లో విదేశీ బ్యాంకులు లేవు.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్ఆర్‌బిఎస్)

– వీటిని నరసింహం కమిటీ సూచనల మేరకు ఏర్పాటు చేశారు.
– ఈ బ్యాంకులు నాబార్డ్ ఆధీనంలో ఉంటాయి.
– రాష్ట్రంలో మొత్తం ప్రాంతీయ బ్యాంకుల సంఖ్య – 1015

- రాష్ట్రంలో ప్రాంతీయ బ్యాంకులు అధికంగా ఉన్న జిల్లాలు
1. అనంతపురం
2. చిత్తూరు

- రాష్ట్రంలో ప్రాంతీయ బ్యాంకులు తక్కువగా ఉన్న జిల్లాలు.
1. పశ్చిమగోదావరి
2. తూర్పుగోదావరి

ప్రయివేటు బ్యాంకులు

– నరసింహం కమిటీ సూచనల మేరకు ప్రయివేటు బ్యాంకులు ఏర్పాటుకు 1993లో మార్గదర్శకాలు రూపొందించారు.
– రాష్ట్రంలో ఉన్న మొత్తం ప్రయివేటు బ్యాంకులు సంఖ్య – 698

- రాష్ట్రంలో ప్రయివేటు బ్యాంకులు అధికంగా ఉన్న జిల్లాలు.
1. గుంటూరు
2. కృష్ణా

- రాష్ట్రంలో ప్రైవేటు బ్యాంకులు తక్కువగా ఉన్న జిల్లాలు
1. శ్రీకాకుళం
2. విజయనగరం

- రాష్ట్రంలో షెడ్యూల్డ్ బ్యాంకులు తక్కువగా ఉన్న జిల్లాలు.
1. శ్రీకాకుళం (278)
2. విజయనగరం (285)

- రాష్ట్రంలో ఉన్న మొత్తం షెడ్యూల్డ్ బ్యాంకులు - 6679

షెడ్యూల్డ్ బ్యాంకులు ఇచ్చిన రుణాలు

– సెప్టెంబర్, 2015 నాటికి రాష్ట్రంలోని అన్ని **షెడ్యూల్డ్ బ్యాంకులు చేపట్టిన రుణాలు :** 2,20,295.46 కోట్లు

- రాష్ట్రంలో బ్యాంకులు అధికంగా రుణాలు ఇచ్చిన జిల్లాలు
1. విశాఖపట్నం
2. కృష్ణా
3. గుంటూరు

- రాష్ట్రంలో బ్యాంకులు అత్యల్పంగా రుణాలు ఇచ్చిన జిల్లాలు
1. విజయనగరం
2. శ్రీకాకుళం

షెడ్యూల్డ్ బ్యాంకులు డిపాజిట్లు

– 2015 సెప్టెంబర్ నాటికి రాష్ట్ర షెడ్యూల్డ్ బ్యాంకులు సేకరించిన డిపాజిట్లు – 2,05,815.06 కోట్లు

- రాష్ట్రంలో అధికంగా డిపాజిట్లు సేకరించిన జిల్లాలు.
1. విశాఖపట్నం
2. చిత్తూరు
3. కృష్ణా

- రాష్ట్రంలో అత్యల్పంగా డిపాజిట్లు సేకరించిన జిల్లాలు
1. విజయనగరం
2. శ్రీకాకుళం

రుణ డిపాజిట్ల నిష్పత్తి

– బ్యాంకులకు సంబంధించిన డిపాజిట్లలో ఇచ్చే రుణం మొత్తం గురించి తెలియజేసే నిష్పత్తిని రుణడిపాజిట్ నిష్పత్తి అంటారు.
– రుణ డిపాజిట్ నిష్పత్తి ఎక్కువగా ఉంటే పరపతి సృష్టి పెరుగుతుంది.
– రాష్ట్ర రుణ డిపాజిట్ నిష్పత్తి – 107.04 శాతం

- అత్యధిక రుణ డిపాజిట్ నిష్పత్తి గల జిల్లాలు.
1. పశ్చిమగోదావరి
2. ఎస్పీఎస్ నెల్లూరు
3. ప్రకాశం

- అతి తక్కువ రుణ డిపాజిట్ నిష్పత్తి గల జిల్లాలు.
1. చిత్తూరు
2. విజయనగరం

షెడ్యూల్డ్ బ్యాంకులు

– రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం (1934)లోని రెండో షెడ్యూల్లో నమోదైన బ్యాంకులను షెడ్యూల్డ్ బ్యాంకులు అంటారు.

- రాష్ట్రంలో షెడ్యూల్డ్ బ్యాంకులు అధికంగా ఉన్న జిల్లాలు.
1. కృష్ణాజిల్లా (753)
2. గుంటూరు (738)
3. తూర్పుగోదావరి (724)

జాతీయం చేసిన బ్యాంకులు

– రాష్ట్రంలో మొత్తం జాతీయం చేసిన బ్యాంకుల బ్రాంచీల సంఖ్య – 2898

- రాష్ట్రంలో మొత్తం జాతీయం చేసిన బ్యాంకులు అధికంగా ఉన్న జిల్లాలు
1. కృష్ణాజిల్లా
2. తూర్పుగోదావరి

- రాష్ట్రంలో మొత్తం జాతీయం చేసిన బ్యాంకులు తక్కువగా ఉన్న జిల్లాలు.
1. శ్రీకాకుళం
2. విజయనగరం

సగటు బ్యాంక్ జనాభా : (మార్చి 2015 వివరాల ప్రకారం)

– ఒక బ్యాంకు ఎంత మందికి సేవలు అందిస్తుందో బ్యాంకు పరిధిలోనే సగటు జనాభా తెలుపుతుంది.
– ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సగటు బ్యాంకు జనాభా – 8,440

సగటు బ్యాంకు జనాభా అధికంగా ఉన్న జిల్లా : వైఎస్ఆర్ కడప (13,540)

సగటు బ్యాంకు జనాభా అత్యల్పంగా ఉన్న జిల్లా : కృష్ణా (6,770)

2015, సెప్టెంబర్ 30 నాటికి అత్యధిక వ్యవసాయ రుణం పొందిన జిల్లాలు.
1. తూర్పుగోదావరి (81.84 కోట్లు)
2. పశ్చిమగోదావరి (43.93 కోట్లు)
3. గుంటూరు (3.26 కోట్లు)
4. కృష్ణా (2.94 కోట్లు)

2015, సెప్టెంబర్ 30 నాటికి అత్యల్ప వ్యవసాయ రుణాన్ని పొందిన జిల్లాలు.
1. కర్నూలు (0.07 కోట్లు)
2. విజయనగరం (0.82 కోట్లు)
3. నెల్లూరు (1.05 కోట్లు)
4. చిత్తూరు (1.66 కోట్లు)

- 2015 సెప్టెంబర్ 30 నాటికి అత్యధిక వ్యవసాయ రుణాలు పంపిణీ చేసిన జిల్లాలు (శాతంలో)
1. అనంతపురం (89.13 శాతం)
2. విశాఖపట్నం (88.41 శాతం)
3. ప్రకాశం (64.57 శాతం)
4. కడప (62.86 శాతం)

- 2015 సెప్టెంబర్ 30 నాటికి అత్యల్ప వ్యవసాయ రుణాలు పంపిణీ చేసిన జిల్లాలు (శాతంలో)
1. కృష్ణా (49.68 శాతం)
2. శ్రీకాకుళం (49.96 శాతం)
3. నెల్లూరు (55.46 శాతం)
4. విజయనగరం (56.03 శాతం)

- 2015 సెప్టెంబర్ 30 నాటికి అత్యధిక వ్యవసాయ రుణ కార్డులు పంపిణీ చేసిన జిల్లాలు
1. పశ్చిమగోదావరి (223253)
2. తూర్పుగోదావరి (101121)
3. కర్నూలు (22461)
4. విజయనగరం (15827)

- 2015 సెప్టెంబర్ 30 నాటికి అత్యల్ప రుణ అర్హత కార్డులు పంపిణీ చేసిన జిల్లాలు.
1. అనంతపురం (3441)
2. కడప (5344)
3. చిత్తూరు (5436)

రుణమాఫీ

- 2015-16లో అత్యధిక రుణమాఫీ పథకానికి అర్హత పొందిన జిల్లాలు
1. కడప (1054.87 కోట్లు)
2. గుంటూరు (917.84 కోట్లు)
3. కర్నూలు (679.89 కోట్లు)
4. పశ్చిమగోదావరి (627.29 కోట్లు)

2015-16లో అత్యల్ప రుణమాఫీ పథకానికి అర్హత పొందిన జిల్లాలు.
1. విజయనగరం (308.58 కోట్లు)
2. విశాఖపట్నం (326.35 కోట్లు)
3. శ్రీకాకుళం (387.034 కోట్లు)
4. నెల్లూరు (394.26 కోట్లు)

★

నమూనా ప్రశ్నలు

1. కిందివాటిలో లిస్ట్–1, లిస్ట్–2లో ఉన్న అంశాలను కింది కోడ్‌ను ఉపయోగించి జతపరచండి ?

లిస్ట్-1	లిస్ట్-2
అ. జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంక్	1. 1948
ఆ. భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంక్	2. 1990
ఇ. చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్	3. 1964
ఈ. భారత పారిశ్రామిక విత్త సంస్థ	4. 1982

	అ	ఆ	ఇ	ఈ
ఎ.	4	3	2	1
బి.	4	3	1	2
సి.	3	1	4	2
డి.	4	1	2	3

2. రెండో జాతీయ లేబర్ కమిషన్ ఏర్పాటు చేసిన సంవత్సరం ?
ఎ. 1980 బి. 1993 సి. 1999 డి. 2006

3. రఘురాం రాజన్ కమిటీ సూచనల మేరకు కింది వాటిలో సాపేక్షంగా అభివృద్ధి చెందిన రాష్ట్రం ఏది ?
ఎ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బి. మధ్యప్రదేశ్
సి. ఉత్తరప్రదేశ్ డి. మిజోరం

4. రఘురాం రాజన్ కమిటీ సూచనల మేరకు అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రం ?
ఎ. గుజరాత్ బి. మహారాష్ట్ర
సి. గోవా డి. కేరళ

5. పాండే కమిటీ ప్రకారం వెనకబడిన ప్రాంతాలలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోవాలో సలహాలు ఇవ్వడానికి నియమించిన కమిటీ ఏది ?
ఎ. దత్ కమిటీ బి. వాంఛూ కమిటీ
సి. లలిత్ మోదీ కమిటీ డి. భార్గవ కమిటీ

6. ఉద్యానవనాల అభివృద్ధి ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచిన ఢిల్లీ సుల్తాన్ ఎవరు ?
ఎ. అల్లావుద్దీన్ ఖిల్జీ బి. బాల్బన్
సి. ఫిరోజ్‌షా తుగ్లక్ డి. సికిందర్ లోడి

7. మహ్మద్‌బిన్ తుగ్లక్ కాలంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ శాఖను ఏమంటారు ?
ఎ. దివాన్–ఇ–కోహి బి. దివాన్–ఇ–ఆదిల్
సి. దివాన్–ఇ–ముస్తర్ డి. దివాన్–ఇ–సరాయి

8. అక్బర్ కాలంలో బందోబస్తు విధానం విజయవంతం కావడానికి కారకుడైన వ్యక్తి ఎవరు ?
ఎ. రాజామాన్‌సింగ్ బి. రాజ్‌తోడర్‌మల్
సి. రాజా బీర్బల్ డి. పై అన్నియూ

9. కింది వాటిలో సరైనది గుర్తించండి ?
ఎ. జమీందారీ వ్యవస్థ – బెంగాల్
బి. మహల్వారీ వ్యవస్థ – ఆగ్రా
సి. రైత్వారీ వ్యవస్థ – దత్త మండలాలు
డి. పై అన్నియూ

10. కిందివాటిలో లిస్ట్–1 మరియు లిస్ట్–2లో ఉన్న అంశాలను కింది కోడ్‌ను ఉపయోగించి, జతపరచండి ?

లిస్ట్-1	లిస్-2
అ. మార్కెట్ సంస్కరణలు	1. ఫిరోజ్‌షా తుగ్లక్
ఆ. రాగి నాణేలు	2. షేర్షా
ఇ. వెండి రూపాయి	3.అల్లావుద్దీన్ ఖిల్జీ
ఈ. కాలువల నిర్మాణం	4. మహ్మద్‌బిన్ తుగ్లక్

	అ	ఆ	ఇ	ఈ
ఎ.	3	2	1	4
బి.	4	3	1	2
సి.	3	4	2	1
డి.	4	1	2	3

11. లార్డ్ లిట్టన్ వైస్రాయ్ కాలంలో క్షామ నివారణ కమిషన్‌ను ఎవరి నేతృత్వంలో ఏర్పాటు చేశారు ?
ఎ. రిచర్డ్ స్ట్రాచీ బి. జాన్ ఇలియట్
సి. జోసఫ్ హెబర్ డి. సర్ ఆర్థర్ కాటన్

సమాధానాలు : 1.డి, 2.సి, 3.డి, 4.సి, 5.బి, 6.సి, 7.ఎ, 8.బి, 9.డి, 10.సి, 11.ఎ.

రేపు కాకినాడలో సాహితీ స్రవంతి వార్షికోత్సవం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాహితీ స్రవంతి నాలుగో వార్షికోత్సవం కాకినాడలోనిపిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 6న ఏర్పాటువుతోందని ఆ సంస్థ అధ్యక్షులు గనరా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పుస్తకావిష్కరణలు, సాహిత్య సదస్సులు, నేటి సమాజం-సాహిత్య బాధ్యత, నేటి కవిత్వం-సామాజికత అంశాలపై వక్తలు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం కవి సమ్మేళనం ఉంటుందని, ఇందులో కవులంతా పాల్గొనాలని కోరారు.

నాగాయలంకలో ముగిసిన మత్స్యకారుల దీక్షలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఏపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా నాగాయలంకలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. రిజర్వ్ ఫారెస్టు భూములను గ్రామస్తులు సాగులోకి తీసుకొచ్చారని, నష్టపరిహారం చెల్లించే ప్రసక్తే లేదని రెవెన్యూ యంత్రాంగం తేల్చిచెప్పటంతో ఏడేళ్ల నుంచి ఆందోళన కొనసాగుతోంది. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ఎకరానికి రూ.1.80 లక్షలు చెల్లించేందుకు రెవెన్యూ యంత్రాంగం ముందుకొచ్చింది. నష్టపరిహారం చెల్లింపులో ఎవరి దయాదాక్షిణ్యాలు రైతులకు అవసరం లేదని, రక్షణ పరిశోధనా కేంద్రం కోసం గుల్లలమోద గ్రామస్తుల నుంచి సేకరించిన భూములకు తక్షణమే 2013 భూసేకరణ చట్టం ప్రకారం చెల్లింపులు జరపాలని సిపిఎం తూర్పుకృష్ణా కార్యదర్శి ఆర్.రఘు ముగింపు సభలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుది జాబితాలో తొలగించిన 48 మంది అర్హుల పేర్లను తిరిగి చేర్చాలని కోరారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు నాలుగు రోజుల పాటు నిరాహారదీక్షలు చేశారని, దీనిపై ప్రభుత్వం సత్వరమే స్పందించకపోతే ఈనెల ఏడోతేదీన కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని రఘు హెచ్చరించారు. ఈ దీక్షల్లో ఎపి మత్స్యకారులు, కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొల్లాటి శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల వేతనాలను సవరించాలి

ముఖ్య కార్యదర్శికి వ్యకాస వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యవసాయ కార్మికుల కనీస వేతనాలను సవరించి, అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్‌ను శుక్రవారం సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, కార్యదర్శి క్రాంతి కిరణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ చంద్రశేఖర్ కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మికులు కోటి మందికి పైగా ఉన్నారని, వీరికి సొంత ఆస్తి లేదని తెలిపారు. రాష్ట్రంలో రోజు కూలీ రూ.100 నుంచి రూ.150లకు మించి ఇవ్వడం లేదని, స్త్రీలకు మరింత తక్కువగా ఇస్తున్నారని వివరించారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో పోలిస్తే వీరికిచ్చే వేతనం సరిపోవడం లేదని తెలిపారు. వ్యవసాయ రంగంలో రెండేళ్లకు ఒకసారి వేతనాలు సవరించాలని, ఐదేళ్లవుతున్నా ఇంతవరకు సవరించలేదని, అందువల్ల వ్యవసాయ కార్మికుల కనీస వేతనాల చట్టాన్ని వెంటనే సవరించి, అమలుకు కార్మిక శాఖ కృషి చేయాలని కోరారు. అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో కనీస వేతనాల బోర్డుకు చైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.

సూర్యకుమారి అదృశ్యంతో సంబంధం లేదు : విద్యాసాగర్

ప్రజాశక్తి - మొగల్రాజపురం (విజయవాడ)

డాక్టర్ సూర్యకుమారి అదృశ్యంతో తనకు సంబంధం లేదని ఈ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న మాజీ ఎంఎల్ఎ జయరాజు కుమారుడు విద్యాసాగర్ అలియాస్ బాబీ చెప్పారు. ఈ వ్యవహారంలో పోలీసులు విద్యాసాగర్‌ను శుక్రవారం విడుదల చేశారు. పోలీస్‌స్టేషన్ నుండి బయటకు వచ్చిన అతను విజయవాడ సూర్యారావుపేటలోని న్యాయవాది తానికొండ చిరంజీవి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సూర్యకుమారి కుటుంబానికీ, తమ కుటుంబానికీ ఇరవై ఏళ్లుగా పరిచయం ఉన్నట్లు తెలిపారు. అలాగే సూర్యకుమారి, తనకు మధ్య ఏడేళ్ల నుండి స్నేహం ఉందని, ఇద్దరి మధ్య స్నేహం తప్ప మరే సంబంధం లేదన్నారు. జులై 31వ తేదీ అర్ధరాత్రి ఆమె తమ ఇంటికి వచ్చిన మాట వాస్తవమేనన్నారు. ఆమె ఉన్నత చదువు కోసం ఢిల్లీ వెళ్తూ తనకు ఫోన్ చేసిందని, అయితే తన ఫోన్ సైలెంట్ మోడ్‌లో ఉండటంతో తీయలేదని, దీంతో ఆమె తమ ఇంటికి వచ్చిందని తెలిపారు. ఢిల్లీకి రావాలని తనను కోరిందని, తనకు కుదరదని చెప్పానని వివరించారు. ఈ క్రమంలో ఆమె సెల్‌ఫోన్‌ను తమ ఇంట్లో మర్చిపోగా, తానే స్వయంగా ఆమె ఇంటికి వెళ్లి ఆమె తల్లికి ఇచ్చానని తెలిపారు. ఈ నెల ఒకటో తేదీన మాచవరం పోలీసులు తనను స్టేషన్‌కు పిలిచారని తెలిపారు. నాలుగురోజుల పాటు పోలీస్ అధికారులు జరిపిన విచారణకు పూర్తిగా సహకరించానని తెలిపారు. ఆమె అదృశ్యంపై తన ప్రమేయం లేదని పోలీసులు నిర్ధారించుకుని విడుదల చేశారని తెలిపారు.

ప్రజ్ఞ

జవాబులు

1. ఎన్ఐఎస్ఎఆర్ (నిస్సర్)
2. హస్సన్ రౌహని
3. హర్మన్ ప్రీత్ కౌర్
4. నాలుగు రెట్లు
5. విజయవాడ, తిరుపతి

మరో పోరాటం తప్పదు

హామీల అమల్లో నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి
- నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంది
- గరగపర్రు దళితుల సంఘీభావ సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు


సదస్సులో ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు


సదస్సులో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-భీమవరం రూరల్

'గరగపర్రు దళితులకు ఇచ్చిన హామీల అమల్లో నిర్లక్ష్యం వహిస్తే మరో పోరాటం తప్పదు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంది. ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. ఐదు రోజుల్లో గరగపర్రు దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, సమస్యలను పరిష్కరించకపోతే అందరినీ కలుపుకుని రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతాం. అవసరమైతే చలో అమరావతికి పిలుపునిస్తాం' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు హెచ్చరించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని లూథరన్ గ్రౌండ్‌లో గరగపర్రు దళితుల సంఘీభావ సదస్సు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దిగుపాటి రాజుగోపాల్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. సాంఘిక బహిష్కరణ జరిగిన నాటి నుంచి దళిత సంఘాలు, వామపక్ష పార్టీలు పెద్దఎత్తున చేపట్టిన పోరాటంతో ప్రభుత్వం దిగొచ్చిందని గుర్తు చేశారు. దళితులతో జరిపిన చర్చల్లో కుటుంబానికి లక్ష రూపాయలు చొప్పున ఇస్తామని, అంబేద్కర్ విగ్రహాన్ని దళితులు కోరినచోట పెడతామని, కౌలు భూములు ఇప్పిస్తామని, గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పుతామని మంత్రులు హామీ ఇచ్చారన్నారు. ఇరుపక్షాల చేతులు కలిపేసి, మంత్రులు తమ చేతులు దులుపుకున్నారని విమర్శించారు. హామీలను మరో ఐదు రోజుల్లో అమలు చేస్తామని అమరావతి వెళ్లిన దళితులకు మంత్రి ఆనందబాబు హామీ ఇచ్చారని, తాము మరో ఐదు రోజులు వేచిచూస్తామని తెలిపారు. అప్పటికీ హామీలు అమలు కాకపోతే ఉండి, భీమవరం నియోజకవర్గాలతోపాటు పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని దళితపేటల్లో సభలు నిర్వహించి, అన్ని పార్టీలను, 13 జిల్లాల్లో ఉన్న దళిత సంఘాలను ఏకం చేసి చలో అమరావతికి పిలుపునిస్తామని హెచ్చరించారు.

చంద్రబాబు గరగపర్రులో పర్యటించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

నంద్యాల వెళ్లడానికి హెలీకాప్టర్‌లో ఇంధనం ఉంటుందిగాని, సాంఘిక బహిష్కరణకు గురై ఆందోళన వ్యక్తం చేస్తున్న గరగపర్రు దళితుల వద్దకు రావడానికి చంద్రబాబు హెలీకాప్టర్‌లో ఇంధనం ఉండడం లేదా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. చంద్రబాబు గరగపర్రులో పర్యటించి, దళితులతో కలిసి భోజనం చేసి రాత్రి నిద్ర చేయాలని డిమాండ్ చేశారు. దళితులను ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని, వారికి వామపక్షాలు, ప్రజాసంఘాలు అండగా ఉంటాయని స్పష్టం చేశారు. గరగపర్రు దళితులకు న్యాయం జరిగేవరకూ పోరాడతామని హెచ్చరించారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు సాంబశివరావు మాట్లాడుతూ దళితుల సమస్యలు పరిష్కారం కాకుండానే పరిష్కారమైనట్లు మంత్రులు చెప్పడం అన్యాయమన్నారు. గ్రామంలో ఉన్న 400 దళిత కుటుంబాలకు లక్ష రూపాయలు చొప్పున తక్షణం అందించాలని డిమాండ్ చేశారు. వైసిపి పట్టణ అధ్యక్షులు కోడే యుగంధర్, దళిత ఐక్యవేదిక జిల్లా నాయకులు గంటా సుందర్ కుమార్ మాట్లాడారు. గరగపర్రులోని సమస్యలు పరిష్కరించాలని, మంత్రుల బృందం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన ఎరిచర్ల రాజేష్ సదస్సులో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.

నల్లరిబ్బన్లతో మౌన ప్రదర్శన

279 జీవోను రద్దు చేయాలని మున్సిపల్ కార్మికుల డిమాండ్


విజయవాడలో నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-యంత్రాంగం

పట్టణాలల్లో ప్రజారోగ్యాన్ని పౌరసేవలను కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టే 279 జీవో రద్దు చేయాలని, 151 జిఒ ప్రకారం వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు జెఎసి, సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం నోటికి నల్ల రిబ్బన్ కట్టుకొని మౌన ప్రదర్శన నిర్వహించారు. విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం వరకు మున్సిపల్ కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. జెఎసి నాయకులు ఎం.డేవిడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 279 జిఒను విడుదల చేసి నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనులను ప్రయివేటు వ్యక్తులకు దారాదత్తం చేసి కార్మికులకు పనిలేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కృష్ణాజిల్లా నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో ధర్నా నిర్వహించారు. తిరువూరులో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్ మీదుగా మెయిన్‌రోడ్డు బోసుబొమ్మ బస్టాప్ సెంటర్ వరకు వినూత్నరీతిలో ప్రదర్శన నిర్వహించారు. గుంటూరు, తాడేపల్లి, సత్తెనపల్లిలో మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. నగరపాలకసంస్థ అదనపు కమిషనర్‌కు జెఎసి నాయకులు వినతిపత్రం అందచేశారు. శ్రీకాకుళంలో ఏడు రోడ్ల కూడలి నుంచి శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ కార్మికులు మౌన ప్రదర్శన చేశారు. పాలకొండలో నగర పంచాయతీ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. గాజువాక, మధురవాడ ప్రాంతాల్లోనూ ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలోని మున్సిపల్ కార్మికులు నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని, ప్లకార్డులు పట్టుకుని ఆర్ఆర్ పేట పార్కు నుంచి పవర్‌పేట రైల్వేస్టేషన్ వరకూ మౌన ప్రదర్శన చేశారు. తాడేపల్లిగూడెంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణ వద్ద, జంగారెడ్డిగూడెంలో, పాలకొల్లు మెయిన్ రోడ్డులో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతపురంలో మున్సిపల్ కార్మికులు స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి మౌనప్రదర్శన ప్రారంభించి సప్తగిరి సర్కిల్, రఘువీరా సర్కిల్ మీదుగా మున్సిపల్ కార్యాలయం ఎదుట చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

6న రాష్ట్రస్థాయి విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సమావేశం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి కార్యాచరణను రూపొందించేందుకు ఈ నెల 6న విజయవాడలో రాష్ట్ర స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఎన్‌టిటిపిఎస్ ప్రాంతీయ కార్యదర్శి జ్వాలా నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలోని రాఘవయ్య పార్కు వద్ద గల మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని కార్మిక సంఘాలనూ సమావేశానికి ఆహ్వానించామని తెలిపారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉమ్మడి పోరాటాలు అవసరమని పేర్కొన్నారు. డాక్టర్ ఎన్‌టిటిపిఎస్‌లోని ఉద్యోగ సంఘమైన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కూడా మద్దతునిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షులు పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల పరిరక్షణకు సిఫార్సులు

- ఎపి శాసనసభ ఎస్‌టి కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పాడేరు రూరల్ (విశాఖ)

గిరిజనుల అభివృద్ధి, వారి హక్కుల పరిరక్షణకు పూర్తిస్థాయి సిఫార్సులు ప్రభుత్వానికి అందజేస్తామని ఎపి శాసన సభ షెడ్యూల్డ్ తెగల కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సమాజంలో అన్నివిధాలుగా వెనుకబడిన గిరిజనులకు మైదాన ప్రాంత వాసులతో సమాన అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై నివేదిక ఇస్తామన్నారు. శుక్రవారం విశాఖ మన్యంలో పర్యటించిన కమిటీ ముందుగా డుంబ్రిగుడ పిహెచ్‌సిని సందర్శించింది. తరువాత పాడేరులో వివిధ వర్గాల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం పాడేరు ఐటిడిఎ కాఫీహౌస్ సమావేశ మందిరంలో ఎస్‌టి రిజర్వేషన్ల అమలు, గిరిజన ప్రాంతాల్లో వివిధ శాఖలు అమలు చేస్తున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. గిరిజనుల సమగ్రాభివృద్ధికి వేలాది కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా ఎందుఉ అభివృద్ధి సాధించడం లేదో అధికారులు పరిశీలించుకోవాలని కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు హితవుపలికారు. ఆరు నెలల తరువాత తాము మళ్లీ పర్యటిస్తామని, ఆ నాటికి మార్పులు వచ్చేలా అధికారులందరూ కృషి చేయాలని కోరారు. కమిటీ సభ్యులు విరపు బాలసుబ్రహ్మణ్యం, గిడ్డి ఈశ్వరి, ఎం.అప్పలనాయుడు, టి.రత్నబాయి, వీరాంజనేయులు, అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టాన్ని తిప్పికొట్టండి : ఎంఎల్‌సి విఠపు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి


విశాఖ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017ను తిప్పికొట్టాలని ఎమ్మెల్సీ, విద్యా వికాస వేదిక రాష్ట్ర కన్వీనర్, శాసనమండలి పిడిఎఫ్ పక్షనేత విఠపు బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. విశాఖలోని జివిఎంసి కార్యాలయం ఎదురుగా ఉన్న బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఈ చట్టంపై సదస్సు నిర్వహించారు. ఆర్‌టిఇ ఫోరం, విద్యా వికాస వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1980లో వచ్చిన నూతన విద్యా విధానం చాలా ప్రమాదకరమని అప్పట్లోనే చర్చ జరిగిందని అన్నారు. 2016లో మరోసారి అలాంటి విద్యావిధానాన్నే బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దీనిపై అంత వ్యతిరేక భావం లేదని తెలుసుకున్న ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి అంతకన్నా ప్రమాదకరమైన స్వయం పోషక స్వతంత్ర పాఠశాల చట్టం-2017 తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. ఇంత ప్రమాదకరమైన చట్టంపై చర్చ జరగకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఈ చట్టంపై ఉపాధ్యాయులు, సంఘాలు, ఎమ్మెల్సీలు, చివరికి విద్యాశాఖతో కూడా చర్చించకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఆర్‌టిఇ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు సింహాద్రప్పడు, రెడ్డి, యుటిఎఫ్ నాయకులు డి.రాము, ప్రసాద్, వివిధ సంఘాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రుల కృషి ప్రశంసనీయం

స్పీకర్ కోడెల శివప్రసాదరావు


మాట్లాడుతున్న స్పీకర్ కోడెల శివప్రసాదరావు

ప్రజాశక్తి-రాజుపాలెం

విద్యావ్యాప్తికి సహకరిస్తున్న ప్రవాసాంధ్రుల కృషి ప్రశంసనీయమని సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాద్ కొనియాడారు. గుంటూరు జిల్లా రాజుపాలెం మండలం ఇనిమెట్లలో ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం డిజిటల్ తరగతులను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ-తరగతుల కారణంగా విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని నిర్దేశించుకొని విద్యాభ్యాసం చేయాలని చెప్పారు. ఇనిమెట్ల గ్రామానికి చెందిన తానా కార్యదర్శి కొండ్రగుంట చలపతిరావు (ఎన్ఆర్ఐ) పది ప్రభుత్వ పాఠశాలల డిజిటల్ తరగతులకు రూ.45 వేలు చొప్పున రూ.4.50 లక్షలు విరాళంగా అందజేయడాన్ని అభినందించారు. ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. వీధిబడుల్లో చదువుకున్నవారు దేశ, విదేశాల్లో వివిధ రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా చాలా అభివృద్ధి చెందారన్నారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెంలో ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులను పౌరసరఫరాల శాఖామంత్రి పత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. లింగారావుపాలెంకు చెందిన ఆలోకం శ్రీరామ్ 12 పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ప్రారంభించడానికి రూ.20 లక్షలు ఇవ్వడం ప్రశంసనీయమని మంత్రి పేర్కొన్నారు.

బాబు హామీ ఇచ్చారు

జూపూడి ప్రభాకరరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రులో జరిగిన ఘటనలో దళితులకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీతోనే ఉద్యమం విరమించారని ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకరరావు అన్నారు. గుంటూరులోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గరగపర్రులో దళితులు అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుకు ప్రయత్నించగా కొన్ని సామాజిక వర్గాలు వ్యతిరేకించాయన్నారు. ఇందుకు నిరసనగా ఉద్యమం జరిగిందని, ఉద్యమకారులతో మాట్లాడి సమస్యను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని సిఎం హామీ ఇచ్చారని చెప్పారు. దళితుల తరపున పోరాడిన వారిని విజయవాడలో సీఎం వద్దకు తీసుకెళ్లామని, వారి సూచనలకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. దీంతో తాము ఉద్యమాన్ని నిలిపివేసినట్టు జూపూడితో సమావేశంలో పాల్గొన్న వెంకటరత్నం, ప్రసాద్, ముసలయ్య, బాబి, రాజు, ఏసు చెప్పారు.

భూసేకరణ సదస్సు బహిష్కరణ

ప్రజాశక్తి-తుళ్ళూరు

గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం రాయపూడిలోని కంఠంరాజుపాలెం భూములకు సంబంధించి శుక్రవారం ఏర్పాటు చేసిన భూసేకరణ సదస్సును రైతులు బహిష్కరించారు. ఉదయం 11 గంటలకు సిఆర్‌డిఎ కాంపిటెంట్ అథారిటీ కార్యాలయంలో సదస్సుకు ఏర్పాట్లు జరిగాయి. డిప్యూటీ కలెక్టర్ నిర్దేశించిన సమయానికి కార్యాలయానికి వచ్చినప్పటికీ రైతులెవరూ రాలేదు. చాలాసేపు ఎదురుచూసిన అనంతరం 15 మంది రైతులు సదస్సుకు హాజరయ్యారు. రాజధాని నిర్మాణానికి భూములివ్వని రైతులు తమ అభ్యంతరాలను తెలియజేయాలని డిప్యూటీ కలెక్టర్ కోరగా రైతులు ఆసక్తి చూపలేదు. ఇంతకుముందు సదస్సుల్లో విన్నవించినా సమస్యలు పరిష్కరించకుండా సదస్సులు ఏమిటంటూ రైతులు ప్రశ్నించారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మిఠాయి పొట్లంలా పెట్టి డిప్యూటీ కలెక్టరుకు అందజేశారు. అనంతరం సదస్సును బహిష్కరిస్తున్నామని, సమస్యలు పరిష్కరించాకే సదస్సులు పెట్టాలని చెప్పి సమావేశం నుంచి బయటకు వెళ్ళిపోయారు.

హమాలీలకు సమగ్ర చట్టం చేయండి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని హమాలీ కార్మికులకు పని భద్రత, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ డిమాండ్ చేశారు. సిఐటియు విజయవాడ నగర కార్యాలయంలో శుక్రవారం జరిగిన హమాలీ కార్మికుల రాష్ట్ర ఫెడరేషన్ విస్తృత సమావేశంలో గఫూర్ మాట్లాడారు. హమాలీల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. హమాలీలు ప్రమాదాల్లో చనిపోతున్నా ఆ కుటుంబాలను ఆదుకోవడం లేదన్నారు. ఫెడరేషన్ కన్వీనర్ కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సమగ్ర చట్టం కోసం హమాలీలంతా సమైక్యంగా పోరాడేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 2010లో యుపిఎ ప్రభుత్వం హమాలీలతో అధిక బరువులు మోయించడాన్ని నిషేధిస్తామని ప్రకటించినా, నేటికీ అమలు కాలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా హమాలీల బతుకుల్లో మార్పు రావడం లేదని, పని ప్రాంతాల్లో మౌలిక వసతులైనా కల్పించకపోవడం శోచనీయమని విమర్శించారు. ఫెడరేషన్ కో కన్వీనర్ ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ హమాలీలు అర్ధరాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్తుంటే పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరలు నిత్యమూ పెరుగుతున్నందున, హమాలీలు చాలీచాలని వేతనాలతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. నగదు బదిలీ విధానంతో సివిల్ సప్లయిస్ హమాలీల ఉపాధికి ఎసరు పెడుతున్నారని విమర్శించారు. ఫెడరేషన్ నాయకులు చింతకాయల బాబురావు అధ్యక్షత వహించారు. హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. నాయకులు పి చైతన్య, ఎం సుబ్బారావు, వి కొండలరావు, చంద్రుడు, శంకర్, ఇవి నారాయణ, సీతారాములు, ఎస్ రంగారావు, సూరయ్య, ఆర్ కృష్ణ, ఎస్ ఉదయభాస్కర్ తదితరులు ప్రసంగించారు.

నిమ్స్‌లో ఏపి నర్సింగ్ విద్యార్థుల సమస్య పరిష్కరించండి

మంత్రి ఆనంద్‌బాబుకు కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైదరాబాద్ నిమ్స్‌లో బిఎస్సీ నర్సింగ్ రాష్ట్ర విద్యార్థినుల స్కాలర్‌షిప్ సమస్యను పరిష్కరించాలని సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబుకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. విద్యార్థినులకు మొదటి సంవత్సరం స్కాలర్‌షిప్ అందలేదని, రెండు, మూడో సంవత్సరాల స్కాలర్‌షిప్ మాత్రం అందిందని తెలిపారు. ఈ నెల 14 నుంచి చివరి సంవత్సర పరీక్షలున్నాయని, మొదటి ఏడాదికి సంబంధించిన స్కాలర్‌షిప్ చెల్లించకపోతే పరీక్షలకు హాల్ టికెట్టు ఇవ్వబోమని ప్రిన్సిపల్ చెబుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పరీక్షల రాయలేక పోతామనే ఒత్తిడిలో విద్యార్థినులు ఆందోళనకు గురవుతున్నారని వివరించారు. విద్యార్థినులకు స్కాలర్‌షిప్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి స్కాలర్‌షిప్ మంజూరయ్యేలా తక్షణమే చర్యలు చేపట్టాలని సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి రావత్‌ను ఆదేశించారు.


గతంలో తమ స్థలాలను క్రమబద్దీకరించాలని చేసుకున్న దరఖాస్తు కాపీలను బాబూరావుకు చూపుతున్న విజయవాడ దేవినేని గాంధీపురం వాసులు

ఆక్రమిత స్థలాల క్రమబద్దీకరణపై మోసపూరిత ప్రకటనలు : సిపిఎం

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ)

పేదలు నివాసమంటున్న చిన్నపాటి ఆక్రమణలను క్రమబద్ధీకరిస్తామని పదేపదే చెబుతున్న ప్రభుత్వం వారిని మోసం చేసే రీతిలో వ్యవహరిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. జాగాలను క్రమబద్ధీకరిస్తామని చెప్పడం, ఆచరణలో చేయకుండా మోసం చేయడం సర్వసాధారణంగా మారిందన్నారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని దేవినేని గాంధీపురం ప్రాంతంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం తాము నివాసముంటున్న 100 గజాలలోపు స్థలాలను క్రమబద్ధీకరిస్తామని చెబితే జిఒ నంబరు 296 ప్రకారం దరఖాస్తు చేసుకున్నామని, కానీ ఏళ్లు గడుస్తున్నా నేటికీ క్రమబద్ధీకరణ జరగలేదని బాబూరావుకు వివరించారు. తాము చేసుకున్న దరఖాస్తు జిరాక్స్ కాపీలను ఆయనకు చూపారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో అభ్యంతరాలు లేని ఆక్రమణలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించినట్లు ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. 100 గజాలలోపు ఉన్న స్థలాలను క్రమబద్ధీకరిస్తామని రెండేళ్ల క్రితం జిఒ విడుదల చేస్తే ఆ మేరకు నగరంలో పలుచోట్ల వివిధ రకాల ఆక్రమణల ప్రాంతాల్లో నివాసముంటున్న కుటుంబాల వారు దరఖాస్తు చేసుకున్నారన్నారు. కానీ ఆ ప్రక్రియ సజావుగా జరగలేదన్నారు. తాజాగా మరలా మంత్రి వర్గ సమావేశం మరలా అభ్యంతరాలు లేని స్థలాలకు క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పడంలో కొత్తదనమేమీ లేదన్నారు.

సుప్రీం ఆదేశాలు ధిక్కరించడమే..

- సర్దార్ సరోవర్ డ్యామ్ గేట్లు మూసివేత నిర్ణయంపై ఏచూరి
- నిరశన దీక్ష విరమించాలని మేధాపాట్కర్‌కు విజ్ఞప్తి

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ - న్యూఢిల్లీ:
సర్దార్ సరోవర్ డ్యామ్ గేట్లు మూసివేస్తూ మధ్యప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం..సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించడమేనని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వ తీరును ఆయన ఖండిస్తూ ఈ అంశంపై కేంద్రం తక్షణం జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. సర్దార్ సరోవర్ డ్యామ్ గేట్లు మూసివేయాలంటూ నర్మదా వ్యాలీ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు నిలిపేసిందని ఏచూరి గుర్తు చేశారు. గేట్లు మూసివేయడం వల్ల డ్యామ్‌కు అవతలవున్న 192 గ్రామాలు ముంపునకు గురౌతాయని, ఆ ప్రాంతంలో నివసిస్తున్న 40 వేల మంది నిరాశ్రయులౌతారని తెలిపారు. “ఈ వివాదానికి సంబంధించి గతంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం గేట్లు మూసివేయడానికి ముందుగానే ఆ 40 వేల మందికి పునరావాసాన్ని ఏర్పాటు చేసి, పని కల్పించాలి. కానీ ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. పునరావాసాన్ని ఏర్పాటు చేయకుండానే గేట్లు మూసివేయాలని నిర్ణయించుకుంది. దీంతో ఆ గ్రామస్తులు పెద్ద ఎత్తున ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు” అని ఆ ప్రకటనలో ఏచూరి పేర్కొన్నారు. తమ కనీస హక్కు కోసం పోరాడుతున్న బాధితులకు సిపిఎం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. మరోవైపు బాధితులకు మద్దతుగా నిరశన దీక్ష చేపట్టిన మేధాపాట్కర్ ఆరోగ్యం క్షీణించడంపై ఏచూరి ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే దీక్ష ముగించాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. త్వరలోనే ఈ అంశంపై సంయుక్త కార్యాచరణను నిర్ణయించి పోరాటాన్ని కొనసాగిద్దామని పేర్కొన్నారు.

సుష్మపై సభాహక్కుల తీర్మానాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించారన్న ఆరోపణలపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్‌పై కాంగ్రెస్ శుక్రవారం సభాహక్కుల తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. రెండు అంశాలకు సంబంధించి సుష్మపై కాంగ్రెస్ ఈ తీర్మానం ప్రవేశపెట్టింది. 2015లో మోడీ పాకిస్తాన్ పర్యటన, అదే ఏడాది ఇండోనేషియాలోని బందూంగ్ సమావేశానికి సంబంధించిన అంశాల్లో సభను తప్పుదోవ పట్టించారని ప్రతిపక్ష రాజ్యసభ సభ్యులు పేర్కొన్నారు. అయితే బందూంగ్ సమావేశాలపై తాను ఎలాంటి ప్రకటనలు చేయలేదని సుష్మ స్వరాజ్ పేర్కొన్నారు. అయితే ప్రతిపక్షాలు మాత్రం అభిప్రాయ పూర్వకంగా వెలిబుచ్చిన స్పీచ్చిన ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసి ఆధారంగా రాజ్యసభకు సమర్పించారన్నారు.

మరణ ధ్రువీకరణ పత్రానికి ‘ఆధార్’

జమ్ముకాశ్మీర్, మేఘాలయ, అసోంలకు మినహాయింపు

కేంద్ర ప్రభుత్వం వెల్లడి

న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాలు, పాన్‌కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆధార్‌ను తప్పనిసరి చేసిన కేంద్ర ప్రభుత్వం తాజాగా మరణ ధ్రువీకరణ పత్రానికి కూడా ఆధార్‌ను తప్పనిసరి చేసింది. ఇకపై ధ్రువీకరణ పత్రం పొందాలంటే ఆధార్‌ను తప్పనిసరిగా జత చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శుక్రవారం వెలువరించిన ప్రకటనలో తెలిపింది. అక్టోబరు 1, 2017 నుంచి ఈ నిబంధన అమల్లోకి వస్తుందని పేర్కొంది. అయితే జమ్ముకాశ్మీర్, మేఘాలయ, అసోం రాష్ట్రాలను ప్రస్తుతానికి ఈ నిబంధన నుంచి మినహాయించినట్లు వెల్లడించింది. మరణించిన వ్యక్తి ఆధార్ సంఖ్య(ఇఐడి) మరణ ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేసిన వ్యక్తి తప్పనిసరిగా సమర్పించాలని స్పష్టం చేసింది. ఒక వేళ ఆ దరఖాస్తుదారునికి మరణించిన వ్యక్తి ఆధార్ సంఖ్య(ఇఐడి) తెలియకపోతే “నాకు తెలిసినంతవరకు ఆ వ్యక్తికి ఆధార్ కార్డు లేదు” అనే సర్టిఫికెట్‌ను సమర్పించాలి. దరఖాస్తుదారుడు ఇచ్చిన సమాచారం తప్పని రుజువైతే శిక్షకు అర్హుడని కూడా స్పష్టం చేసింది. ఇందుకోసమే దరఖాస్తుదారుడు కూడా ఆధార్ నెంబర్‌ను సమర్పించాలని ఆ ప్రకటనలో పేర్కొంది. గుర్తింపు కార్డులకు సంబంధించిన మోసాలను అరికట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వివరణ ఇచ్చింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల నమోదు బాధ్యతను రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రభుత్వాలకు అప్పగిస్తూ నోటిఫికేషన్ ఇచ్చామనీ, దీనికి వీలుగా సెప్టెంబరు 1 నాటికి సంసిద్ధం కావాలని పేర్కొంది.

కార్తీ చిదంబరంపై లుక్ అవుట్ నోటీసు

నోటీసుపై మద్రాస్ కోర్టునాశ్రయించిన కార్తీ

న్యూఢిల్లీ : మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరంపై సిబిఐ శుక్రవారం ‘లుక్ అవుట్’ నోటీసును జారీ చేసింది. కార్తీ చిదంబరం దేశం వదిలి వెళ్ళకుండా నోటీసును జారీ చేసింది. అయితే తనపై జారీ చేసిన లుక్‌అవుట్ నోటీసును రద్దు చేయాలని కోరుతూ కార్తీ చిదంబరం మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఆయన అభ్యర్థనపై కోర్టు సోమవారం విచారణ జరపనున్నది. కార్తీ చిదంబరంపై నమోదైన విదేశీ మారక ద్రవ్య నిబంధనల ఉల్లంఘనతో పాటు పలు అవినీతి ఆరోపణలపై సిబిఐ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో నిందితులు దేశాన్ని వదిలి వెళ్ళేందుకు గాని, దర్యాప్తును తప్పించుకునేందుకు గాని ప్రయత్నించే అవకాశమున్నందున వారిపై లుక్‌అవుట్ నోటీసు ఇచ్చేందుకు అనుమతివ్వాలని సిబిఐ ప్రభుత్వాన్ని కోరింది. సిబిఐ లుక్ అవుట్ నోటీసు జారీ చేయడంతో కార్తీ చిదంబరం విదేశాలు వెళ్లాలనుకున్నప్పుడల్లా సిబిఐకి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్‌కు తెలియచేయాల్సి ఉంటుంది.

బిజెపిది ద్వంద్వ వైఖరి

(మొదటి పేజీ తరువాయి)

ముందుకెళ్లి కేరళ ముఖ్యమంత్రి చేపట్టిన చర్చలు సత్ఫలితాలిస్తున్నా వాటి నిబద్ధతను ప్రశ్నిస్తున్నారనీ సిపిఎం పేర్కొంది. కేంద్ర హోంమంత్రి ఒకవైపు ఉంటే, ఆయన సహచర కేంద్ర మంత్రి, బిజెపి నాయకత్వం మరో వైఖరితో వ్యవహరిస్తున్నారని తెలిపింది. రాజకీయ ఘర్షణలకు స్వస్తి పలికి, శాంతి పునరుద్ధరణకు బిజెపి - ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధంగా లేవనేది దీనిని బట్టే స్పష్టమౌతోందని సిపిఎం విమర్శించింది. 2016 మేలో ఎన్నికల ఫలితాలు వెల్లడైన మొదటి రోజు నుంచే సిపిఎంపై బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ దాడులు చేయడం మొదలెట్టాయని ఈ సందర్భంగా సిపిఎం గుర్తు చేసింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ సొంత నియోజకవర్గంలో విజయోత్సవ ప్రదర్శనపై దాడి చేసి సిపిఎం కార్యకర్తను హత్య చేశారనీ తెలిపింది. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచీ 13 మంది సిపిఎం కార్యకర్తలను, ఇతరులను ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి గూండాలు హత్య చేశారని పేర్కొంది. 200 మంది పైగా పార్టీ సభ్యులు, సానుభూతిపరులు గాయపడి, ఆసుపత్రులపాలయ్యారని తెలిపింది. 165 ఇళ్లు, 51 పార్టీ కార్యాలయాలు, అనేక ప్రజా సంఘాల కార్యాలయాలు కూడా సంఘ్ పరివార్ దాడుల్లో ధ్వంసమయ్యాయని, కొన్నింటిని తగులబెట్టారని పేర్కొంది. సంఘ్ పరివార్ నాటకం చాలా స్పష్టంగా బోధపడుతోందనీ, సిపిఎం కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడటం ద్వారా హింసాత్మక చర్యలను ప్రేరేపించడం, ఆ తర్వాత సిపిఎం హింసకు పాల్పడుతోందనీ, కేరళ ప్రభుత్వం దాడులను అడ్డుకోవడం లేదంటూ దుష్ప్రచారం చేయడమే బిజెపి అసలు పన్నాగమని సిపిఎం పొలిట్‌బ్యూరో విశ్లేషించింది. వామపక్ష, ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన అభివృద్ధి కార్యక్రమాలన్నిటినీ అమల్జేయడంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పూర్తిగా నిమగ్నమై ముందుకుసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ హింసకు ఎవ్వరు పాల్పడుతున్నారనేది కేరళ ప్రజానీకానికి చాలా బాగా తెలుసని పేర్కొంది. రాష్ట్రంలో శాంతి, భద్రతలకు విఘాతం కల్గించే ప్రయత్నాలను విచ్ఛిన్న చేయడం ద్వారా మత సామరస్యాన్ని, సామాజిక సహృద్భావాన్ని అత్యున్నతస్థాయిల్లో కొనసాగించేందుకు కేరళ ప్రజానీకంగా సిద్ధంగా ఉంటుందని పొలిట్‌బ్యూరో విశ్వాసం వ్యక్తం చేసింది.

ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత బిజెపి - ఆర్‌ఎస్‌ఎస్ గూండాల చేతిలో హత్యకు గురైనవారి జాబితా

వరుస సంఖ్య	పేరు	జిల్లా
1.	సివి రవీంద్రన్	పినరయి, కన్నూరు
2.	సివి ధనరాజ్	కన్నూరు
3.	సుశీల్ కుమార్	త్రిసూర్
4.	టి సురేష్ కుమార్	తిరువనంతపురం
5.	మోహనన్	కన్నూరు
6.	ఆనంద్	అలప్పుజ
7.	మహ్మద్ ముహాజిన్	అలప్పుజ
8.	జి జిష్ణు	అలప్పుజ
9.	శిబు	అలప్పుజ
10.	పి మురళీధరన్	మలప్పురం
11.	రియాజ్ మౌలావీ	కాసరగోడ్
12.	ఫైజాల్	మలప్పురం
13.	సురేష్	త్రిసూర్

పీకల్లోతు అవినీతిలో ఫడ్నవీస్ సర్కారు..

ఆరోపణలు గుప్పిస్తున్న ప్రతిపక్షం

ముంబయి: మహారాష్ట్రలో దాదాపు మూడేళ్ల క్రితం అధికార పగ్గాలు చేపట్టిన దేవేంద్రఫడ్నవిస్ ప్రభుత్వం పీకల్లోతు అవినీతిలో మునిగిన తేలుతోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అయితే మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వ యంత్రాంగం కొనసాగిస్తున్న అవినీతి చర్యలతో ఫడ్నవిస్ ఏకాకిగా మారుతున్నారన్న వాదన కూడా వినిపిస్తోంది. ఈ వాదనలను పసిగట్టిన ప్రతిపక్ష కాంగ్రెస్-ఎన్‌సిపి కూటమి తమ ఆరోపణలకు నిర్దిష్టమైన ఆధారాలు సేకరించి మీడియా ముందుంచటంతో ఫడ్నవిస్ సర్కారులో రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ (ఎంఎస్‌ఆర్‌డిసి) మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సీనియర్ ఐఎఎస్ అధికారి రాధేశ్యామ్ మోపల్వార్‌ను ముఖ్యమంత్రి ఫడ్నవిస్ సస్పెండ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడైన మోపల్వార్ ముంబయి-నాగపూర్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టుకు సారథ్యం వహిస్తున్నారు. దీనితో పాటే ఫడ్నవిస్ సర్కారు అనుసరిస్తున్న విధానాల నేపథ్యంలో మరో సీరియస్ కుంభకోణం కూడా వెలుగులోకి వచ్చింది. గతంలో ఎన్నడూ లేని రీతిలో దేశ చట్టసభల చరిత్రలో తొలిసారిగా శాసనసభ ఆమోదించిన చర్యలను ప్రభుత్వం రద్దు చేసింది. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి ప్రకాశ్ మెహతా ప్రవర్తనా తీరుపై కాంగ్రెస్-ఎన్‌సిపి కూటమి సంధించిన ప్రశ్నాస్త్రాలే ఇందుకు



ప్రధాన కారణం. అనేక సందర్భాలలో ప్రతిపక్షం వాకౌట్ చేయటం మనకు తెలిసిన విషయమే. కానీ ఇప్పుడు ప్రతిపక్షం దాడిని తట్టుకోలేక అధికార పక్ష సభ్యులు వాకౌట్ చేయటం విశేషం. అయితే ఫడ్నవిస్ వ్యక్తిగత ప్రతిష్టకు ఏ మాత్రం దెబ్బతగలనప్పటికీ, ఆయన ఒకసారి కాదు రెండు సార్లు తన సన్నిహితుల కోసం ఫౌల్ గేమ్ ఆడటం ఆయన ప్రతిష్టను మసకబార్చిందని చెప్పవచ్చు. గృహనిర్మాణశాఖ మంత్రి ప్రకాశ్ మెహతా తన నిర్వాకాలపై సభలో అబద్ధాలు చెబుతూ ప్రతిపక్షానికి దొరికిపోయాడు. రెండు భారీ భూ కుంభకోణాలలో ఆయన పేరు చోటు చేసుకున్నప్పటికీ వీటితో తనకేమీ సంబంధం లేదంటూ బుకాయించే ప్రయత్నం చేశాడు. అధికారులు చెబుతున్న అభ్యంతరాలను తోసిపుచ్చటానికి మాత్రమే మెహతా తప్పులు పరిమితం కాలేదు. తాను ముఖ్యమంత్రితో మాట్లాడి ఆయన అనుమతి తీసుకున్నానంటూ సంబంధిత ఫైళ్లపై లిఖితపూర్వకంగా నోట్‌లు పెట్టి దొరికిపోయాడు. ఈ అభ్యంత రాలపై తనకు ఎటువంటి సమాచారమూ లేదంటూ ముఖ్యమంత్రి సభలో చెప్పటంతో మెహతా దీనిపై వెనుకంజ వేశారు. అయితే దీనిపై వేగంగా స్పందించిన ప్రతిపక్షం ప్రభుత్వంలోని అవినీతిని ఎండగట్టింది. తనకు తెలియకుండా చేసిన చర్యలపై మంత్రి చెప్పిన క్షమాపణను తాను ఆమోదించినట్లు చెబుతూ ముఖ్యమంత్రి ఫడ్నవిస్ ఈ వివాదాన్ని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. ఇటువంటి అవినీతి కార్యకలాపాలు, సంబంధిత వ్యక్తులకు క్లీన్ చిట్ ఇవ్వటం అత్యంత ప్రమాదకరమని కాంగ్రెస్ నేత సంజయ్ నిరుపమ్ విచారం వ్యక్తం చేస్తున్నారు. మెహతాను పదవి నుండి తొలగించాలని ప్రధాని నరేంద్రమోడీ సైతం ట్వీట్‌లో ఆదేశించినప్పటికీ ముఖ్యమంత్రి ఫడ్నవిస్ అందులో ‘నిస్సహాయుడి’గా మిగిలిపోవటం గమనార్హం. గతంలో రెవిన్యూ మంత్రి ఏకనాథ్ ఖడ్సే ప్రభుత్వ సంస్థకు చెందిన భూమి విక్రయంలో అవినీతికి పాల్పడిన ఆరోపణలతో మంత్రి పదవి నుండి వైదొలగిన విషయం తెలిసిందే.

రంజాస్ ఘర్షణల వీడియో క్లిప్పులు కల్పితం

పోలీసుల ఎటిఆర్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ : ఈ ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన రామ్‌జాస్ కళాశాలలో జరిగిన ఘర్షణలకు సంబంధించి సేకరించిన వీడియో క్లిప్పులు కల్పితమైనవని పోలీసులు తెలిపారు. కాలేజి కాంపస్‌లో, జెఎన్‌యులోనూ, ఇతర సంఘటనల్లోనూ జరిగిన విధంగానే జాతి వ్యతిరేక నినాదాలు చేసినట్లున్న సమాచారం ఆ వీడియోలో ఉన్నట్లు చెప్పబడిందని పోలీసు డిప్యూటి కమిషనర్ మధుర్ వర్మ తెలిపారు. కాగా ఒక ప్రముఖ ఆంగ్ల పత్రిక కథనం మేరకు “ గుర్తు తెలియని సామాజిక మాధ్యమాల నుంచి, మీడియా వెబ్‌సైట్‌ల నుంచి సేకరించిన ఆ వీడియో ఫుటేజ్ స్పష్టంగా లేదని, కల్పితంగా ఉందని, పోలీసులు కోర్టుకు సమర్పించిన 9 పేజీల “యాక్షన్ టేకెన్ రిపోర్ట్”లో పేర్కొన్నారు. ఈ రిపోర్టును ఢిల్లీ కోర్టుకు సమర్పించారు.

రేపు కేరళకు జైట్లీ

న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక, రక్షణ శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఆదివారం కేరళలో పర్యటించనున్నారు. కేరళలో హత్యా రాజకీయాలకు పాల్పడుతోందంటూ సిపిఎంపై సంఘ్ పరివార్ దుష్ప్రచారం సాగిస్తున్న నేపథ్యంలో జైట్లీ పర్యటిస్తుండటం గమనార్హం. సంఘ్ పరివార్ ముఠా కక్షల్లో గత శనివారం హత్యకు గురైన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త రాజేష్ ఇంటిని జైట్లీ సందర్శించనున్నారు. తిరువనంతపురంలో బిజెపి కౌన్సిలర్లతోనూ ఆయన భేటీ కానున్నారు.

‘తయారీ’ ఎందుకు తగ్గింది

ప్రశ్నించిన పార్లమెంట్ కమిటీ

న్యూఢిల్లీ : మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఎఫ్‌డిఐలలో సంస్కరణలు వంటి పలు చర్యలను రెండేళ్ళ నుంచి తీసుకుంటున్నప్పటికీ తయారీ రంగంలో వృద్ధి రేటు తక్కువగా ఉండటాన్ని కామర్స్‌పై ఏర్పడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రశ్నించింది. కమిటీకి నేతృత్వం వహిస్తున్న బిజెపి ఎంపి భూపేందర్‌యాదవ్ తయారీ రంగం వృద్ధి రేటు పడిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. 2015-2016 వరకు ఐదేళ్ళ కాలంలో తయారీ రంగం వృద్ధి రేటు సగటున 1.6 శాతం నమోదైంది. అదేవిధంగా 2017 ఆర్థిక సంవత్సరం తొలి 9 మాసాలలోనే 0.5 శాతానికి తగ్గింది. ఈ ఏడాది మార్చిలో పార్లమెంట్‌కు సమర్పించిన నివేదిక ఈ విషయానఇన వెల్లడించింది.కాగా వాణిజ్య, పారిశ్రామిక మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న పారిశ్రామిక విధానం, ప్రగతి విభాగం (డిఐపిపి) బుధవారం యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌ను పార్లమెంట్ ముందుంచింది. అందులో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు, వాణిజ్య వాతావరణాన్ని సరళీకృతం చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న పలు చర్యలను ఉటంకించింది. దేశాన్ని ఒక తయారీ, డిజైన్, ఆవిష్కరణల హబ్‌గా రూపొందించడం మేక్ ఇన్ ఇండియా లక్ష్యమని, స్థిరమైన ఆర్థిక వృద్ధి సాధించడానికి, పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఒక బలమైన పర్యావరణ వ్యవస్థను ఆవిష్కరించడం స్టార్టప్ ఇండియా లక్ష్యమని డిఐపిపి తన యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌లో పేర్కొంది.

భారత్‌ను మదుపుదారునకు అనుకూలమైన ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు ఎఫ్‌డిఐ విధానంలో తీసుకున్న వివిధ



మార్పులను కూడా రిపోర్ట్‌లో పేర్కొంది. భౌతికమైన మౌలిక సదుపాయాలను పెంపొందించడం, వాణిజ్యానికి అవసరమైన అనుమతులు పొందే ప్రక్రియను సరళీకృతం చేయడంపై దృష్టి పెట్టినట్లు తెలిపింది.

దీనిపై కమిటీ స్పందిస్తూ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రశంసించింది. అయితే వీటిని మరింత మెరుగు పరచాలని పేర్కొంది. వీటిల్లో చాలా రెండేళ్ళ క్రితం నాటి చర్యేలనని, తయారీ రంగం వృద్ధి మాత్రం అనుకున్న స్థాయికి చేరుకోలేదని పేర్కొంది. మేక్ ఇన్ ఇండియా వంటి పథకాలను అమలు చేసేందుకు మరింత ప్రభావవంతమైన చర్యలు తీసుకోవాలని కమిటీ కోరింది.

నేడు ఉపరాష్ట్రపతి పోలింగ్

- ఓట్లు లెక్కింపు..ఫలితాలు వెల్లడి
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్
- రాత్రి ఏడు లోపు ఫలితాలు వెల్లడికి అవకాశం
- విప్ జారీకి అవకాశం లేదు
- గోపాల కృష్ణ గాంధీకి 21 పార్టీలు మద్దతు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రెండో అత్యున్నత రాజ్యాంగ పదవి ఉపరాష్ట్రపతికి నేడు(శనివారం) ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల కోసం పార్లమెంట్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లను పూర్తి చేసింది. పార్లమెంట్ ఉభయసభల సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. రాజ్యసభ, లోక్‌సభ ఎంపిలతో పాటు, నామినేటెడ్ సభ్యులు కూడా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత కలిగి ఉన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతోంది. అనంతరం ఓట్లు లెక్కింపు ప్రారంభమవుతోంది. రాత్రి 7గంటల లోపే ఫలితాలు కూడా వెల్లడిస్తారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియకు రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరి జనరల్ కె. షరీఫ్ వ్యవహరిస్తారు. ఓట్ల లెక్కింపు అనంతరం నూతన ఉపరాష్ట్రపతిని కూడా ఆయనే ప్రటిస్తారు. రహస్య బ్యాలెట్ ద్వారానే ఓటింగ్ జరుగుతుంది. ఈ పోలింగ్‌లో ఎన్నికల సంఘం సూచించిన పెన్నుతో మాత్రమే ఎంపిలు ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఒకవేళ వేరే ఏరకమైన పెన్నును వాడినా ఆ ఓటును తిరస్కరిస్తారు. ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడే ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. లేనట్లయితే ఆయా ఓట్లను తిరస్కరిస్తారు. గతంలో కూడా ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వేసిన అనేక ఓట్లును తిరస్కరణకు గురయ్యాయి. అయితే ఈ ఎన్నికకు విప్ జారీ చేయడానికి రాజకీయ పార్టీలకు అవకాశం లేదు. రాజ్యసభలో 233 మంది ఎన్నికైన సభ్యులు, 12 మంది నామినేటెడ్ సభ్యులు



ఉన్నారు. లోక్‌సభలో 543 మంది ఎన్నికైన ఎంపిలు, ఇద్దరు నామినేటెడ్ సభ్యులు ఉన్నారు.

పార్లమెంట్ ఉభయ సభల్లో మొత్తం 790 మంది ఎంపిలు ఓటర్లుగా ఉంటారు. అయితే రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇది కాకుండా బిజెపి ఎంపి పాశ్వాన్‌కు ఈ ఎన్నికలో ఓటు హక్కును వినియోగించుకొనే అవకాశం లేదు. కోర్టు తీర్పు కారణంగా ఆయన ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నారు. గోవా, ఉత్తరప్రదేశ్ ముఖ్య మంత్రులు మనోహర్ పారికర్, యోగి ఆదిత్య నాథ్, ఉత్తరప్రదేశ్ ఉపముఖ్యమంత్రి మౌర్య కూడా ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వారిలో పారికర్ రాజ్యసభ సభ్యుడుగానూ, ఆదిత్య నాథ్, మౌర్యలు లోక్‌సభ ఎంపిలుగానూ కొనసాగుతున్నారు. బిఎస్‌పి అధినేత్రి మాయవతి ఇటీవలి రాజ్యసభకు రాజీనామా చేయడంతో ఆమె ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోలేక పోతున్నారు. ఎన్డీఏ నుంచి వెంకయ్య నాయుడు, ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా మహాత్మ గాంధీ మనవడు, పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్ గోపాల కృష్ణగాంధీ పోటీలో ఉన్నారు.

లోక్‌సభలో బిజెపికి 281 ఎంపిలు ఉండగా, ఎన్డీఏ పార్టీల ఎంపిలు 337 మంది ఉన్నారు. 243 మంది సభ్యులున్న రాజ్యసభలో బిజెపి సభ్యులు 56 మంది కాగా ఎన్డీఏకి 80 మంది ఉన్నారు. బిజెపి అభ్యర్థికి మద్దతు ఇచ్చే అన్నాడిఎంకె, టిఆర్‌ఎస్, వైసిపి ఎంపిలు ఉభయ సభల్లో 67 మంది ఉన్నారు. అంటే బిజెపి అభ్యర్థి 484 ఓట్లు ఉన్నాయి. 395 ఓట్లు వస్తే గెలిచినట్లే. కనుక వెంకయ్యనాయుడు గెలుపునకు సానుకూలత ఉంది. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి గోపాల కృష్ణ గాంధీకి దాదాపు 21 పార్టీలు మద్దతు తెలిపాయి. రాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థికి మద్దతిచ్చిన బిజెడి, జెడియులు కూడా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షాల అభ్యర్థికి మద్దతు ప్రకటించాయి. అయితే ఇటీవల బీహార్‌లో మహాకూటమి నుంచి బయటకొచ్చిన జెడియు బిజెపితో కలిసింది. కానీ ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో గోపాల కృష్ణ గాంధీకే మద్దతు ఉంటుందని ప్రకటించింది.

ఏపి “పెట్రో వర్శిటీ” బిల్లుకు లోక్‌సభ ఆమోదం

బిల్లుకు అన్ని పక్షాలు మద్దతు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పెట్రోలియం యూనివర్శిటీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. లోక్‌సభలో ప్రశ్నోత్తరాలు అనంతరం శుక్రవారం కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ “పెట్రోలియం యూనివర్శిటీ బిల్లు-2017”ను ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో అప్పటి ప్రభుత్వం విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఏడు జాతీయ విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలని పేర్కొంది. అందులో భాగంగానే విశాఖపట్నం పెట్రోలియం యూనివర్శిటీ బిల్లును లోక్‌సభలో చర్చకు పెట్టారు. ఈ బిల్లుకు అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. తొలుత ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ “2014 విభజన చట్టం ప్రకారం ఏపిలో పెట్రోలియం యూనివర్శిటీ ఏర్పాటు చేయాల్సి ఉంది. దానికి పార్లమెంట్ ఆమోదం తెలపాల్సి ఉంది. ఇప్పటికే తరగతులు ప్రారంభించాం. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీలో తాత్కాలిక తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఐఐటి ఖరగ్‌పూర్ తరగతులను పర్యవేక్షిస్తోంది. మొదటి బ్యాచ్ పూర్తి కాబోతుంది. ఈ సంస్థ పూర్తి స్థాయి క్యాంపస్



విశాఖపట్నంలోని సబ్బవరం వద్ద ఏర్పాటు చేయనున్నాం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 200 ఎకరాల భూమిని ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం రూ.655 కోట్లు కేటాయించింది. అందులో ఎండోమెంట్ కింద రూ.400 కోట్లు కేటాయించింది” అని పేర్కొన్నారు.

సిపిఎం సభ్యుడు పి.కె బిజూ మాట్లాడుతూ ఏపి పెట్రోలియం వర్శిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. యూనివర్సిటీకి కేటాయించిన నిధులు సరిపోవని, నిధుల కేటాయింపు పెంచాలని పేర్కొన్నారు. పెట్రోలియం స్టాండింగ్ కమిటీలో గత మూడేళ్లగా తాను కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రైవేటు పెట్రోలియం సంస్థలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇంధన అభివృద్ధికి చర్యలు లేవన్నారు.ప్రైవేటు, ప్రభుత్వ జాయింట్ వెంచర్‌కు ప్రైవేట్ కంపెనీల యజమానే ఛైర్మన్‌గా ఉంటారన్నారు. ఇది ఇంధన రంగం బలోపేతానికి విఘాతం కలిగిస్తోందని పేర్కొన్నారు.

అనంతరం కాంగ్రెస్ సభ్యులు అదిర్ రంజన్ చౌదరి, బిజెపి సభ్యులు కె. హరిబాబు ఈ బిల్లుపై మాట్లాడారు. టిడిపి సభ్యుడు ముత్తెం శెట్టి శ్రీనివాస్, వైసిపి సభ్యుడు వైవి సుబ్బా రెడ్డి, బిజెడి సభ్యులు తథాగత శతపతి, టిఆర్‌ఎస్ ఎంపి సీతారాం నాయక్, ఆర్జేడి ఎంపి జయ ప్రకాశ్ యాదవ్, జెడియు ఎంపి శైలేంద్ర తదితరులు చర్చలో పాల్గొన్నారు. టిఎంసి సభ్యుడు సౌగత్ రాయ్ మాట్లాడుతూ బిల్లుకు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు.

‘లైంగిక దాడులు’పై అఫిడవిట్ దాఖలు చేయని కేంద్రం

జరిమాన విధించిన సుప్రీం

న్యూఢిల్లీ: లైంగిక దాడుల నియంత్రణకు తీసుకున్న చర్యలు, బాధితులకు అందిస్తున్న పరిహారం వంటి అంశాలపై వివరణ ఇస్తూ అఫిడవిట్ దాఖలు చేయడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసింది. నిర్దేశిత సమయంలో అఫిడవిట్ దాఖలు చేయడంలో విఫలమైనందుకు జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ ప్రఫుల్లా సి పంత్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి రూ. 25 వేల జరిమానా విధించింది. ఆ మొత్తాన్ని రెండు వారాల్లోగా సుప్రీంకోర్టు న్యాయ సేవల కమిటీ పేరు మీద డిపాజిట్ చేయాలని శుక్రవారం చెప్పింది. నిర్భయ ఘటన అనంతరం లైంగిక దాడి బాధితులకు పరిహారం, వైద్య సహాయం అందించేందుకు వీలుగా బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ 2012లో ఢిల్లీలోని జాతీయ న్యాయ యూనివర్శిటీ విద్యార్థిని నిపుణ్ సక్సేనా పిటిషన్ వేశారు. 2013 నుంచీ ఈ పిటిషన్‌పై విచారణ జరుగుతూనే ఉంది. అయితే సహాయక కేంద్రాల ఏర్పాటుపై ఈ ఏడాది జూలై 4లోగా వివరణ ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి కూడా సమాచారాన్ని తీసుకోవాలని పేర్కొంది. కానీ ప్రభుత్వం అఫిడవిట్ సమర్పించడంలో జాప్యం చేయడంతో అత్యున్నత న్యాయస్థానం జరిమానా విధించింది.

చంద్రబాబుపై జగన్ వ్యాఖ్యలు అమానుషం

టిడిపి పార్లమెంటరీ పార్టీ ఖండన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ప్రతిపక్షనేత జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అమానుషమని టిడిపి పార్లమెంటరీ పార్టీ పేర్కొంది. పార్లమెంట్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం టిడిపి ఎంపిలు కొనకళ్ల నారాయణ, తోట నరసింహం, తోట సీతామహ లక్ష్మి, కేశినేని నాని, రాయపాటి సాంబశివరావు, శివప్రసాద్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ మేరకు జగన్ వ్యాఖ్యలను వారు ఖండించారు. అవినీతి పరుడైన జగన్, చంద్రబాబుపై వ్యాఖ్యలు చేయడం సరికాదని విమర్శించారు.

అనంతనాగ్‌లోఎదురుకాల్పులు

ఉగ్రవాదితో పాటు స్థానికుడు హతం

శ్రీనగర్: జమ్ముకాశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదులకీ, సైనికులకీ మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో హిజ్బుల్ ముజాహుద్దీన్ సంస్థకు చెందిన ఒక ఉగ్రవాదితో పాటు స్థానిక వ్యక్తి ఒకరు మరణించినట్లు భద్రతాధికారులు శుక్రవారం తెలిపారు. ఉగ్రవాదులున్నారనే సమాచారం మేరకు అనంత్‌నాగ్ జిల్లా కనిబాల్ ప్రాంతంలో గురువారం రాత్రి పోలీసులతో కలిసి సిఆర్‌పిఎఫ్ జవాన్లు గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులకీ , భద్రతా దళాలకీ మధ్య సుమారు రెండు గంటలపాటు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో యవార్ అనే ఉగ్రవాది మరణించగా మరో ఇద్దరు తప్పించుకున్నారు. అటువైపుగా మోటారు సైకిల్‌పై వస్తున్న మరో వ్యక్తి కూడా బుల్లెట్ గాయాలతో మరణించినట్లు అధికారులు వెల్లడించారు. అయితే ఆ వ్యక్తి సమాచారం ఇంకా తెలియరాలేదు. అనంత్ నాగ్‌కు చెందిన యవార్ ఇటీవలే హిజ్బుల్ ముజాహుద్దీన్‌లో చేరినట్లు అధికారులు తెలిపారు.

‘భారత్ మాతాకి జై’’అని నినదించాలన్న న్యాయవాది

కోర్టు టివి స్టూడియో కాదు : న్యాయమూర్తి

న్యూఢిల్లీ : “భారత్ మాతాకి జై” అంటూ నినాదం చేసి తన దేశ భక్తిని నిరూపించుకోవాలని ఒక కేసు విచారణ సందర్భంగా జమ్ము కాశ్మీర్‌కు చెందిన వేర్పాటువాదిని పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడిగి, న్యాయమూర్తితో చివాట్లు తిన్న సంఘటన ఢిల్లీ కోర్టులో జరిగింది. జమ్ము కాశ్మీర్‌కు చెందిన వేర్పాటు వాది షబీర్ షాను గత నెలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరట్ అరెస్టు చేసింది. విచారణ సమయంలో షబీర్ షా తమకు సహకరించడంలేదని కూడా ఇడి ఆరోపించింది. షబీర్ షా కోట్లాది రూపాయల విలువైన ఆస్తులను కొనుగోలు చేశాడని, ఆ సొమ్ము అతనికి ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకోవాలనుకుంటున్నామని కేసు విచారణ సందర్భంగా ఇడి తరుపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఇడి తరుపు న్యాయవాది వాదనలతో షబీర్ షా తరుపు న్యాయవాది విభేదించారు. షబీర్ షా కస్టడీలో ఉన్న సమయంలో వివిధ ప్రకటనలు ఇవ్వాలంటూ పోలీసులు ఒత్తిడి తెచ్చారని ఆయన ఆరోపించారు. దీంతో ఇడి తరుపు న్యాయవాది అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఉగ్రవాదులకు నిధులు సమకూర్చడం ద్వారా షా దేశాన్ని నాశనం చేస్తున్నారని, తన దేశ భక్తిని నిరూపించుకోవాలంటే ‘భారత్ మాతాకి జై’ అంటూ నినాదం చేయాలని కోర్టులో కోరారు. దీంతో న్యాయమూర్తి సిద్ధార్థ శర్మ ఆగ్రహిస్తూ తాను టెలివిజన్ స్టూడియోలో లేనని పేర్కొన్నారు.

గో గూండాల దాడులు నివారించండి

మోడీకి లాలు విజ్ఞప్తి

పాట్నా: గోడ్డు మాంసం తరలిస్తున్నారన్న ఆరోపణలపై బీహార్ బోజ్‌పూర్ జిల్లాలో ముగ్గురు వ్యక్తులపై గో గూండాలు దాడిచేయడంపై శుక్రవారం ఆర్‌జెడి నేత లాలు ప్రసాద్ యాదవ్ స్పందించారు. ‘గో సంరక్షణ పేరుతో సామాన్యులపై దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ఎంత కఠినంగా చర్యలు తీసుకున్నారో చూడండి’ అంటూ వ్యాఖ్యానించారు. బిజెపి మద్దతుతో జెడి(యు) అధికారంలోకి వచ్చి వారం రోజులు కూడా కాలేదనీ ఆర్‌జెడి నుంచి జనతాదళ్ (యునైటెడ్) విడిపోయిన తర్వాత గోగూండాలు చేసిన తొలి దాడిగా పేర్కొన్నారు.

ముగ్గురు భారత సంతతి అమెరికన్లకు కీలక పదవులు

వాషింగ్టన్: అమెరికాలోని ట్రంప్ సర్కారు కీలకమైన మూడు ప్రభుత్వ పదవులకు ముగ్గురు భారతీయ అమెరికన్లను నియమించింది. ఈ నియామకాలను సెనేట్ గురువారం ఏకగ్రీవంగా ఆమోదించటం విశేషం. ఇందులో ఒకటి భారత్-అమెరికాల మధ్య తీవ్ర విభేదాలకు దారి తీసిన మేథోసంపత్తి హక్కుల రంగం కావటం విశేషం. నీల్ ఛటర్జీని ఫెడరల్ ఎనర్జీ రెగ్యులేటరీ కమిషన్ సభ్యుడిగానూ, విశాల్ అమీన్‌ను మేథోహక్కుల సంపత్తి అమలు సంస్థ సమన్వయకర్తగాను, కృష్ణ ఆర్స్‌ను పెరూలో అమెరికా రాయబారిగానూ నియమిస్తూ అధ్యక్షు డు ట్రంప్ జారీ చేసిన ఆదేశాలను సెనేట్ ఏక గ్రీవంగా ఆమోదించింది. ఐరాసలో అమెరికా దౌత్యవేత్త హోదా పొందిన నిక్కీ హేలీ తరువాత ఆస్థాయి హోదా పొందిన రెండో భారతీయ అమెరికన్ కృష్ణ అర్స్.

పాక్‌లో కొలువు తీరిన కొత్త కేబినెట్

ఆర్థిక మంత్రి పదవి యధాతథం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ కొత్త ప్రధాని షాహిద్ ఖాకన్ అబ్బాసీ తన మంత్రివర్గాన్ని ప్రకటించారు. గతంలో నవాజ్‌షరీఫ్ మంత్రివర్గాన్ని ఆయన కొంత మేర పునర్వ్యవస్థీకరించి కొత్త మంత్రివర్గాన్ని రూపొందించారు. షరీఫ్ కేబినెట్‌లోని అనేక మంది పదవులు యధాతథంగానే వున్నాయని మీడియా తన కథనాలలో వెల్లడించింది. గతంలో ఆర్థిక మంత్రిగా వ్యవహరించిన ఇషాక్‌ధర్ కొత్త మంత్రివర్గంలో సైతం అదే బాధ్యతల్లో కొనసాగుతున్నారు. గతంలో రక్షణ, జలవనరులు, విద్యుత్ మంత్రిత్వశాఖలను నిర్వహించిన ఆసిఫ్ క్వాజాకు విదేశీ వ్యవహారాలను అప్పగించారు. గతంలో ప్రణాళికా సంఘం వ్యవహారాలను పర్యవేక్షించిన అహసన్ ఇక్బాల్ కొత్త హోం మంత్రిగా నియమితులయ్యారు. గతంలో పెట్రోలియం మంత్రిత్వశాఖను నిర్వహించిన అబ్బాసీ ఇప్పుడు విద్యుత్, పెట్రోలియం శాఖలను విలీనం చేసిన కొత్త శాఖ బాధ్యతలను నిర్వర్తించనున్నారు.

అమెరికాతో కొనసాగుతున్న ఉద్రిక్తతలు...

మాస్కో: తాజా ఆంక్షల నేపథ్యంలో అమెరికాతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో చైనాతో స్నేహసంబంధాలు బలపర్చుకునేందుకు రష్యాకు మంచి అవకాశం లభించిందని పరిశీలకులు చెబుతున్నారు. రష్యాపై అమెరికా తాజాగా ఆంక్షలు విధించటంతో ఆగ్రహించిన రష్యా దౌత్య సంబంధాలపై ఆంక్షలు విధించింది. తమ దేశంలోని దౌత్య సిబ్బందిని వెంటనే స్వదేశానికి తీసుకుపోవాలన్న పుతిన్ ఆదేశాలతో అమెరికా మాస్కోలోని తమ దౌత్య కార్యాలయ ఫర్నిచర్, ఇతర పరికరాలను తరలించటం ప్రారంభించినట్లు మీడియా కథనాలు చెబుతున్నాయి. అమెరికా ఆంక్షలతో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు రష్యాకు తగిన సహాయం అందించే విషయాన్ని చైనా పరిశీలిస్తోందని దౌత్య వర్గాలను ఉటంకిస్తూ మీడియా తన కథనాలలో వివరించింది. ఇందుకు సంబంధించి గతంలో రష్యాతో కుదుర్చుకున్న ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం (బిట్)పై చర్చలుజరపటం చైనాకు అందుబాటులో వున్న అవకాశమని, ఇది రష్యాకు అవసరమైన సాయం అందించటంతో పాటు ఇరుదేశాల మధ్య సహకారానికి వాస్తవ రూపం కల్పిస్తుందని దౌత్యవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు అత్యున్నత స్థాయిలో కొనసాగుతున్న ప్రస్తుత సమయం ద్వైపాక్షిక చర్చలకు అత్యంత అనువైనదని, ఇరుదేశాల మధ్య

చైనాతో దోస్తీకి రష్యాకు మంచి అవకాశం అంటున్న పరిశీలకులు



సంబంధాల విస్తరణకు అమెరికా ఆంక్షలు ఉత్ప్రేరకంగలా పనిచేస్తాయని ఈ వర్గాలు చెబుతున్నాయి. రష్యాలో ప్రత్యేక చట్టపరమైన హోదా కలిగిన ఆర్థిక మండళ్లపై చైనా సంస్థలు దృష్టి సారిస్తున్నాయి. విస్తృత స్థాయి సహకార అవకాశాలున్న 'ఐస్ సిల్క్ రోడ్ ప్రాజెక్టు' ఇరుదేశాలూ చేతులు కలిపితే రష్యాలో మౌలిక వసతుల రంగంలో చైనా తన పెట్టుబడులను పెంచే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీనికి తోడు పశ్చిమ దేశాల ఆంక్షల నేపథ్యంలో దిగుమతులపై ఆధారపడుతున్న రష్యా ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది. ముఖ్యంగా దిగుమతు లను తగ్గించుకుని దేశీయంగా, స్థానికంగా ఉత్పాదకతను పెంచటం ద్వారా స్థానిక ప్రజల డిమాండ్‌ను తీర్చాలని భావిస్తోంది. ఈ పరిస్థితుల్లో రష్యా ప్రభుత్వం ఆమోదించిన దిగుమతుల ప్రత్యామ్నాయ విధానం చైనా పెట్టుబడులకు డిమాండ్ సృష్టించే అవకాశం కన్పిస్తోంది. ఇరుదేశాల మధ్య ఆర్థిక సహకారం అన్నది ప్రభుత్వ ఆకాంక్షల కన్నా వ్యాపార ఒప్పందాలతోనే సుసాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే రష్యాలో కొనసాగుతున్న విధానపరమైన అనిశ్చితితో చైనా కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు తటపటాయిస్తున్నాయి.

విద్యుత్ కొనుగోలుపై మయన్మార్, చైనా చర్చలు

యాంగాన్: తీవ్ర విద్యుత్ కొరతతో ఇబ్బంది పడుతున్న మయన్మార్, చైనా నుండి విద్యుత్ కొనుగోలు చేసే అంశంపై చర్చలు ప్రారంభించిందని అధికారులు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో చైనాతో గాడి తప్పిన సంబంధాలను గత ఏడాది ఏప్రిల్‌లో అధికార పగ్గాలు చేపట్టిన తరువాత మయన్మార్ అధినేత ఆంగ్‌సాంగ్ సూకీ తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో అధికారంలో వున్న సైనిక ప్రభుత్వం 2011లో చైనా సాయంతో నిర్మించిన ఒక డ్యామ్‌ను అడ్డుకోవటంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు గాడితప్పిన విషయం తెలిసిందే. మయన్మార్ నేషనల్ పవర్ గ్రిడ్‌ను తమ దేవంలోని యున్నాన్ విద్యుత్ నెట్‌వర్క్‌కు అనుసంధానించేందుకు చైనాకు చెందిన మూడు కంపెనీలు విభిన్న ప్రణాళికలతో ముందుకొచ్చాయి. తమ సరిహద్దును ఆనుకుని వున్న మయన్మార్ మారుమూల ప్రాంతాలకు చైనా ప్రస్తుతం విద్యుత్ సరఫరా చేస్తోంది. ఈ సమయంలో మయన్మార్‌లో విద్యుత్ కొరతను ఎదుర్కొనేందుకు ఇరుదేశాల విద్యుత్ గ్రిడ్‌లను అనుసంధానించే ప్రక్రియపై చర్చలు జరపటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ప్రపంచీకరణపై స్పందనకు చైనా ఆదర్శం పోప్ ప్రశంసలు

బీజింగ్: ప్రస్తుతం కొనసాగుతున్న ప్రపంచీకరణ ప్రక్రియపై అవసరమైన స్పందనకు చైనా ఆదర్శంగా నిలుస్తోందని పోప్ ఫ్రాన్సిస్ ప్రశంసలు కురిపించారు. వాటికన్ పొంటిఫిషియల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఛాన్సలర్ మార్సెలినో శాంచెజ్ సొరాండో ఒక ప్రకటనలో ఈ విషయం వెల్లడించారు. అవయవదానం, మార్పిడిపై జరుగుతున్న ఒక సదస్సుకు హాజరయ్యేందు కు చైనాకు వచ్చిన ఆయన గురువారం ఇక్కడ మీడియా తో మాట్లాడుతూ పోప్ ఫ్రాన్సిస్‌కు చైనా అన్నా, చైనా ప్రజలన్నా అమితమైన ప్రేమ అని, చైనాకు గొప్ప భవిష్యత్ వుందని తాము భావిస్తున్నామని వివరించారు.

నెతన్యాహుపై అవినీతి ఆరోపణలు

- దర్యాప్తునకు ఇజ్రాయిల్ కోర్టు ఆదేశాలు
- సమస్యలు తప్పవంటున్న న్యాయనిపుణులు



జెరూసలేం: ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూపై వెలుగు చూసిన అవినీతి ఆరోపణలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపించాలని ఇజ్రాయిలీ కోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ కేసు దర్యాప్తుపై మీడియా కవరేజ్‌ను నియంత్రించాలని, నెతన్యాహు పేరును బయటకు పొక్కనీయరాదని కోర్టు తన ఆదేశాలలో పేర్కొంది. ఈ కేసులో నిందితుడిగా వున్న మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ యారీ హారో ప్రభుత్వ సాక్షిగా మారితే ప్రధాని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వుంటుందని న్యాయనిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇదిలా వుండగా తానెటువంటి తప్పూ చేయలేదని నెతన్యాహు గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అధికార మార్పిడి లక్ష్యంతో కొనసాగుతున్న ఈ క్షుద్రవేట ఇప్పుడు పతాకస్థాయికి చేరిందని నెతన్యాహు ప్రతినిధి విమర్శించారు. అంతిమంగా ఈ కుట్ర విఫలమవటం ఖాయమని, ఎటువంటి తప్పూ లేని కేసులో దర్యాప్తు చేపట్టితే ఒరిగేదేమీ వుండదని ఆయన వ్యాఖ్యానించారు. నెతన్యాహు, ఆయన కుటుంబ సభ్యులకు కొందరు వ్యాపార వేత్తలు ఇచ్చిన బహుమతులపై ఒక కేసులో పోలీసులు ఆరాతీయగా మరో కేసులో ఇజ్రాయిలీ ప్రచురణకర్తతో జరిగిన సంభాషణలపై నెతన్యాహును పోలీసులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ రెండు కేసుల్లో లంచాలివ్వటం, మోసం, విశ్వాస ఘాతుకం వంటి అంశాలు ఇమిడి వున్నాయన్న అనుమానంతో రిషాన్ లెజియాన్ మేజిస్ట్రేట్ కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. యారీ హారో, ఆయన తరపు న్యాయవాదితో జరిగిన చర్చల వివరాలను బహిర్గతం చేయరాదని కోర్టు తన ఆదేశాలలో పేర్కొంది. 2008లో నెతన్యాహు ప్రతిపక్ష నేతగా వున్న సమయంలో హారో ఆయన వద్ద రెండేళ్ల పాటు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తరువాత 2014లో నెతన్యాహు ప్రధాని పదవి చేపట్టిన తరువాత ఆయన సిబ్బంది వ్యవహారాల అధిపతిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ఏడాది కాలంలోనే అవినీతి ఆరోపణలు వెల్లువెత్తటంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు.

ఈక్వెడార్ ఉపాధ్యక్షుడి అధికారాలకు కత్తెర



క్విటో: ఈక్వెడార్ అధ్యక్షుడు లెనిన్ మొరెనో తమ దేశ ఉపాధ్యక్షుడు జార్జ్ గ్లాస్‌కి వున్న అధికారాలను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. తన ప్రభుత్వంపై విమ ర్శలు గుప్పించిన ఉపాధ్యక్షుడిపై ఆగ్రహించిన అధ్యక్షుడు మొరేనో ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఆయన్ను పదవి నుండి తప్పించకపోవటం విశేషం. 2013 నుండి ఈక్వెడార్ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న గ్లాస్‌పై ఇటీవల వెల్లువెత్తిన అవినీతి ఆరోపణలు ఈ ప్రాంతంలో సంచలనం సృష్టించాయి. ఈ నేపథ్యంలో గ్లాస్ అధ్యక్షుడిపై విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ మీడియా నియం త్రణు ప్రైవేటు మీడియా ప్రతినిధుల చేతుల్లో పెట్టారని, ఆర్థిక వ్యవస్థపై అధ్యక్షు డికి సరైన అవగాహన లేదని ఆయన విమర్శించారు. దీనితో ఉపాధ్యక్షుడి అధికారాలను తొలగిస్తూ అధ్యక్షుడు మొరేనో ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

పాలస్తీనాకు ఆర్థిక సహాయంలో కోత

బిల్లుకు అమెరికన్ సెనేట్ కమిటీ ఆమోదముద్ర



వాషింగ్టన్: పాలస్తీనా అభివృద్ధి కోసం అందించే వార్షిక సాయంలో దాదాపు 30 కోట్ల డాలర్ల మేర కోత పెట్టే బిల్లుకు అమెరికన్ సెనేట్ కమిటీ గురువారం ఆమోదముద్ర వేసింది. తాము అందిస్తున్న ఈ సాయం యుద్ధ నేరాలకు రివార్డు తరహాలో వుందని సెనేట్ కమిటీ వ్యాఖ్యానించింది. పాలస్తీనాకు ఆర్థిక సహాయం అందించే టేలర్‌ఫోర్స్ చట్ట సవరణ బిల్లుకు సెనేట్ విదేశీ సంబంధాల కమిటీ 17-4 ఓట్ల తేడాతో ఆమోదం తెలిపింది. గత ఏడాది అమెరికన్ మాజీ సైనికాధికారి ఒకరు ఇజ్రాయిల్ సందర్శిస్తున్న సమయంలో కత్తిపోట్లకు గురై మరణించిన నేపథ్యంలో అమెరికన్ సెనేట్ ఈ బిల్లును ఆమోదించటం గమనార్హం. ఈ బిల్లు చట్ట రూపం ధరించటానికి పూర్తి సెనేట్‌తో పాటు ప్రతినిధుల సభ కూడా ఆమోదించాల్సి వుంటుంది. ఈ బిల్లు చట్టంగా మారితే పాలస్తీనా అథారిటీ పాలస్తీనా మృతుల కుటుంబాలకు చెల్లిస్తున్న నెలసరి పరిహారం నిలిచిపోతుంది. మరణించిన మాజీ సైనికాధికారిపై దాడి చేసిన పాలస్తీనా పౌరుడ్ని ఇజ్రాయిల్ పోలీసులు కాల్చిచంపారు. అయితే అతడి కుటుంబానికి మాత్రం ఇప్పటి వరకూ 3,500 డాలర్ల నెలసరి చెల్లింపు కొనసాగుతూనేవుంది. ఇతర దేశాలపై కూడా ఇటువంటి చర్యలను తీసుకునేందుకు అంతర్జాతీయంగా కృషి చేయాలంటూ కమిటీలోని 16 మంది రిపబ్లికన్, డెమొక్రాట్ సభ్యులు ఐరాసలో అమెరికా రాయబారి నిక్కీ హేలీకి లేఖ రాశారు. అయితే తమకు ఈ సాయాన్ని కొనసాగించాలని అమెరికాను కోరనున్నట్లు పాలస్తీనా అధికారులుచెప్పారు. ఇజ్రాయిల్ ఆక్రమణకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన, జైలుపాలయిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు ఇది అవసరమని వారంటున్నారు.

మొదటి పేజీ తరువాయి

20 మంది వద్దే సంపద

ఆయన పెట్టుబడులు ఉన్న ఇతర సంస్థల వ్యాపారాలు భారీగా పెరిగాయి. ఐసిఐసిఐ ప్రూ లైఫ్ ఇన్సూరెన్స్ (4% వాటా), ఎన్‌సిసి (2.47%), జూబిలియంట్ ఫుడ్ వర్క్స్ (2.32%), స్కిండ్లర్ ఎలక్ట్రిక్ (2.01%), క్రాంప్టన్ కన్జూమర్ ఎలక్ట్రికల్స్ (1.53%), జెఎం ఫైనాన్షియల్ (2.40%) సంస్థలందు ప్రేమ్‌జీ వాటాలను కలిగి ఉన్నారు. ఈ సంస్థల వల్ల ఆయన సంపద దాదాపు 25,280 కోట్ల మేర పెరిగి రూ.10,64,44 కోట్లకు ఎగిసింది. మరోవైపు ఈ ఏడాది మార్చిలో లిస్టింగ్‌కు వచ్చిన డి-మార్ట్ సూపర్ మార్ట్స్ మాతృసంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ స్టాక్ మార్కెట్లో 205 శాతం మేర పెరిగింది. దీంతో ఆ సంస్థ అధినేత రాధాకృష్ణ దామనీ సంపద రూ.23,018 కోట్ల మేర పెరిగి రూ.35,658 కోట్లకు చేరింది. కోటక్ మహీంద్రా బ్యాంకు అధినేత ఉదయ్ కోటక్ సంపద రూ.21,421 కోట్ల డాలర్ల మేర పెరిగి రూ.68,523 కోట్లకు పెరిగింది.

ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన కుమార మంగళం బిర్లా సంపద ఈ ఏడాది మొదటి ఏడు మాసాల్లో దాదాపు రూ.20,823 కోట్ల మేర పెరిగి రూ.60,280 కోట్లకు చేరింది. జైడస్ క్యాడిలా సంస్థ అధినేత పంకజ్ పటేల్, ఐషర్ మోటార్స్ విక్రమ్ లాల్, యార్సలార్ మిట్టల్ సంస్థ అధినేత లక్ష్మి మిట్టల్, డీఎల్‌ఎఫ్ సంస్థ కె.పి.సింగ్, పిరమల్ గ్రూపు అధినేత అజయ్ పిరమల్, షాపూర్‌జీ ఫలోంజీ గ్రూపు వ్యవస్థాపకులు ఫలోంజీ మిస్త్రీలు దాదాపు రూ.13,305 కోట్ల మేర సంపదను పెంచుకున్నారు.

రాజేంద్రసింగ్‌పై దౌర్జన్యం

వెళ్ళే ప్రయత్నం చేశారు. కురగల్లు గ్రామం వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు వెళ్ళడానికి వీల్లేదంటూ వాహనాలకు అడ్డుగా నిలిచారు. బృందం సభ్యులపై దాడికి యత్నించారు. తుళ్ళూరు మండలం పెదపరిమి - నీరుకొండ మధ్య పెద్దసంఖ్యలో వచ్చిన టిడిపి నాయకులు కమిటీ కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. వాహనాలకు ఉన్న ఫ్లెక్సీలను చించివేశారు. దీంతో మళ్లీ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకొని బృంద సభ్యులను తుళ్ళూరుకు తీసుకొచ్చారు. స్థానిక సాయిబాబా మందిరంలో బృందం సభ్యులు, టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. తాము రాజధాని నిర్మాణానికి ఇష్టపూర్వకంగా భూములిచ్చామని, ఎవరి బలవంతం లేదని టిడిపి నాయకులు చెప్పారు. రామన్ మెగసెసే అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్ మాట్లాడుతూ కృష్ణానదీతీర ప్రాంత పరిరక్షణను విస్మరిస్తే జీవన మనుగడకే ప్రమాదం వాటిల్లుతుందని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రజాస్వామ్యయుతంగా జరుగుతున్న యాత్రను అడ్డుకోవడం బాధాకరమన్నారు. అనంతరం బృందం సభ్యులు రాయపూడి, లింగాయపాలెంలో పర్యటించాల్సి ఉన్నప్పటికీ పోలీసులు అమరావతి పంపివేశారు.

నియంతృత్వ పోకడలు తగవు : సిపిఎం

టిడిపి నియంతృత్వ పోకడలను సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. వివిధ రంగాల్లో నిపుణులుగా ఉన్న బృందసభ్యులు రాజధాని ప్రాంతంలో వాస్తవ పరిస్థితిని అధ్యయనం చేసేందుకు వస్తే వారిని అడ్డుకోవడం సరైనది కాదని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి ఖండించారు.

ఇఎస్ఐ డిస్పెన్సరీలను పెంచుతాం

కార్మిక శాఖ మంత్రి పితాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇఎస్ఐ డిస్పెన్సరీల పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి పితాని సత్యనారాయణ తెలిపారు. ఇందుకు ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని, లేకుంటే ఆయా జిల్లాల కలెక్టర్లతో చర్చించి స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. ఇఎస్ఐ అధికారులతో మంత్రి శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 78 ఇఎస్ఐ డిస్పెన్సరీలున్నాయని, వీటిలో 66 అద్దె భవనాల్లో, 12 ప్రభుత్వ భవనాల్లోను ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరంలలోని ఇఎస్ఐ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, సదుపాయాల గురించి మంత్రి అధికారులతో చర్చించారు. విశాఖపట్నంలోని ఆసుపత్రి భవనం పూర్తిగా పాతదైనందున కొత్త భవన నిర్మాణానికి ఉన్న అవకాశాలు పరిశీలించాలని, లేకుంటే అద్దె భవనంలోకి మార్చాలని సూచించారు. ఇఎస్ఐ ఆసుపత్రుల్లో, డయాగ్నోస్టిక్ సెంటర్లలో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి మండలంలోను ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని, రాష్ట్రంలో ఉన్న మొత్తం ఇఎస్ఐ ఆసుపత్రులను మండలాల వారీగా మ్యాపింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, ఇఎస్ఐ డైరెక్టర్ సి.కె రమేష్‌కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

2018 టార్గెట్

సకల సదుపాయాలూ కల్పిస్తాం. దీనికోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ తడి, పొడి చెత్త పద్ధతులు పెట్టి వర్మీ కంపోస్టు తయారు చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వ నందీ బ్రాండు ద్వారా అమ్మించడం ద్వారా ఆదాయం పొందే విధంగా ప్లాను రూపొందిస్తున్నాం. ఎల్‌ఈడి లైట్లలోనూ ఇబ్బందులు లేకుండా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఈఈఎస్ఎల్ లైట్లనే వాడుతున్నాం.

ప్ర : గత మూడేళ్లలో అభివృద్ధికోసం ఏం చేశారు?

జ: : మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా వరుస క్రమంలో పనులు చేసుకుపోతున్నాం. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు వేశాం. ఎల్‌ఈడి లైట్లు ఏర్పాటు చేశాం. గ్రామీణ యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నాం. అయినా లోపాలు ఉన్నాయి. అయినంత మాత్రాన వెనక్కు తగ్గేది లేదు. నిధుల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉపాధి హామీ నిధులు వాడుకుంటున్నాం. దేశంలో ఎక్కువ నిధులు వాడుకున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. మాతోపాటు త్రిపుర కూడా ఎక్కువగా వాడుకుంది. ఈ విషయంలో ఆ రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలను అభినందించాల్సిందే. అయితే అది చాలా చిన్న రాష్ట్రం.

ప్ర : పరిపాలనా వ్యవహారాల్లో మీ జోక్యం పెరుగుతోందనే విమర్శలున్నాయి ?

జ: : రాష్ట్ర పరిపాలనా వ్యవహారాల్లో నా జోక్యం లేదు. ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు. అన్ని వ్యవహారాలూ సిఎం చూసుకుంటారు. ఆయన ఒక విజన్‌తో పనిచేస్తున్నారు. ఆయన స్పీడును మంత్రులు అందుకోలేకపోతున్నారు. అటువంటి సమయాల్లో వారికి తగు సూచనలు చేస్తున్నాను. సాంకేతికంగా సహకరిస్తున్నాను. పార్టీ ప్రధాన కార్యదర్శిగా సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో అందరితోనూ మాట్లాడుతున్నాను. మంత్రిగా మాత్రం కాదు.

ప్ర: ఇటీవల కాలంలో ఎక్కువ అవినీతి ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి ?

జ: ఎక్కడ అవినీతి జరిగినా విచారణకు మేం సిద్ధం. ప్రతిపక్షాలు ప్రతి చిన్న దాన్నీ రాద్ధాంతం చేస్తున్నాయి. పని చేయకపోతే చేయలేదని అంటున్నారు. చేస్తే అందులో అవినీతి జరిగిందని చెబుతున్నారు. ఇదేం పద్ధతో అర్థం కావడం లేదు. రాజధానిలోనూ అడ్డుపడ్డారు. చేసే ప్రతిపనికీ అడ్డుతగలడమే పనిగా పెట్టుకున్నారు. ఎక్కడైనా అవినీతి జరుగుతోందని మా దృష్టికి తీసుకొస్తే విచారణ జరపడానికి సిద్ధంగా ఉన్నాం.

ప్ర: బిజెపితో చెడుతోందనే వార్తలు వస్తున్నాయి ?

జ: అటువంటి ఆలోచన కూడా మాకు లేదు. ప్రతిపక్షం వెళ్లి కలిసినంత మాత్రాన బిజెపి టిడిపికి దూరమవుతోందని అనుకోవాల్సిన అవసరం లేదు. అదే సమయంలో కట్టుబట్టలతో వచ్చిన మనకు కేంద్రంలో ఉన్న బిజెపి సహకరించాల్సి ఉంది. సహకరించనప్పుడు ఎవరైతే ఏంటి ? ప్రశ్నిస్తాం ? దీనిలో వెనుకాడేది లేదు. 2019 ఎన్నికల్లో అప్పుడు పరిస్థితిని బట్టి ముందుకెళతాం. అప్పటికి పవన్‌కళ్యాణ్ కూడా మాతో కలిసి వస్తాడని అనుకుంటున్నాం. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన గమనిస్తున్నాడు. కలిసొస్తాడని నమ్మకం ఉంది.

ప్ర : పార్టీ మారిన ఎమ్మెల్యేలతో ఎందుకు రాజీనామా చేయించలేదు ?

జ : వారు తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలోకి వచ్చారు. అటువంటి వారిని మేమెందుకు రాజీనామా చేయాలని చెప్పాలి. వచ్చిన వారిలో సామర్థ్యం ఉన్నవారిని మంత్రులుగా నియమించాం. వారి అనుభవాన్ని వాడుకుంటాం. అంతేగానీ రాజీనామా చేయించాల్సిన అవసరం లేదు. శిల్పా చక్రపాణిరెడ్డి ఏం లాభం చూసుకుని రాజీనామా చేశారో తెలియదు. ఆది జగన్‌కే తెలియాలి.

ప్ర: నంధ్యాలపై ఉప ఎన్నికల్లో ఏం జరగనుంది?

జ: ఖచ్చితంగా గెలుస్తాం. మెజార్టీ మీదే దృష్టి సారిస్తున్నామని వివరించారు. అక్కడ 28 వేలమందికి పింఛన్లు ఇస్తున్నాం. అభివృద్ధి పనులు చేస్తున్నాం. జగన్ తన ప్రచార సభలో ప్రభుత్వం చేస్తున్న పథకాలన్నీ వల్లెవేశాడు. వాటిల్లో అవినీతి ఉంచెప్పాడు. విమర్శల పేరుతో ప్రభుత్వం చేస్తున్న పథకాలన్నీ ప్రజలకు వివరించాడు. అంతకంటే తెలుగుదేశం ప్రభుత్వానికి కావాల్సింది ఏమిటి.

ప్ర : ఉపాధి హామీ నిధుల్లో అక్రమాలు జరుగుతున్నాయనే విమర్శలున్నాయి

జ:: పనులు ఎక్కువ జరుగుతున్న సమయంలో సమస్యలు వచ్చాయి. ఎక్కడా లోపాలు లేవు. అయితే లోపాలున్నాయని వైసిపి ఎంపిలు సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి కేంద్రానికి ఫిర్యాదులు చేశారు. అందువల్ల నిధులు ఆపేశారు. రూ.500 కోట్లు రావాల్సి ఉంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని వాటిని తెప్పించే విధంగా చూస్తాం.

ప్ర: స్థానిక సంస్థల హక్కులను చేతుల్లో తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి ?

జ: వాస్తవం లేదు. పన్నుల నిర్ధారణ కోసమే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. అది ఎక్కడ ఎంతపన్ను ఉండాలి, ఎవరికి ఎంత విధించాలని మాత్రమే సూచిస్తుంది. దాని వసూళ్ల నిర్వహణంతా స్థానిక సంస్థలే చూసుకుంటాయి.

గ్రామాల్లో జరిగే పనులన్నీ ఆన్‌లైన్ చేస్తున్నాం. దీనివల్ల ఇబ్బందులు చాలా వరకూ తగ్గుతాయి. వసూళ్ల బాధ్యత వారికే ఇచ్చేటప్పుడు సమస్యలు ఉత్పన్నం అవుతాయని నేను భావించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో బిపిఎల్ కుటుంబాలకు ఇంటిపన్ను రద్దు చేస్తాం.

ప్ర : గిరిజనుల మరణాల సమయంలో చాపరాయి వెళ్లకపోవడానికి కారణం ?

జ: అక్కడకు వెళ్లి ఉండాల్సింది. సరైన సమాచారం లేక వెళ్లలేకపోయాం. వెళ్లకపోవడం లోపమే. మంత్రులు నిరంతరం పరిశీలనలో ఉన్నారు. గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా నేను వెళ్లి ఉండాల్సింది. ఈ విషయంలో సీనియర్లు కూడా ఎవరూ తగు సూచనలు చేయలేదు.

ప్ర : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమిటి ?

జ: చాలా ఇబ్బందుల్లో ఉన్నాం. ఆదాయంలో 82 శాతం జీతాలకే చెల్లిస్తున్నాం. నిధుల కోసం వెతుక్కుంటున్నాం.

దీనికి చంద్రబాబు కృషే కారణం. కేంద్రం కూడా సహకరించాల్సి ఉంది. అమరావతి విషయంలో ముందుగానే ఒక ప్రణాళిక పెట్టుకున్నాం. మొత్తం ప్లానింగు ఏరియాలో నాలుగువేల ఎకరాలను అమ్మకానికి పెట్టాలనుకుంటున్నాం.

ఓవేలం పద్ధతిలో విక్రయిస్తాం. అభివృద్ధి చెందిన తరువాత విక్రయించడం ద్వారా అమరావతి అభివృద్ధికి అవసరమైన నిధులు సేకరిస్తాం.

గ్రూప్-2 మెయిన్స్‌లో అవకతవకలు లేవు

- గ్రూప్-3 మెయిన్స్‌కు ఏర్పాట్లు పూర్తి
- ఎపిపిఎస్‌సి ఛైర్మన్ ఉదయ భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అత్యంత పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపడుతోందని ఛైర్మన్ ఉదయ భాస్కర్ తెలిపారు. గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల్లో ఎలాంటి అక్రమాలూ లేవని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎపిపిఎస్‌సి కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రూప్స్ పరీక్షల నిర్వహణపై తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అభ్యర్థులకు సూచించారు. గ్రూప్-2 మెయిన్స్ ప్రశ్న పత్రాలు లీకయ్యాయనే వార్త అవాస్తవమన్నారు. పరీక్ష పూర్తయిన వారం రోజుల తరువాత వాట్సప్ గ్రూప్‌ల్లో దర్శనమిచ్చాయని, అయితే అవన్నీ నకిలీవిగా తేలాయని చెప్పారు. గతానికి భిన్నంగా అత్యంత పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ నెల 6,7 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-3 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎపిలోని 13 జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోనూ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పంచాయతీరాజ్ సెక్రటరీ పోస్టులు జిల్లా కేడర్‌కు సంబంధించినవి కావడంతో, అభ్యర్థుల వెసులు బాటు కోసం జిల్లాల వారీగా పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కేడర్ పోస్టులు కావడంతో ప్రతి జిల్లాకు వేర్వేరుగా పరీక్షా పత్రాలను ఇచ్చుకోవచ్చని, అందువల్ల ఖర్చుతో పాటు సమయం వృథా అవుతుందన్నారు. అందుకే జిల్లాల వారీగా వేర్వేరుగా పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. రెండు సెట్ల పేపర్‌లను సిద్ధం చేశామని తెలిపారు. ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తున్నందున పేపర్ లీకేజీ అయ్యేందుకు వంద శాతం అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఆగస్టు 6న అనంతపురం, చిత్తూరు, కడప, పశ్చిమ గోదావరి, గుంటూరు, కృష్ణా , ప్రకాశం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆయా జిల్లాల అభ్యర్థుల కోసం 133 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, హైదరాబాద్-1లో రెండు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి రోజు మొత్తం 35,150 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఆగస్టు 7న కర్నూలు, నెల్లూరు, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాలకు సంబంధించి 17,600 మంది అభ్యర్థులు పరీక్ష రాయనుండగా, హైదరాబాద్‌తో కలిపి 68 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా పొటో గుర్తింపు కార్డు తీసుకునిరావాలని సూచించారు. పరీక్ష ప్రారంభం అయినప్పటి నుంచి పరీక్ష ముగిసే వరకు అభ్యర్థులు పరీక్షా హాల్‌ను వదిలి బయటకు రావద్దని, ఎవరైనా బయటకు వస్తే, తిరిగి పరీక్షా హాల్‌లోకి అనుమతించడం కుదరదని స్పష్టం చేశారు. మొత్తం 1055 పోస్టులకుగాను మెయిన్స్‌కు 52,750 మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారని తెలిపారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను కూడా షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామన్నారు. త్వరలోనే పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేస్తామని చెప్పారు.

శిల్పా ఇంటి ముందు మహిళల ధర్నా

ప్రజాశక్తి- నంద్యాల లీగల్

కర్నూలు జిల్లా నంద్యాలలో గురువారం వైఎస్.జగన్ బహిరంగ సభలో వైఎస్ఆర్‌సిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి 49 వేల మెజార్టీకి ఒక్క ఓటు తగ్గినా 'మనం ఆడవాళ్లమే' అని ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం శిల్పా మోహన్‌రెడ్డి ఇంటికి మహిళలు ప్రదర్శనగా వెళ్లి నిరసన తెలిపారు. మహిళలంటే అంత అలుసా, మీకు భార్యాబిడ్డలు లేరా అని ప్రశ్నించారు. భారీ బహిరంగసభ సాక్షిగా మహిళలను కించపరచడం సిగ్గుచేటని పేర్కొన్నారు. మహిళల సత్తా ఏమిటో ఉప ఎన్నికల్లో చూపిస్తామని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న నంద్యాల డిఎస్‌పి గోపాలకృష్ణ తన సిబ్బందితో శిల్పా ఇంటికి హుటాహుటిన చేరుకుని మహిళలకు సర్దిచెప్పి శాంతింపజేశారు. మహిళా సంఘాలు, టిడిపి మహిళా విభాగం నాయకులు నిరసనలో పాల్గొన్నారు.

తప్పుంటే తప్పించుకోలేరు..

- ఎస్ఇసి, మున్సిపల్ అధికారులపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్

కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికల నిర్వహణ అంశంపై తప్పు మాది కాదంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఇసి), మున్సిపల్ శాఖ అధికారులు తప్పించుకునే తీరును హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. గత ఆదేశాల్లో ఎస్ఇసి బదులు ఇసి (కేంద్ర ఎన్నికల సంఘం) అని తప్పుగా ఉంటే ఆ పొరపాటును తమ దష్టికి తీసుకు రావాలే గానీ ఎన్నికలు జరపకపోవడం ఏ మాత్రం సబబు కాదంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. తప్పు మాది కాదంటూ ఎంతమాత్రం తప్పించుకుని తిరగలేరని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి కరికాలవలవన్‌లను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్‌రంగనాథన్, న్యాయమూర్తి పి.నవీన్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ హెచ్చరించింది. గడువు ముగిసినా కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు జరపలేదని పేర్కొంటూ 2015లో సీహెచ్ నారాయణమూర్తి ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం విదితమే. గురువారమే ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశామని ఎన్నికల సంఘం న్యాయవాది చెప్పగా, ఉన్నతాధికారుల్ని కోర్టుకు స్వయంగా రావాలంటేగానీ హామీల్ని అమలు చేయరా అంటూ బెంచ్ నిలదీసింది. కావాలనే కోర్టుకు ఇచ్చిన హామీని అమలు చేయలేదనే అనుమానాన్ని హైకోర్టు వ్యక్తం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినా మీపై కోర్టు ధిక్కార కేసును ఎత్తివేయబోమని, కోర్టు ధిక్కార కేసును విచారిస్తామని బెంచ్ తేల్చి చెప్పింది. ఇకపై జరిగే కేసు విచారణకు ఆ ఇరువురు అధికారులు స్వయంగా కోర్టుకు హాజరుకావాల్సిన అవసరం లేదని హైకోర్టు స్పష్టం చేసింది.



హెబ్బా పటేల్

ఏడున 'ఏంజెల్' ట్రైలర్

నాగ అన్వేష్, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'ఏంజెల్'. సోషియోఫాంటసీ స్టోరీతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు రాజమౌళి శిష్యుడు పళని. సరస్వతి ఫిల్మ్ బ్యానర్‌పై భువన్ సాగర్ నిర్మించారు. దాదాపు 40 నిమిషాలకి పైగా గ్రాఫిక్స్ హంగులతో రెడీ అవుతున్న ఈ సినిమాని తెలుగుతో పాటు తమిళ, హిందీ భాషల్లోకి విడుదల చేస్తున్నట్లు నిర్మాత తెలిపారు. ఈనెల 7న చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లుగా నిర్మాత తెలిపారు. ఈ సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకుల్ని అమితంగా ఆకట్టుకుంటాయని, తెలుగుతో పాటు తమిళంలో కూడా విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉందని దర్శకుడు పళని తెలిపారు. ప్రస్తుతం విజువల్ ఎఫెక్ట్స్ వర్క్‌లో బిజీగా ఉన్న ఈ సినిమాను అతి త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లుగా చెప్పారు.

'నేను కిడ్నాప్ అయ్యాను'



'నేను కిడ్నాప్ అయ్యాను' సినిమాలో ఓ సన్నివేశం


కిడ్నాప్ డ్రామా నేపథ్యంలో దగ్గుబాటి వరుణ్ సమర్పణలో మాధవి అద్దంకి నిర్మిస్తున్న చిత్రం 'నేను కిడ్నాప్ అయ్యాను'. సెన్సార్ పూర్తి చేసుకుంది. బ్రహ్మానందం, పోసాని కృష్ణ మురళి, తాగుబోతు రమేష్‌ల హాస్య సన్నివేశాలు బాగున్నాయనీ, దర్శకుడు శ్రీకర్ బాబు మంచి సినిమా తీశారని సెన్సార్ సభ్యులు మెచ్చుకున్నారని మాధవి అదంకి తెలిపారు. ఈనెల రెండో వారంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. 'అనుకోని పరిస్థితుల్లో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేయడం.. దాని పర్యవసానాలు ఎలా ఉంటాయనేది ఈ చిత్రంలో ఆసక్తికరం. అన్ని అంశాలున్న కథ ఇది. త్వరలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నామ'ని దర్శకుడు శ్రీకర్ బాబు చెప్పారు.

కోలుకుంటున్న దిలీప్

బాలీవుడ్ దిగ్గజం.. సీనియర్ నటుడు దిలీప్ కుమార్ తీవ్ర అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. కిడ్నీ సంబంధిత సమస్యలతో బుధవారం ముంబయిలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. ఆయన్ని తొలుత ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. ఆయన రెండు కిడ్నీలు చెడిపోవడంతో శుక్రవారం ఉదయం మళ్లీ ఐసీయూకి తరలించారు. వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. సాయంత్రానికి ఆయన పరిస్థితి మెరుగుపడడంతో వెంటిలేటర్‌ను తొలగించారు. ప్రస్తుతం డైలాసిస్ కూడా చేయడం లేదు. అయన వయసు దృష్టా తదుపరి చికిత్స నమిత్తం ఏం చేయాలన్న ఆలోచన చేస్తున్నారు లీలావతి హాస్పటల్ వైద్యబృందం. ఆ హాస్పటల్ వైస్ ప్రెసిడెంట్ అజయ్ కుమార్ పాండే మాట్లాడుతూ " ప్రస్తుతానికి దిలీప్ గారి ఆరోగ్యం బాగానే ఉంది. ఆయనకు డైలాసిస్ కూడా చేయడం లేదు. ఆయన వయసు దృష్టా ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇతను మా సీనియర్ వైద్యుల బృందం పర్యవేక్షణలో ట్రీట్‌మెంట్ జరుగుతోంది. దిలీప్ గారు కిడ్నీ తీవ్రంగా దెబ్బతినడం వల్ల ఈ అనారోగ్య సమస్య తలెత్తింది. కానీ దానికి సర్జరీ ఏమీ అవసరం లేదు' అని చెప్పారు.



దిలీప్ కుమార్



సోనాక్షి సిన్హా

నటి..గాయని..!

సోనాక్షి సిన్హా ఇక నుంచి హీరోయిన్ మాత్రమే కాదు గాయని కూడా. కాదు కాదు.. ఆమె ముందే గాయని. ఆమె హీరోయిన్ కాకముందు నుంచే గాయనిగా రాణించాలని కలకనేదట. ఏవో కొన్ని పాటలు పాడిందట. కాకపోతే బాలీవుడ్‌లో సినిమా కమిట్‌మెంట్‌లు వల్ల తర్వాత పాడడం సాధ్యం కాలేదట. ఇప్పుడు మాత్రం ఎలాగైనా ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా సరే సింగర్‌గా తన గొంతును వినిపించేందుకు సిద్ధమైపోతోంది. కెనాడా రేపర్ పారిచాయ్‌తో కలసి వీడియో ఆల్బమ్ నైన్టీస్ ట్రాక్‌లో ఆలాపిస్తుంది. నాగార్జున, మనిసాకొయిరాల జంటగా రూపొందిన 'క్రిమినల్' సినిమాలో 'తుమ్ మిలే' అనే గీతాన్ని కొత్త వెర్షన్‌తో పాడనున్నారట. ఇందులో మొత్తం గీతాన్ని సోనాక్షియే పాడనుందట. పారిచాయ్‌ది చిన్న పాటి భాగం ఉంటుందట. ఇప్పటికే చాలా వరకూ ఈ వీడియో పని పూర్తయిపోయిందని తెలిపింది సోనాక్షి. ఈ గీతం ఎలా ఉండబోతుందో త్వరలోనే తెలియనుంది.

'నక్షత్రం' మెరవలేదు



నటీనటులు : సందీప్ కిషన్, సాయి ధరమ్ తేజ్, రెజీనా, ప్రగ్యా జైస్వాల్, ప్రకాష్ రాజ్, తనీష్, శివాజీ రాజా, జెడి చక్రవర్తి, తులసి తదితరులు
సాంకేతికం : కెమెరా : శ్రీకాంత్ నారోజ్, కూర్పు : శివ వై ప్రసాద్, సంగీతం : మణిశర్మ, బీమ్స్, భరత్ మధుసూదన్, హరిగౌర, నిర్మాతలు : కె.శ్రీనివాస్, ఎస్.వేణుగోపాల్, సాజు, రచన, దర్శకత్వం : కృష్ణవంశీ.

దర్శకుడు కృష్ణవంశీ సినిమాలంటే ఆసక్తిగా, కొత్తగా ఉంటాయి. క్రియేటివ్ డైరెక్టర్‌గా పేరుతెచ్చుకున్న ఇతను తన చిత్రాల్లో సందేశం, కమర్షియల్, మసాలా హంగులు...ఇలా అన్నీ ఉండేలా చూసుకుంటాడు. ఆయన చిత్రాల్లో ఎవరైనా పాత్ర చేస్తే ఆ నటుడి జీవితంలో అదొక గొప్ప పాత్రగా మిగిలిపోతుందంటారు. తాజాగా పోలీస్ గొప్పతనాన్ని చాటిచెప్పే చిత్రంగా 'నక్షత్రం' తీశాడు. దానికి 'భూమిపై దిగివచ్చిన నక్షత్రమే పోలీస్' అని కూడా చెప్పాడు. నిత్యం అప్‌డేటెడ్‌గా ఉంటానని చెప్పి కృష్ణవంశీ తీసిన ఈ సినిమా ఎలా ఉందో చూద్దాం.

కథ : రామారావు (సందీప్ కిషన్)ది పోలీస్ కుటుంబం. మూడు తరాలు పోలీసులే. అందుకే తనూ పోలీసు అవ్వాలనే చిన్ననాటి కోరిక. దానికోసం అతికష్టం మీద ఇంగ్లిష్ నేర్చుకుని మీరీ ఆ సబ్జెక్ట్ పాసవుతాడు. ఇక ఫిజికల్ టెస్ట్‌కు సిద్ధమై పరీక్షకు హాజరవుతుండగా పోలీసు కమిషనర్ ప్రకాష్ రాజ్ కొడుకు తనీష్ తన స్నేహితులతో వచ్చి చితకబాది అడ్డుకుంటాడు. తన లక్ష్యం చేజారిపోయిందని నిరాశతో ఆత్మహత్య చేసుకోబోతాడు రామారావు. ఈ విషయం తెలిసిన తల్లి తులసి, పోలీసు అయిన అతని మామయ్య శివాజీ రాజా హితబోధ చేస్తారు. ప్రజలను కాపాడేది పోలీసే అని చెబుతారు. ఆ స్ఫూర్తితో ఫేక్ పోలీసుగా డ్యూటీ చేస్తుంటాడు. సిటీని పేల్చాలనుకున్న బాంబ్‌బ్లాస్ట్ గ్యాంగ్‌ను పట్టుకుంటాడు. రామారావు వేసుకున్న డ్రెస్‌పై అలెగ్జాండర్ అని పేరు ఉండడం... అతని కోసమే పోలీసులు ఎంతో కాలంగా వెతుకుతుండడం...ఈ నేపథ్యంలో కమిషనర్ రామారావును పట్టుకోవడం జరిగిపోతాయి. ఆ తర్వాత ఏమయింది? అసలు ఏసీపీ అలెగ్జాండర్ ఎవరు? కమిషనర్ కొడుకుతో రామారావుకు గొడవేంటి? అనేది తెరపై చూడాల్సిందే.

విశ్లేషణ : రామారావు పోలీస్ అవ్వాలనేది ఈ సినిమా కథ. దానికి చాలా ఉప కథలుంటాయి. ఇవన్నీ చూసేసరికి పే..ద్ద సినిమా చూసిన ఫీలింగ్ కలుగుతుంది. రామారావుకు వరసైన రెజీనా అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తుంది. అక్కడ ఆమె పడ్డ బాధలు ఇండస్ట్రీపై సెటైరికల్‌గా చూపించారు. ప్రగ్యా జైస్వాల్ పాత్ర సెల్‌ఫోన్లు దొంగతనాలు చేసేదిగా చూపించారు. ఆ తర్వాత తను పోలీసు అధికారిణిగా ట్విస్ట్ ఇస్తాడు. ఇలా ఎందుకు చేశాడో క్లారిటీ లేదు. సాయి ధరమ్ తేజ్ ఏసీపీ అలెగ్జాండర్‌గా సూటయ్యాడు. కానీ ఆ స్థాయిలో పాత్రను డిజైన్ చేయలేదు. ప్రకాష్‌రాజ్ పాత్ర షరామామూలే. గాడి తప్పిన కొడుకుగా తనీష్ నటన సినిమాకు హైలైట్.

పోలీస్ అవ్వాలనే ఒక యువకుడు కథని తీసుకొని దానిని కాస్తా డిఫరెంట్ యాంగిల్‌లో చెప్పాలని చేసిన ప్రయత్నం దర్శకుడు చేసినా పాతకాలపు కథలు చాలా గుర్తుకొస్తాయి. బాలీవుడ్‌లో ఇలాంటి కథలు చాలానే వచ్చాయి. సంజయ్‌దత్‌తో పాటు పలువురు పోషించిన పాత్రలే తనీష్‌లో కన్పిస్తాయి. పోలీసు విలువను చెప్పే ప్రయత్నంలో కథను రకరకాలుగా సాగదీస్తూ రెండు సినిమాలు చూసిన ఫీలింగ్‌ను కలిగించాడు కృష్ణవంశీ. దానికితోడు హీరోయిన్లతో అంగాంగ ప్రదర్శనలు చూపిస్తూ తన టాలెంట్‌ను మరోసారి రుజువుచేసుకున్నాడు. సంభాషణలు సందర్భానుసారంగా బాగున్నాయి. పోలీసు అవ్వలేకపోయాననే బాధను వ్యక్తం చేసే సన్నివేశాల్లో సందీప్ కిషన్ నటుడు బయటకువచ్చాడు.

లోపాలు : ఏసీపీ అలెగ్జాండర్ మానవ బాంబ్‌గా మారి పబ్లిక్‌లో చనిపోతే... తను ఏమయ్యాడనేది కమిషనర్‌కు తెలీయకపోగా.. ఆయన కోసమే కథను చివరి వరకు నడపడం విడ్డూరంగా అనిపిస్తుంది. చనిపోయే ముందు కమిషనర్ కొడుకు వచ్చి అలెగ్జాండర్‌ను బయటకు తీసుకువెళితే.. అక్కడే ఉన్న శివాజీరాజా 'ఎందుకొచ్చాడు వీడు!' అని ఎక్స్‌ప్రెషన్ ఇస్తాడు కానీ, అలెగ్జాండర్ చనిపోయాక అతనికి లింక్ ఉందనే విషయాన్ని మర్చిపోయడం కథలో ప్రధాన లోపం. ప్రతిదీ అప్‌డేటెట్‌గా ఉంటానని చెబుతున్న కృష్ణవంశీ పాతకాలపు ఫార్మెట్‌తో కథనాన్ని నడపడడం విసుగుపుట్టిస్తుంది.

ఇక పాటల్లో వాయిద్యాల హోరు సాహిత్యానికి బ్రేక్‌లు. సీరియస్‌గా సాగే కథకు మళ్ళీ పాటలు బ్రేకులే.. ఇలా పాత కాలపు సినిమాను చూసిన ఫీలింగ్ కలుగుతుంది. ప్రగ్యాజైస్వాల్ పోలీసు అధికారిణిగా బాగా చేసింది. యాక్షన్ ఎపిసోడ్స్ అద్భుతంగా చేసింది. ఇక జెడీ చక్రవర్తి.. ఓ సన్నివేశంలో కమిషనర్‌పై సీరియస్ అవ్వడం.. ఆ తర్వాత మరో సన్నివేశంలో ఏరా! అనడం.. చిన్ననాటి స్నేహితులుగా చూపించి కన్‌ఫ్యూజ్ చేస్తాడు. ఇవి మినహా సినిమాలో పెద్దగా ట్విస్టులు ఆసక్తికర విషయాలు లేవు. సినిమా మొత్తం సంగీతం కథను డిస్టర్బ్ చేస్తూనే ఉంది.

'దర్శకుడు' లక్ష్యం ఒక్కటేనా!



నటీనటులు : అశోక్, ఈషా రెబ్బ, పూజిత తదితరులు
సాంకేతికం : సంగీతం : సాయి కార్తీక్, నిర్మాత : సుకుమార్, దర్శకత్వం : హరి ప్రసాద్ జక్కా

సుకుమార్ ఒక పక్క దర్శకుడిగా సినిమాలు చేస్తూనే మరో పక్క కథా రచయితగా, నిర్మాతగానూ రాణిస్తున్నాడు. మొన్నామధ్య సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లో 'కుమారి 21 ఎఫ్' చేశాడు. ఇప్పుడు 'దర్శకుడు' చిత్రాన్ని నిర్మించాడు. తన అన్న నిర్మాత, అన్న కొడుకు హీరో...వారి కుటుంబంలో వారే అందరూ కలసి ఈ సినిమా తీశారు. దర్శకుడు అవ్వాలనే యువకుడి కథే చిత్రం. హరి ప్రసాద్ దర్శకుడిగా పరిచయమయ్యాడు. 'దర్శకుడు' అంటే సినిమాకు కెప్టెన్. అతనిలో 24 క్రాఫ్ట్‌పైనా, అన్ని విషయాలపై పట్టుండాలి..ఉంటుంది. అలా ఉంటేనే దర్శకుడిగా రాణించగలడు. మరి 'దర్శకుడు' పేరుతో వచ్చిన ఈ చిత్రంలో డైరెక్టర్ అలా చేశాడా? కనీసం ఈ కథకి కావాల్సిన కొన్నింటినైనా చేశాడో? లేదో? చూద్దాం.

కథ : చిన్నతనం నుంచి దర్శకుడవాలనే తపన ఉన్న కుర్రాడు మహేష్ (అశోక్). ఊర్లో పిల్లలతో పలు విన్యాసాలు చేయించి షూట్ చేస్తుంటాడు. ఇది తెలిసి తండ్రి ప్రోత్సహిస్తాడు. పెద్దయ్యాక దర్శకుడి ఛాన్స్ దక్కించుకుని స్క్రిప్ట్ పనుల్లో ఉంటాడు. నాన్నకు చెప్పాలని ఊరువెళతాడు. అక్కడ నమ్రత (ఈషా రెబ్బ)తో ఏర్పడ్డ పరిచయం హైదరాబాద్‌వరకు జర్నీ సాగుతుంది. అది కాస్త ప్రేమగా మారుతుంది. ఈ విషయాలన్నింటినీ తను తీయబోయే సినిమాలో లవ్‌ట్రాక్‌గా రికార్డ్ చేసుకుంటాడు. ఇది తెలిసిన నమ్రత అసహ్యించుకుంటుంది. తన ఫీలింగ్‌ను ఇలా కూడా ఉపయోగిస్తున్నావా! అంటూ నిలదీస్తుంది. ఆ ఫీలింగ్‌ను కూడా రికార్డ్ చేస్తాడు. ఇలా ఇద్దరి మధ్య ఏర్పడిన చిన్నచిన్న అల్లర్లు సినిమా తెరపైకి వెళ్ళేవరకు వారి జర్నీ సాగుతుంది. తను కాస్ట్యూమ్ డిజైనర్‌గా అతని దగ్గరే పనిచేస్తుంది. ఇక సినిమా ముగింపునకు వచ్చేసరికి ఓ చిన్న సంఘటనతో నిర్మాతకు కోపం వచ్చి దర్శకత్వం కావాలా? నమ్రతా కావాలా? తేల్చుకోమంటాడు. అనంతరం ఆమెను వదిలేస్తాడు. మరి తను అనుకున్నట్లుగా దర్శఖుడు అయ్యాడా?లేదా? అనేది తెరపై చూడాల్సిందే.

విశ్లేషణ :

సినిమాలో మొదటి నుండి చివరి దాకా ఆకట్టుకునేది హీరో పాత్ర చిత్రీకరణ. సినిమానే జీవితంగా భావిస్తూ, సినిమాలోనే జీవితాన్ని చూసే ఒక వ్యక్తి ఎలా ఉంటాడు, ఎలా ఆలోచిస్తాడు, జీవితంలో జరిగే ప్రతి సంఘటన, చివరికి ప్రేమనూ, ప్రేమించిన అమ్మాయిని కూడా సినిమా కోణం నుండే చూస్తూ అన్ని ఎమోషన్స్‌ని తన సినిమా కోసం ఎలా వాడుకుంటాడు అనేది బాగా చూపించారు. అలాగే సినిమాలో అండర్ ప్లేగా నడిచే లవ్ ట్రాక్ ఆకట్టుకుంది. హీరోయిన్ ఈషా రెబ్బ సహజమైన నటన లవ్ ట్రాక్‌ను ఆడియన్సుకి కనెక్టయ్యే విధంగా చేసింది.

గతంలో చూపించిన సినిమా కష్టాలు ఇందులో తక్కువే. కేవలం దర్శకుడు కష్టాలు, దాన్ని తెలివితో ఎలా సాధించుకున్నాడనేది పాయింట్. ఇంటర్వెల్ సన్నివేశం కొత్తగా స్వార్థపరుడైన దర్శకుడు ఎలా ప్రవర్తిస్తాడు అనే విషయాన్ని బలంగా ఎలివేట్ చేయగలిగింది. అలాగే క్లైమాక్స్ చివరిలో ప్రేమ తాలూకు ఎమోషన్ కదిలించింది. ఇక కమెడియన్ సుదర్శన్ అక్కడక్కడా నవ్వించగా, ప్రియదర్శి కనిపించిన ఒక్క సన్నివేశానికి న్యాయం చేసి నవ్వులు పూయించాడు.

ఒక కుర్రాడిలోని దర్శకుడికి, ప్రేమికుడికి మధ్య జరిగే సంఘర్షణను పూర్తి స్థాయిలో ఎలివేట్ చేయలేకపోయారు. దాంతో సినిమాలో సోల్ మిస్సయింది. సినిమా చివర్లో హీరో సినిమాకు, ప్రేమకు దూరమయ్యే ఘట్టాన్ని కూడా ఏదో అలా అలా లాగించేయడంతో పెద్దగా భావోద్వేగం కలగలేదు. అంతేకాకుండా దర్శకుడు అనే టైటిల్ పెట్టినప్పుడు హీరో పడే సినిమా కష్టాల్ని అయినా కొద్దిగా జత చేసుంటే బాగుండేది. అలా కూడా ఈజీగా సంపాదించేయడంతో కథనంలో బలం కనబడలేదు. ఇక హీరో అశోక్ బరువైన ఎమోషన్స్ చూపించాల్సిన చోట తేలిపోయింది. చిన్నపాటి కథతో పరిమిత నటులతో తీసిన ఈ సినిమా సినిమా వాళ్ళకు బాగా కనెక్ట్ అవుతుంది. ప్రేక్షకులు ఏమేరకు ఆదరిస్తారో చూడాలి.

'మాస్ పవర్' ప్రారంభం

సర్వేశర మూవీస్ పతాకంపై శివ జొన్నలగడ్డ హీరోగా స్వీయ దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా 'మాస్ పవర్'. గుద్దేటి బసవప్ప మేరు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ గురువారం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి పారిశ్రామిక వేత్త సారిపల్లి కొండలరావు క్లాప్ నివ్వగా, నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ కెమెరా స్విచాన్ చేశారు. ముత్యాల రామదాసు తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. స్క్రిప్ట్‌ను ప్రసన్న కుమార్, వి.సాగర్ అందించారు. అనంతరం శివ జొన్నలగడ్డ మాట్లాడుతూ 'ఇటీవలే బసవప్పతో కలిసి తెరకెక్కించిన 'పోలీస్ పవర్' విజయం సాధించింది. మళ్లీ ఇదే కలయికలో ఈ సినిమా చేయడం సంతోషంగా ఉంది. కాలనీలో ఒక హౌస్‌ను ఓ పొలిటికల్ లీడర్ కబ్జా చేస్తే? ఎలాంటి పరిణామలు చోటు చేసుకుంటాయి. తిరిగి ఆ హౌస్‌ను హీరో ఎంతటి క్షేమంగా అప్పగించాడన్నదే చిత్ర కథ. నా స్టయిల్లో పక్కా మాస్ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కిస్తున్నాం. యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయ'ని అన్నారు.



జొన్నల గడ్డ శివ తదితరులపై క్లాప్ కొడుతున్న సారిపల్లి కొండలరావు

జర్నీ

చారిత్రక నిలయం


భరతుపూర్





చారిత్రక
కట్టడాల మధ్య
మనం వేసే ప్రతి అడుగూ
జీవితంలో మర్చిపోలేని ఎన్నో
అనుభూతులను పదిలపరుస్తుంది.
అలనాటి విశేషాలు కనులారా
వీక్షించేందుకు చరిత్రకారులు నిత్యం
అన్వేషిస్తూ ఉంటారు. అలాంటి
సహజసిద్ధమైన ప్రకృతి రమణీయతను
ఎడారి మాటున పర్యాటకులకు అందిస్తోంది
భరత్పూర్. పక్షుల ప్రేమికులకు చిరునామాగా
పేరుపొందింది ఈ ప్రాంతం. నేడు
ప్రపంచంలో మారుతున్న పట్టణీకరణలో
భాగంగా పక్షి జాతులు అంతరించిపోతున్న
తరుణంలో పచ్చదనానికి మారుపేరుగా
నిలుస్తూ, పక్షుల సంరక్షణకు కేంద్రంగా
నిలుస్తోన్న చారిత్రక నిలయం
భరత్పూర్‌ను
ఈవారం జర్నీలో
సందర్శిద్దాం!

'రాజస్థాన్‌కి తూర్పు ద్వారం' అని పిలువబడే భరత్పూర్ పట్టణం సూరజ్‌మాల్ మహారాజు నిర్మించిన పురాతన నగరంగా పేరుపొందింది. లోహఘర్‌గా పిలువబడే భరత్పూర్ జైపూర్, ఉదయపూర్, జైసల్మేర్, జోద్పూర్ వంటి ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలకు ముఖద్వారం. అందుకే లక్షలాది పర్యాటకులు ఇక్కడికి వస్తూ ఉంటారు. అనూహ్యమైన వాతావరణ మార్పులను ఈ ప్రాంతంలో గమనించవచ్చు. బాణగంగా, రూప్‌రెల్, గంభీర్ నదులు ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. భరత్‌పూర్ నగరానికి చేరువలో 1760లో నిర్మించిన గోపాల్‌భవన్ కళానైపుణ్యంతో ఆకట్టుకుంటుంది. ఈ భవన ప్రవేశద్వారం బయట చూడచక్కని పూలతోట సందర్శకులను ఆహ్వానం పలికేలా కనిపిస్తుంది. గోపాల్‌సాగర్ ఎదురుగా ఉండే ఈ భవనం వెనుక భాగానికి సావన్, భదోన్ అనే రెండు చిన్న మండపాలు హద్దుగా నిర్మించారు. ఒక పాలరాయి తోరణంతో తోట ముందు ఎత్తయిన పైకప్పు ఉంటుంది. మొగలుల యుద్ధచిహ్నాలైన తోరణాలను సూరజ్‌మాల్ మహారాజు, జాట్‌రాజు తీసుకువచ్చి పీఠంపై ఉంచారు. గోపాల్‌భవన్ ప్రాంగణంలో ఒక సమావేశ ప్రాంగణం ఉంది. ఈ హాలులో అరుదైన పురాతన సేకరణలను, జ్ఞాపికలను, విక్టోరియన్‌ల గృహోపకరణాలను ప్రదర్శిస్తారు. ఈ హాలు అందమైన ఫౌంటేన్స్‌తో అలంకరించబడిన పల్లపు కొలను మైమరిపిస్తుంది. భరత్పూర్‌లోని అన్నిభాగాల నుంచి గోపాలభవన్‌ను తేలికగా చేరుకోవచ్చు. అంతేకాదు భరత్పూర్‌లోని కట్టడాలు రాజపుత్ర, మొఘలాయి, బ్రిటీష్ నిర్మాణ శైలుల ప్రభావానికి ప్రతీకగా నిలుస్తాయి. రాజస్థాన్ రాష్ట్రంలోని ప్రసిద్ధ కోటలలో లోహఘర్ కోట ఒకటి. ఈ నగరంలో పర్యాటకులు డీగ్‌కోట, భరత్పూర్ రాజప్రాసాదాన్ని చూడవచ్చు.




గోపాల్ భవన్



పక్షుల కిలకిలారావాలు

రాజస్థాన్ అంటేనే గుర్తుకొచ్చే ఎడారి మాటున ప్రకృతి ఒడిలో సేద తీరాలనుకునే వారికి, పక్షి ప్రేమికులకు భరత్పూర్‌లోని నేషనల్ పార్క్ చిరునామా. అనేక జాతుల పక్షులకు విడిది కేంద్రంగా ఈ పార్క్ ప్రసిద్ధి చెందింది. ఇందులో 375 జాతుల పక్షులు నివాసం ఉంటున్నాయి. వర్షాకాలం, శీతాకాలం ఈ పార్క్ సందర్శనకు దేశ, విదేశాల నుండి వచ్చే పర్యాటకులతో సందడిగా కనిపిస్తుంది. వలస వచ్చే నీటి బాతులు, పొడ వుమెడ, బూడిదరంగు కాళ్లున్న బాతులు, సన్నతోక పక్షులు, నీలిరంగు పిట్టలు, మల్లార్డ్‌లు, విడ్జియన్‌లు, షోవేలర్‌లు, సాధారణ షెల్‌డక్‌లు, ఎర్రమెడ బాతులు, గడ్వాల్ బాతులు వంటి తదితర జాతుల బాతులు ఇక్కడి అడవుల్లో చూడవచ్చు. ఇంకా అనేకరకాల పక్షుల కిలకిలా రావాలు సందర్శకుల్ని మైమరిపిస్తాయి. సైబీరియా, చైనా, ఆఫ్ఘనిస్థాన్, టిబెట్ వంటి విదేశీపక్షులు వస్తూ ఉంటాయి. వీటిలో ప్రబల సైబీరియన్ కొంగలు కూడా ఉన్నాయి. వర్షాకాలంలో చిత్తడి భూములలో నీరు నిండుతుంది. తర్వాత పక్షులరాక మొదలవుతుంది. ★



ప్రభుత్వ మ్యూజియం..

భరత్పూర్‌లో ప్రసిద్ధి చెందిన పర్యాటక ఆకర్షణ ప్రభుత్వ మ్యూజియం. ఇది లోహెఘర్ కోట లోపల ఉంది. ఈ మ్యూజియంలో భరత్పూర్ చారిత్రక సంపదను సేకరించి, ప్రదర్శనకు ఉంచుతారు. ఒకప్పుడు ఈ మ్యూజియం భరత్పూర్ పరిపాలకుల పరిపాలనా వ్యవహారాల విభాగం. 1944లో కచారి కలన్ పరిపాలనా విభాగాన్ని మ్యూజియంగా మార్చారు. భవనం మొదటి అంతస్తు కామ్రాఖాన్ తర్వాత మ్యూజియంలో కలిపారు. బల్వంత్‌సింగ్ మహారాజు ఈ భవనాలను నిర్మించారు. పురాతన శిల్పాలు, చిత్రాలు, నాణేలు, శాసనాలు, జంతుశాస్త్ర నమూనా, అలంకరించిన కళాకృతులు, జాట్ పాలకులు ఉపయోగించిన ఆయుధాలు తదితర అరుదైన సంగ్రహాలను ప్రదర్శిస్తుంది. ఈ మ్యూజియంలో ఆర్ట్ గ్యాలరీలో రాతి కాగితంపై గీసిన కుడ్య చిత్రాలు, అభ్రకం, రావి ఆకులపై గీసిన చిత్రాలు చెప్పడం కాదు చూసి తరించాల్సిందే. ఈ మ్యూజియానికి భరత్పూర్ ప్రధాన బస్ స్టాండ్ నుండి, రైల్వేస్టేషన్ నుంచి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరం మాత్రమే.

ప్రభుత్వ మ్యూజియం



చేరుకోవడం ఎలా?

ఈ అందమైన ప్రదేశానికి వాయు, రైలు, రోడ్డు మార్గాల ద్వారా తేలిగ్గా చేరుకోవచ్చు. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టాక్సీలు, బస్సులలో పర్యాటకులు ఇక్కడికి చేరుకోవచ్చు. ఈ విమానాశ్రయం ముంబయి, బెంగళూరు, కొల్‌కతా, చెన్నైయి లాంటి దేశంలోని ప్రధాన నగరాలకు నిత్యం తిరిగే విమానాల ద్వారా అనుసంధానించి ఉంది. భరత్పూర్ రైల్వేస్టేషన్ జైపూర్, ముంబయి, అహ్మదాబాద్, ఢిల్లీలకు అనుసంధానించి ఉంది. రైల్వేస్టేషన్ నుంచి భరత్పూర్ చేరుకోవడానికి వాహనాలు అందుబాటులోనే ఉంటాయి. ఆగ్రా, న్యూఢిల్లీ, ఫతేపూర్, ఆల్వార్ వంటి నగరాల నుండి ప్రభుత్వ, ప్రైవేటు బస్సుల ద్వారా భరత్పూర్ చేరుకోవచ్చు. థార్ ఎడారికి దగ్గరగా ఉండడం వల్ల భరత్పూర్‌లో వేడి ఎక్కువగా ఉంటుంది. భరత్పూర్ సందర్శనకు వర్షాకాలం, శీతాకాలం అనువైనది.

సేకరణ : చందు

'జర్నీ'కి ఆహ్వానం



మన జీవితంలో కుటుంబ సమేతంగానో, స్నేహితులతోనో ఎన్నో ప్రయాణాలు చేస్తూ ఉంటాం. ఆ అనుభవాలు, విశేషాలు మాతో పంచుకునేందుకు 'జర్నీ' మీకు ఆహ్వానం పలుకుతోంది. మీ పర్యాటక అనుభూతులను మాకు రాసి పంపండి. లేదా మెయిల్ చేయొచ్చు. ఫొటోలు జత చేయడం మర్చిపోవద్దు.

మా చిరునామా

జర్నీ, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

వేటగాడు – 1

కథ: శాఖమూరి శ్రీనివాస్ (సెల్: 94410 75753)
బొమ్మలు: తుంబలి శివాజీ (సెల్: 98492 27509)



పొడుపు కథ

ఎర్రటి పండుమీద
ఈగైనావాలదు
ఏమిటది?

సునామీలు ఎలా వస్తాయంటే!



పిల్లలూ మీకు తెలుసా? సునామీలు రాకున్నా భూకంపాలు వస్తాయి. కానీ సునామీలు మాత్రం సాధారణంగా భూకంపాలు లేకుండా సంభవించవు. మన నేల ప్రాంతాల్లో జరిగే భూకంపాల వల్ల భవనాలు, ఆనకట్టలు, ఇతర నిర్మాణాలు, రహదారులు, రైలు మార్గాలు ధ్వంసమవుతాయి. కానీ సముద్రపు అడుగుభాగానున్న నేల బొరియల్లో భూకంపాలు వస్తే ఆ కంపనాల వల్ల ఉద్భవించిన గతిశక్తి ఆ నేలపైన ఉన్న సముద్రపు నీటికి అందుతుంది. సముద్ర గర్భాల్లో లోతు ఎక్కువగా ఉండటం వల్ల ఆ కంపన తీవ్రత ఏమంత పెద్దగా తెలియదు. కానీ శక్తి(గతిశక్తి) ఒకచోట నిలకడగా ఉండదు కాబట్టి అది సముద్రపు నీటితో తరంగాలను సృష్టిస్తుంది. ఆ తరంగ తీవ్రత సముద్రపు నడిబొడ్డున తక్కువే ఉన్నా ఆ తరంగాలు సముద్రతీరాన్ని చేరే క్రమంలో చాలా ఉదృతస్థాయికి చేరుకుంటాయి. ఎందుకంటే తరంగ తీవ్రత నీటికీ, నేలకూ మధ్య ఉన్న దూరానికి విలోమానుపాతంలో ఉంటుంది. అంటే సముద్రపు లోతు ఎక్కువగా ఉంటే తరంగ తీవ్రత తక్కువగాను, సముద్రపు లోతు తక్కువగా ఉంటే తరంగ తీవ్రత ఎక్కువగాను ఉంటుందన్నమాట. సముద్ర తీరాలలో సముద్రపు లోతు ఎక్కువ కాదు కాబట్టి తరంగాల తీవ్రత చాలా ఉధృతంగా ఉంటుంది. పైగా శక్తి నిత్యత్వమయి ఉండటం వల్ల సముద్రపు నడిబొడ్డున, అడుగుభాగంలో ఎంత శక్తివంతంగా భూకంపం సంభవించిందో అంతే మేరకు తీరం మీద తరంగాల శక్తి ఉంటుంది. అందుకే అవి వంద అడుగుల ఎత్తుకు చేరి తీర ప్రాంతంలో ఉన్న జనావాసాల్ని, వనాల్ని, నిర్మాణాల్ని ధ్వంసం చేసి, బీభత్సం సృష్టిస్తాయి. ★



జోక్ :

టీచర్ : క్వశ్చన్ పేపర్ లీక్ అయినా స్లిప్ ఎందుకు పెట్టావురా?
స్టూడెంట్ : ఆకాశంలో చంద్రుడు ఉన్నాడని ఇంట్లో లైట్లు ఆర్పేసుకుంటామా టీచర్?
టీచర్ : ఆ..!!??

చిన్నారి



చుక్కలు కలపండి !

పిల్లలూ.! పైనున్న చిత్రంలో చుక్కల ఆధారంగా బొమ్మలు గీసి, రంగులు వేయండి. !

క్వార్టర్స్‌లోనే ప్రణయ్, కశ్యప్ నిష్క్రమణ

ఆక్లాండ్: న్యూజిలాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ షట్లర్ల పోరు క్వార్టర్స్‌లోనే ముగిసింది. నాలుగో సీడ్ హెచ్ఎస్ ప్రణయ్‌పై 11వ సీడ్ చైనీస్ తైపీ ఆటగాడు లిన్ యూ సెయిన్ అద్భుత పోరాట పటిమతో మట్టికరిపించాడు. 10-21, 22-20,21-23తో ప్రణయ్ ఇంటిముఖం పట్టాడు. మరో షట్లర్ సిరిల్ వర్మ అన్ సీడెడ్ షట్లర్ లీ చెక్ (హాంకాంగ్) చేతిలో 19-21,16-21తో పరాజయం పాలయ్యాడు.

సిటీ ఓపెన్ క్వార్టర్స్‌కు బాంబ్రీ



వాషింగ్టన్: అమెరికాలో జరుగుతున్న సిటీ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో భారత యవ ఆటగాడు యూకీ బాంబ్రీ తన జైత్రయాత్రను కొనసాగిస్తున్నాడు. ప్రపంచ నెం:22 ర్యాంకర్ మోనాఫిల్స్(ఫ్రాన్స్)పై రెండో రౌండ్‌లో సంచలన విజయం నమోదు చేశాడు. ప్రి క్వార్టర్స్‌లో అర్జంటీనాకు చెందిన గుడియో పెల్లాపై 6-7, 6-3, 6-1తో జయభేరి మోగించి క్వార్టర్స్‌కు ప్రవేశించాడు. సెమీస్ బెర్త్ కోసం బాంబ్రీ ప్రపంచ నెం:45 కెవిన్ అండర్సన్‌తో పోరు సలపనున్నాడు.



బిగ్‌ఫైట్

- నేడు విజేందర్ × జుల్ఫికర్ డబుల్ టైటిల్ పోరు

ముంబయి : ప్రొ బాక్సింగ్‌లో ఇద్దకు మిడిల్ వెయిట్ ఛాంపియన్ల మధ్య ముంబయిలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియం వేదికగా భారీ సమరానికి తెరలేవనుంది. వరుసగా ఎనిమిది బౌట్లలో జయభేరి మోగించిన భారత స్టార్ బాక్సర్ విజేందర్ సింగ్, చైనా నెం:1 బాక్సర్ జుల్ఫికర్ మైమతియాలి డబుల్ టైటిల్ పోరుకు అమీతుమీ సిద్ధం అయ్యారు. వీరిద్దరూ మిడిల్ వెయిట్ కేటగిరుల్లో ఛాంపియన్‌లు నిలిచారు. జుల్ఫికర్ కంటే విజేందర్ పదేళ్ల చిన్నవాడు. 76 కేజీల బరువుతో విజేందర్, జుల్ఫికర్ 75.9కేజీలు బరువున్నాడు. రింగ్‌లో దిగిన కొన్ని నిమిషాల్లోనే ప్రత్యర్థులను చిత్తు చేస్తూ మంచి దూకుడు మీద ఉన్న విజేందర్ సింగ్ ఇక్కడ త్వరగా 45 సెకన్లల్లోనే పోరు ముగించాలని పట్టుదలతో ఉన్నాడు. ప్రత్యర్థి సవాల్‌కు ధీటైన సమాధానం ఇస్తానని మైమతియాలి కూడా ఛాలెంజిం గ్‌గా బరిలో దిగుతున్నాడు. దీంతో ఎవరి ఫంచ్ ఫలిస్తుందోనన్న ఆసక్తి ఇరుదేశాల బాక్సింగ్ అభిమానుల్లో నెలకొంది.

నేటి ప్రపంచ అథ్లెటిక్స్‌లో భారత్ షెడ్యూల్

లండన్ : అంతర్జాతీయ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ మీట్‌లో శనివారం భారత అథ్లెట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పురుషుల 400 మీటర్ల హీట్స్‌లో ఒడిషా ఆసియాన్ మీట్‌లో స్వర్ణం సాధించిన మహ్మద్ అనస్ పాల్గొననున్నాడు. మహిళల 100 మీటర్ల పరుగులో భారత్‌లోని ఒడిషాకు చెందిన స్ప్రింటర్ ద్యుతీచంద్ ఏ మేరకు రాణిస్తుందో అన్నది ఆసక్తి కరంగా మారింది. ఒడిషాలో 100 మీటర్ల పరుగులో రజతం సాధించింది. ఈ నేపథ్యంలో అత్యుత్తమ టైమింగ్‌ను నమోదు చేసింది.

రెండో రోజు భారత్ హవా

- భారత్ తొలి ఇన్నింగ్స్ 622/9 డిక్లేర్డ్
- అర్ధ శతకాలు బాదిన అశ్విన్, సాహా, జడేజా
- శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 50/2



కొలంబో: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో రెండో రోజు భారత్ తన హవాను కొనసాగించింది. మిడిల్ ఆర్డర్‌లో అశ్విన్ (54), సాహా (67), జడేజా (70) నాటౌట్‌తో ముగ్గురు అర్ధ సెంచరీలను నమోదు చేయడంతో భారత్ ఆతిథ్య జట్టుపై రెండోసారి భారీ స్కోర్ 622/9 పరుగులను చేసింది. దీంతో విరాట్ సేన ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేశాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీలంక త్వరగా రెండు వికెట్లను కోల్పోయింది. ఆట ముగిసే సమయానికి కెప్టెన్ చండీమాల్ 8 పరుగులు, కుశాల్ మెండీస్ 16 పరుగులతో క్రీజులో ఉన్నారు. చేతిలో ఉన్న 8 వికెట్లతో లంక ఇంకా 572 పరుగులను చేయాల్సి ఉంది. 343/3 పరుగులతో రెండో రోజు భారత్ ఇన్నింగ్స్ ప్రారంభి ంచింది. కరుణ రత్నే వేసిన రెండో ఓవర్‌లోను పుజారా 133 పరుగుల వద్ద (11 బౌండరీలు, ఓ సిక్స్), రహనే 132 పరుగుల వద్ద పుష్పకుమార బౌలింగ్‌లో స్టంపౌట్ అయ్యి వెనుదిరిగాడు. మొత్తం మీద తొలి ఇన్నింగ్స్‌లో ఆరుగురు ఇండియన్ బ్యాట్స్‌మెన్ 50 అంతకంటే ఎక్కువ పరుగులను చేయడం గమనార్హం.



అశ్విన్ డబుల్ ధమాకా...

టెస్ట్‌ల్లో ఆల్‌రౌండర్‌గా అశ్విన్ తన సత్తాను చాటాడు. కేవలం 51 టెస్ట్‌ల్లోనే 2వేల పరుగుల మైలురాయికి చేరుకోవడంతో పాటు 275 వ్కిఎట్లతో డబుల్ ధమాకాను సాధించాడు. శుక్రవారం నాటి 11వ అర్ధ సెంచరీతో 2వేలు పరుగులు, 275 వికెట్లతో వేగంగా ఈ ఫీట్ సాధించిన మూడో క్రికెటర్ రికార్డుల కెక్కాడు. ఇయాన్ బోథమ్ 42 టెస్ట్‌ల్లోను, భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్, పాకిస్తాన్ మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్‌లు సంయుక్తంగా 50 టెస్ట్‌ల్లో ఈ ఫీట్‌ను సాధించి రెండో స్థానంలో నిలిచారు.మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌లో సత్తా చాటిన భారత స్పిన్నర్ అశ్విన్ తర్వాత బంతితో తిప్పేసి రెండు వికెట్లను నేలకూల్చాడు.

ఐదో వికెట్‌కు రహానే,అశ్విన్ 63 పరుగులు, సాహాతో కలిసి 38 పరుగులను జోడించాడు. కెరీర్‌లో 11వ అర్ధ సెంచరీని నమోదు చేశాడు. అశ్విన్ 92 బంతుల్లో 5 ఫోర్లు, ఓ సిక్స్‌తో 54 పరుగులు, సాహా 134 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఓ సిక్స్‌తో 67 పరుగుల వద్ద ఔటయ్యారు. జడేజా 85 బంతుల్లో నాలుగు ఫోర్లు, 3 సిక్స్‌లతో 70 పరుగులతో అజేయంగా నిలిచాడు. లంక ఇన్నింగ్స్ ఆరంభించిన రెండో ఓవర్‌లోనే అశ్విన్ బౌలింగ్‌లో ఓపెనర్ ఉప్పల్ తరంగ్ డకౌట్ అయ్యాడు. 14 ఓవర్‌లో కరుణ రత్నే 25 పరుగుల వద్ద అశ్విన్ బౌలింగ్‌లోనే రహనే క్యాచ్ పట్టగా పెవిలియన్ ముఖం పట్టాడు. కెప్టెన్ దినేష్ చండీమాల్ మరో వికెట్ పడకుండా మరో ఆరు ఓవర్లను నడిపించాడు.

కుమ్మేసిన బుల్స్

ఉత్కంఠ మ్యాచ్‌లో ఒక్క పాయింట్‌తో తలైవాస్ ఓటమి



తమిళ్ జట్టుపై కూతకు వెళ్లిన బెంగళూరు కెప్టెన్ రోహిత్ కుమార్

నాగపూర్: బెంగళూరు బుల్స్ కుమ్మేసింది. ప్రొ కబడ్డీ(పికెఎల్) ఐదో సీజన్‌లో ఉత్కంఠ భరిత మ్యాచ్‌లో బుల్స్ తమిళ్ తలైవాస్‌పై అద్భుత విజయంతో సత్తా చాటింది. దీంతో ఆడిన రెండో మ్యాచ్‌లోను విజయంతో జోష్ అందుకుంది. నాగపూర్‌లోని మంకాపూర్‌లో రెండో విడతగా ప్రారంభమైన లీగ్ మ్యాచ్‌ల్లో తొలి మ్యాచ్ బెంగళూరు బుల్స్, తమిళ్ తలైవాస్‌పై 32-31 పాయింట్లతో జయకేతనం ఎగుర వేసింది.బెంగళూరు ఆది నుంచి తమిళ్ జట్టుపై సంపూర్ణ ఆధిపత్యంతో దూసుకెళ్లింది. తొలి అర్ధభాగం ముగిసేటప్పటికే బుల్స్ 23-8తో ముందంజలో నిలిచింది. రెండో అర్ధ భాగంలో తమిళ్ జట్టు అను హ్యంగా వరుస దాడులతో భారీగా పాయిం ట్లను రాబట్టింది.

మ్యాచ్ ముగిసే కొద్ది క్షణాల్లో స్వల్ప పాయింట్ల తేడాతో ఇరుజట్లు సాగటంతో ఎవరి గెలుస్తారన్న నరాల తెగే ఉత్కంఠకు దారి తీసింది. చివరి రెండు నిమిషాల్లో 31-30 పాయింట్లతో సాగుతున్న దశలో బుల్స్ కెప్టెన్ రోహిత్ కుమార్ బరిలో దిగి ఓ పాయింట్ తీసుకు రాగా ఆ జట్టు స్కోర్ 32కు చేరింది. తమిళ్ స్టార్ ఆటగాడు పరాపంజెన్ సక్సెస్ రైడ్‌కు వెళ్లి ఓ పాయింట్ తీసుకురావడంతో 32-31తో స్కోర్లు సాగాయి. చివరి నిమిషంలో బుల్స్ కెప్టెన్ రోహిత్ రైడ్‌కు వెళ్లి వ్యూహాత్మంగా కోర్టులో కలియ తిరిగి వెనక్కి వచ్చేయడంతో మ్యాచ్ ముగిసింది. దీంతో బుల్స్ అనుహ్యంగా సంచలన విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో తెలుగు జట్టుతో పోరాడి ఓడిన తమిళ్ జట్టు తన రెండో మ్యాచ్‌లో ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయింది. తమిళ్ కెప్టెన్ అజయ్ ఠాకూర్ , స్టార్ రైడర్ కె పరాపంజన్ సత్తా చాటినా తొలి అర్ధ భాగంలో వీలైనన్ని పాయింట్ల తేలేకపోవడంతో రెండో ఓటమిని ఆ జట్టు చవి చూసింది. ఆల్ ఔట్ పాయింట్లు 4-4 సాధించగా, రైడింగ్ పాయింట్లతో తమిళ్ తలైవాస్ 16-15తో ముందంజ వేసింది.టాకిల్ పాయింట్లలో వెనుకబడింది.

నేటి మ్యాచ్‌లు

రాత్రి 8 గంటలకు యు ముంబా × దంబంగ్ ఢిల్లీ

రాత్రి 9 గంటలకు బెంగళూరు బుల్స్× యూపి యోధా

ఢిల్లీపై పుణేరి జయభేరి

పుణేరి పల్టన్, దంబంగ్ ఢిల్లీల మధ్య రెండో మ్యాచ్ జరిగింది.ఈ మ్యాచ్‌లో పుణేరి జట్టు 26-21తో ఢిల్లీని మట్టి కరిపించింది. ఆది నుంచి పుణేరి జట్టు ఢిల్లీపై పట్టు సాధించింది. తొలి అర్ధ భాగం ముగిసేటప్పటికి 11-7తో ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధ భాగంలో ఢిల్లీ వరుస పాయింట్ల సాధనతో అంతరం తగ్గించే దిశగా వ్యూహాత్మక దాడుల చేసింది. కాగా పుణే జట్టు మాత్రం ఆధిక్యతను కోల్పోకుండా కవ్వింపులతో సరిపెడుతూ పాయింట్లను వదులుకోకుండా పట్టు నిలుపుకుంది. పుణే జట్టులో దీపక్ హుడా 7 , రాజేష్ మండెల్ 8 అత్యధిక పాయింట్లను జమ చేశారు. రైడుల్లో పుణే 14-11తోను, టాకిల్ పాయింట్లలో 8-6, ఆల్ అవుట్ పాయింట్లలో 2-0తోను సత్తా చాటింది. ఎక్స్‌ట్రా పాయింట్ల సాధనలో ఢిల్లీ 4-2తో సత్తా చాటడం గమనార్హం.

నేడు మార్కెట్‌లోకి కొత్తగా గిరిజన ఉత్పత్తులు

మంత్రి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ (జిసిసి) ద్వారా కొత్త వస్తువులను అందుబాటులోకి తేనున్నట్టు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్ బాబు తెలిపారు. నన్నారి షర్బత్ టెట్రాఫ్యాక్, త్రిఫలా షర్బత్ పేరుతో శనివారం వీటిని మార్కెట్‌లోకి విడుదల చేయనున్నట్టు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్కెట్‌లో విడుదల కాకముందే వీటికి విశేషమైన స్పందన వస్తోందన్నారు. మార్కెటింగ్ ఆర్డర్లు కూడా బాగా వస్తున్నాయని తెలిపారు. జిసిసి పాటిస్తోన్న నాణ్యత ప్రమాణాలకు ఇది ఒక ఉదాహరణని పేర్కొన్నారు. జిసిసి ఉత్పత్తులకు విదేశాల్లో కూడా మంచి డిమాండ్ ఉందన్నారు. జిసిసి ద్వారా ఉత్పత్తి అయిన అరకు కాఫీకి ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చిందన్నారు. గిరిజనుల అటవీ ఉత్పత్తులకు, వ్యవసాయ పంటలకు జిసిసి ద్వారా ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు, ఆర్థికంగా చేయూతను అందిస్తోన్నట్టు పేర్కొన్నారు.

ఫిర్యాదుల రోజు ఎప్పుడు?

- అయోమయంలో సందర్శకులు
- అంధుణ్నీ నిలిపేసిన సెక్యూరిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివిధ సమస్యలతో సచివాలయానికి వచ్చే ప్రజల నుంచి వినతులు తీసుకునేందుకు నిర్దేశించిన ఫిర్యాదుల రోజు ఎప్పుడనేదానిపై అయోమయం నెలకొంది. ఇందువల్ల సచివాలయానికి వచ్చే సందర్శకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముందుగా ప్రతి సోమవారం ఫిర్యాదుల దినంగా ప్రకటించిన ప్రభుత్వం, తరువాత ప్రతి శుక్రవారాన్ని కూడా సందర్శకుల కోసం కేటాయించింది. అధికారులు, మంత్రులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. అయితే ప్రతి శుక్రవారం ఉద్యోగులు, అధికారులు హైదరాబాద్ వెళ్లిపోయేందుకు మధ్యాహ్నం నుంచే ప్రయత్నించడంతో ఫిర్యాదుల రోజును శుక్రవారం నుంచి గురువారానికి మార్పు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. కానీ గురువారం అనేది నిర్దిష్టంగా అమలు కావడంలేదు. దీనిపై తమకు ఇంకా స్పష్టమైన ఆదేశాలు రాలేదని, అందుకే తాము స్పందించడం లేదని కొందరు అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో శుక్రవారం సచివాలయానికి వచ్చే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తాజాగా ఈ శుక్రవారం కూడా అనేకమంది ఈ సమస్యను ఎదుర్కొన్నారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు చేసుకునేందుకు వచ్చిన వారు మరో రకమైన సమస్యను ఎదుర్కొంటున్నారు. నేరుగా ఫిర్యాదుల విభాగంలో అధికారులను కలిసి సమస్యను వివరించుకోవాలనుకుంటున్న వారికి చేదు అనుభవం ఎదురవుతోంది. కార్యాలయంలోని అధికారుల వద్దకు అనుమతించకుండా నేరుగా భవనం బయటే వినతి పత్రాలను సెక్యూరిటీ సిబ్బంది, విభాగం సిబ్బంది తీసుకుని సందర్శకులను బయటకు పంపించేస్తున్నారు. అనంతపురం నుంచి వచ్చిన ఒక అంధునికి కూడా శుక్రవారం ఇదే చేదు అనుభవం ఎదురైంది. ఎంతో కష్టపడి సచివాలయానికి చేరుకున్న ఆ యువకుణ్నీ ఫిర్యాదుల విభాగంలోకి అనుమతించలేదు. చివరకు ఆ యువకుడు బయట ఉన్న సిబ్బందికే తన వినతిపత్రాన్ని అందించి వెనుతిరగాల్సి వచ్చింది. ఇప్పటికైనా ఫిర్యాదులపై వచ్చే వారి కోసం స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని సందర్శకులు కోరుతున్నారు.



అధికార లాంఛనాలతో భార్గవ అంత్యక్రియలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అభ్యుదయ శాస్త్రవేత్త, సిసిఎంబి వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ పి. ఎం. భార్గవ అంత్యక్రియలు శుక్రవారం అధికార లాంఛనాలతో ముగిశాయి. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. గౌరవ సూచకంగా ఉన్నతాధికారుల సమక్షంలో పోలీసులు గాల్లోకి ఆరు రౌండ్లు కాల్పులు జరిపారు. ప్రజల సందర్శనార్థం భార్గవ పార్థీవ దేహాన్ని ఉప్పల్‌లోని ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉంచి మధ్యాహ్నం తరువాత అంతిమ యాత్ర నిర్వహించారు. జూబ్లీ హిల్స్ వరకు సాగిన ఈ యాత్రలో పలువురు రాజకీయ, ప్రజా సంఘాల నేతలు, యువ శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకుముందు సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ జనరల్ సెక్రటరీ రమేష్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జి నర్సింగరావు, బి, వెంకట్, నగర కార్యదర్శి, ఎం శ్రీనివాస్, మాజీ ఎంపి అజీజ్ పాషా, సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, మాజీ ఐఎఎస్ ఛాయారతన్, సినీ దర్శకులు నర్సింగరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి సింగ్ తదితరులు పీఎం భార్గవ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

29న కాకినాడ మున్సిపల్ ఎన్నిక నోటిఫికేషన్ జారీ

7 నుంచి నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వాయిదా పడుతూ వస్తున్న కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికకు ఎట్టకేలకు షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 7 నుంచి నామినేషన్ల పర్వం మొదలు కానుంది. గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు ఎన్నికలు వాయిదా వేస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో పలు ప్రజాసంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి. విచారణ చేపట్టిన హైకోర్టు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కాకినాడ మునిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసింది. నంద్యాల ఉప ఎన్నికల ఫలితం తేలనున్న మరుసటి రోజే కాకినాడ మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈనెల 7న నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించి, 10న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీగా నిర్ణయించింది. 11న నామినేషన్ల పరిశీలన చేపట్టి, 16న నామినేషన్ల ఉప సంహరణకు చివరి తేదీగా నిర్ణయించింది. ఆగస్టు 29న ఎన్నికలు నిర్వహించి, సెప్టెంబర్ 1న ఫలితాలు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

ఎన్నిక నుంచి రెండు వార్డుల మినహాయింపు

ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్

కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి హైకోర్టు ఎన్నికల సంఘానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. కాకినాడకు ఆనుకుని ఉన్న టీచర్స్ కాలనీ, స్వామినగర్, ఎస్.అచ్యుతాపురం శివారు ప్రాంతాలకు చెందిన 42, 48 వార్డుల్ని మినహాయించి కార్పొరేషన్ ఎన్నికల్ని నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. ఆ మూడు గ్రామాలను కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో 2015లో హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో శుక్రవారం పైవిధంగా హైకోర్టు న్యాయమూర్తి ఎ. వెంకట శేషసాయి ఉత్తర్వులిచ్చారు. కార్పొరేషన్‌ను 50 డివిజన్‌లుగా చేస్తూ జీవో 83తో పాటు డివిజన్లకు రిజర్వేషన్ల కల్పనకు జీవో 298లను మున్సిపల్ శాఖ జీవోలను జారీ చేసింది. మున్సిపల్ శాఖ నిర్ణయం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయంటూ గుమ్మడి శ్రీను బాబు తదిరులు హైకోర్టులో సవాల్ చేశారు. దీంతో 42, 48 డివిజన్లకు మినహా మిగిలిన వాటికి యథావిధిగా ఎన్నికలు నిర్వహించవచ్చునని న్యాయమూర్తి మధ్యంతర ఆదేశాలిచ్చారు.

ప్రభుత్వాస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించాలి

ప్రజారోగ్య వేదిక సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజలకు ప్రభుత్వాస్పత్రులపై, ఆధునిక చికిత్సా విధానాలపై నమ్మకం కలిగించాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి సూచించింది. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు సర్కారీ ఆస్పత్రుల్లోనే చికిత్స పొందాలనే చట్టాన్ని చేయాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. సుధాకర్, కన్వీనర్ ఎస్. సురేష్ శుక్రవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిని రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ విజయకృష్ణన్ తన ప్రసవం కోసం ఎంచుకోవడాన్ని అభినందించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది ఆస్పత్రికి వచ్చే రోగులు వారి సహాయకుల పట్ల శ్రద్ధ, ఆదరణ ప్రదర్శించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

అమరావతి డిక్లరేషన్‌పై 7న కీలక సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళా సాధికారతకు సంబంధించి అమరావతి డిక్లరేషన్‌కు తుది రూపం ఇచ్చేందుకు స్పీకర్ కోడెల శివప్రసాదరావు అధ్యక్షతన సోమవారం శాసనసభ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో కీలక సమావేశం ఏర్పాటు కానుంది. ఫిబ్రవరిలో నిర్వహించిన మహిళా పార్లమెంటేరియన్ల సదస్సు సిఫార్సులు, తీర్మానాలతో అమరావతి ప్రకటనను రూపొందిస్తారు. ఇందుకోసం ఇప్పటికే పది అంశాలతో కూడిన ముసాయిదాను సిద్ధం చేశారు. ఈ ప్రకటనకు తుదిరూపం ఇచ్చేందుకు సోమవారం సమావేశంలో పర్యాటక మంత్రి అఖిల ప్రియ, హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణి, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు.

నగదు రహిత లావాదేవీల్లో కృష్ణాకు డబ్ల్యూఎస్ఎ అవార్డు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా పంపిణీ వ్యవస్థలో నగదు రహిత లావాదేవీల అమలుకు సంబంధించి కృష్ణా జిల్లాకు వరల్డ్ సమ్మిట్ అవార్డు(డబ్ల్యూఎస్ఎ) లభించింది. ఈ అవార్డును రియల్ టైమ్ గవర్నెన్స్ సిఇఒ బాబు.ఎ న్యూఢిల్లీల్లో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో అందుకున్నారు. ఈ అవార్డుకు 178 దేశాల నుంచి వచ్చిన 400 ప్రతిపాదనలలో ముఖ్యమైన 40 ప్రాజెక్టులలో నగదు లేని ఎఐపిడిఎస్ పొందిన వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా బాబు ఎ మాట్లాడుతూ ఏపిలో దాదాపు 70 శాతంపైగా లబ్ధిదారులు తమ నెలసరి నిత్యావసర సరుకులను నగదు రహిత విధానంలో పొందుతున్నారని చెప్పారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68